thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 142 కరీంనగర్ గురువారం, 31 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి : ఖర్గే

దేశంలో గుత్తాధిపత్యం కారణంగా సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల సంస్థలతో సహా అన్నింటిలోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోంది. అన్నిచోట్లా తన ఆధిపత్యాన్ని నెలకొల్పు తోంది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కారణంగా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్ వైపు మొగ్గు చూపుతు న్నాయి. ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలు అందుబాటులో లేవు. 140 కోట్ల మంది ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారు. త్వరలోనే ఈ దేశ యువత మేలుకొని బ్యాలెట్‌లకు మద్దతుగా ఈవీఎంలకు వ్యతిరేకంగా తమ గొంతు వినిపిస్తారు' అని ఖర్గే పేర్కొన్నారు.



## బీజేపీలో ఏం జరుగుతోంది!?

### పెద్దవవుతున్న అసంతృప్తి గొంతులు

### ఈటల వర్సెస్ బండి కాస్తా ఈటెల వర్సెస్ బీజేపీగా మారుతుందా!?

హైదరాబాద్ : తెలంగాణా బీజేపీలో ఇపుడు అసంతృప్తి గొంతులు పెద్దవి అవుతున్నాయి. ఫైర్ బ్రాండ్ కాబట్టి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ ముందే తన నోరు పెంచి పార్టీ నుంచి బయటకు వెళ్ళిపోయారు. రాజకీయ వ్యూహాల్లో దిట్ట అనిపించుకున్న సీనియర్ నేత మల్కాజ్ గిరీ ఎంపీ అయిన ఈటల రాజెందర్ తీరు అలా కాదు. ఆయన కమలానికే కలవరం రేపుతున్నారు. తాజాగా ఆయన తన అనుచరులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో చేసిన కీలక వ్యాఖ్యలు చేశారు. నా మనుషులను సర్పంచ్ ఎన్నికల్లో దింపి గెలిపించుకుంటాను అని కూడా అన్నారు. ఇక ఆయన పేరు ఎత్తలేదు కానీ కేంద్ర మంత్రి బండి సంజయ్ మీద అనుచితమైన వ్యాఖ్యలు చేశారు అని కమలం పార్టీ పెద్దలు విషయాన్ని తీవ్రంగానే పరిశీలిస్తున్నారుట. ఆయనకు రెండు రోజులలో షోకాజ్ నోటీస్ జారీ చేస్తారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే ఈటల ఇంత హార్ష్ గా మాట్లాడినా ఆయన వ్యాఖ్యల విషయంలో ఎవరూ ఏమీ మాట్లాడొద్దు అని కేంద్ర మంత్రి బండి సంజయ్ తన అనుచరులకు సూచించడం విశేషం. దాంతో ఆయనకు కేంద్ర పెద్దల నుంచి ఏవో డైరేక్షన్లు వచ్చి ఉంటాయని భావిస్తున్నారు. మరో వైపు నుంచి చూస్తే ఈటల గత కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నారు అని అంటున్నారు. ఆయన బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి ఏమీ పెద్దగా సాధించలేకపోయారు అన్నది బాధగా ఉందని అంటున్నారు. కేంద్రంలో మంత్రి పదవి వస్తుందని ఆశపడినా నిరాశ ఎదురైంది. అలాగే తెలంగాణా బీజేపీ ప్రెసిడెంట్ పదవి కూడా దక్కలేదు.

ఇంకో వైపు ఆయన బీఆర్ఎస్ లోకి వెళ్తారా అన్నది కూడా ప్రచారం చేస్తున్న వారు ఉన్నారు. ఇపుడు చూస్తే ఏకంగా ఈటల కొత్త పార్టీ పెడతారు అని ప్రచారం మొదలెట్టేశారు. ఆ పార్టీకి తెలంగాణ బహుజన సమితి పేరు కూడా కొందరు ఖరారు చేశారు. తెలంగాణాలో ఇపుడు బీసీల మీదన పోరు సాగుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కూడా డిమాండ్ ఉంది. ఈటల తన అనుచరులు అభిమానుల సమావేశంలో కూడా తెలంగాణాలో వందా నూటయాభై నోరు లేని బీసీ కులాలకు రాజ్యాధికారం కోసం పోరాడిన చరిత్ర తనకు ఉందని చెప్పుకున్నారు. బీసీ సీఎం అన్నది తెలంగాణాలో కొత్త రాజకీయ నినాదంగా ఉంది. దాంతో ఈటెల ఆ విధంగా అడుగులు వేస్తారా అన్నది అంతా చర్చించుకుంటున్నారు. అంగబలం అర్ధబలం రెండూ కలిగి ఉన్న ఈటల కనుక కొత్త పార్టీ పెడితే తెలంగాణాలో మరో పొలిటికల్ ఫోర్స్ కి చాన్స్ ఉంటుందా అన్నది కూడా ఆలోచిస్తున్నారు. ఏది ఏమైనా ఒక్కటి నిజమని అంటున్నారు. ఈటల కమలం పార్టీలో ఇమడలేకపోతున్నారు. ఇక ఆయన అక్కడ ఉండేందుకు కూడా కొన్ని అంతర్గత శక్తులు అడ్డుకట్ట వేస్తున్నాయని అంటున్నారు. బీజేపీలో చూస్తే పదవులు అన్నీ మొదటి నుంచి ఉన్న వారికే ఇస్తారు తప్ప కొత్తగా వచ్చిన వారికి అవి దక్కవు. ఈ సత్యం అర్ధమైన తరువాతనే ఈటల గొంతు విప్పుతున్నారు అని అంటున్నారు. ఆయన తనకేమీ నష్టం లేదని కూడా వ్యాఖ్యానిస్తున్నారు అంటే వేరే ఆలోచనలు చేస్తున్నారా అన్నది కూడా ఉంది. ఏది ఏమైనా ఈటల వర్సెస్ బండి కాస్తా ఈటెల వర్సెస్ బీజేపీగా మారుతుందా అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు.



## తెలంగాణలో మరో కొత్త డిస్కం ఏర్పాటు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో మరో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ ఉండగా.. మరో డిస్కం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి, ప్రభుత్వ విద్యా సంస్థలకు, గృహజ్యోతి పథకానికి ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. విద్యుత్‌శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "రాష్ట్రంలో విద్యుత్ శాఖ ప్రక్షాళన కోసం సంస్కరణలు చేపట్టాలి. కొత్త డిస్కం ఏర్పాటు వల్ల ఇప్పుడున్న విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరు మెరుగుపడి.. జాతీయ స్థాయిలో రేటింగ్ పెరుగుతుంది. డిస్కంల పునర్వ్యవస్థీకరణతో పాటు విద్యుత్ సంస్థలపై ఇప్పుడున్న రుణభారం తగ్గించాలి. రుణాలపై పది శాతం వరకు వడ్డీలు చెల్లిస్తూ డిస్కంలు డీలా పడ్డాయి. తక్కువ వడ్డీలు ఉండేలా రుణాలను రీస్ట్రక్చర్ చేసుకునేలా వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యుత్ సంస్థల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తేవాలి. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం అనువైన భవనాలను గుర్తించే బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలి" అని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీ అక్రమ మద్యం కేసు.. దూకుడు పెంచిన సిట్...!

### 12 అట్టపెట్టెల్లో రూ.11 కోట్ల నగదు స్వాధీనం




హైదరాబాద్: ఏపీ మద్యం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో కొత్త కోణాలు బయటపడుతున్నాయి. నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టిన సిట్ అధికారులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. రాజ్ కెసిరెడ్డి సూచన మేరకు 12 బాక్సుల్లో భద్ర పరిచిన రూ.11 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారంలోని సులోచన ఫార్మ్ గెస్ట్ హౌస్‌లో అక్రమ మద్యం నగదు డంప్‌ను గుర్తించారు. లిక్కర్ స్కామ్‌లో ఏ-40 వరుణ్ పురుషోత్తం నోట సంచలన నిజాలు వెల్లడయ్యాయి. అతని వాంగ్మూలం ఆధారంగా తనిఖీలు చేపట్టిన అధికారులకు భారీగా నగదు పట్టుబడింది. నగదు సీజ్ ఘటనలో చాణక్య, వినయ్ పాత్రపైనా సిట్ బృందం విచారణ చేపట్టింది. రాజ్ కెసిరెడ్డి, చాణక్య ఆదేశాల మేరకు జూన్ 2024లో వినయ్ సాయంతో వరుణ్ రూ.11 కోట్ల నగదు ఉన్న 12 అట్ట పెట్టెలను ఆఫీస్ ఫైళ్ల పేరుతో దాచినట్టు సిట్ అధికారులు గుర్తించారు. నిన్న దుబాయ్ నుంచి వచ్చిన వరుణ్ పురుషోత్తమ్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీ మద్యం స్కామ్‌లో రాజ్ కెసిరెడ్డి వసూళ్ల బృందంలో వరుణ్ కీలక వ్యక్తి. అతడి నుంచి సిట్ అధికారులు కీలక సమాచారం రాబట్టారు. వరుణ్‌పై విజయవాడ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేసింది. వరుణ్ పురుషోత్తం నేరాన్ని అంగీకరించి నిజాలు బయటపెట్టడంతో లిక్కర్ స్కామ్‌కి చెందిన భారీ నగదు నిల్వల విషయం వెలుగులోకి వచ్చింది. మరి కొన్ని చోట్ల సిట్ సోదాలు నిర్వహించే అవకాశముంది. వైకాపా ప్రభుత్వంలో ముఖ్య నేతల పాత్రపై కూడా సిట్‌కు కీలక సమాచారం లభ్యమైనట్టు తెలుస్తోంది. పూర్తి ఆధారాలతో త్వరలో కొందరు పెద్దతలకాయల పాత్ర కూడా బయటపడే అవకాశముందని సమాచారం.

**ఫామ్‌హౌస్ యజమాని విజయేందర్‌రెడ్డి?..** వర్ధమాన్ కళాశాల వద్ద ఉన్న సులోచన ఫార్మ్ గెస్ట్ హౌస్ యజమానిని విజయేందర్‌రెడ్డిగా గుర్తించారు. ఆయన తల్లి సులోచన పేరుతో ఫామ్‌హౌస్ ఉంది. అక్కడే వర్ధమాన్ కళాశాల క్రీడా ప్రాంగణం, వసతిగదులు ఉన్నాయి.

స్టోర్ రూమ్‌లో బియ్యం బస్తాల మధ్య అట్టపెట్టెల్లో నగదు దాచి ఉంచారు. పక్కా సమాచారంతో వెళ్లిన ఏపీ సిట్ అధికారులు రూ.11 కోట్ల నగదు జప్తు చేశారు. పట్టుబడిన నగదుపై ఈడీ, ఐటీ దృష్టి సారించే అవకాశముంది. ఏపీ సిట్ తొలి ఛార్జిషీట్‌లోనే యూపీ డిస్టిలరీ పేరు ప్రస్తావించింది. 16 డిస్టిలరీల ముడుపులే రూ.1,677.68 కోట్లుగా సిట్ గుర్తించింది. రాజ్ కెసిరెడ్డి బినామీ సంస్థనే యూపీ డిస్టిలరీస్. హైదరాబాద్‌లోని అరేట్ ఆసుపత్రి డైరెక్టర్లుగా తీగల ఉపేందర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి ఉన్నారు.




హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై ఉత్కంఠ నెలకొంది. రేపటి(గురువారం)తో జస్టిస్ ఘోష్ కమిషన్ గడువు ముగియనుంది. ఇప్పటికే కాళేశ్వరం కమిషన్ విచారణ పూర్తయింది. రేపు ఫైనల్ రిపోర్టుపై పీసీ ఘోష్ సంతకం చేయనున్నారు. ఆగస్టు 1వ తేదీ లేదా 2వ తేదీన తెలంగాణ ప్రభుత్వానికి కాళేశ్వరం రిపోర్ట్ అందజేయనుంది. జస్టిస్ ఘోష్ కమిషన్ గడువును మరో 2, 3 రోజులు రేవంత్ ప్రభుత్వం పెంచే అవకాశాలు ఉన్నాయి. కమిషన్ రిపోర్ట్‌పై అసెంబ్లీలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌లో ఏయే అంశాలు చేర్చారనే అంశం ఉత్కంఠగా మారింది. కాగా, గత కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరంలో భారీగా అవినీతికి పాల్పడిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సుప్రీమ్ కోర్టు మాజీ జడ్జి పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌ను 2024లో రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్‌తో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపించింది కాంగ్రెస్ ప్రభుత్వం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను, పలువురు కీలక అధికారులను ఈ కమిషన్ విచారణ జరిపింది. ఈ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్, ఈ ప్రాజెక్ట్‌లో పనిచేసిన అధికారులని క్నూడా విచారించింది. కమిషన్‌కు వారు ఇచ్చిన సమాచారం కూడా కీలకంగా మారింది. అయితే దీనికి తోడు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో పనిచేసిన పలువురు అధికారుల నివాసాల్లోనూ ఏసీబీ సోదాలు జరిగిన విషయం తెలిసిందే.

ఈ తనిఖీల్లో పలు కీలక డాంక్యుమెట్లని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి సమర్పించారు. అయితే రేపటి(గురువారం)తో జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ పూర్తికానుంది. ఈ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా రేవంత్ ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

## జూబ్లీహిల్స్‌లో పొన్నం చిచ్చు!

### సీఎం హెచ్చరించినా పాటించకపోవడంతో వివాదం?

హైదరాబాద్ : తెలంగాణలో జూబ్లీహిల్స్ బైపోల్ రేస్ రోజు రోజుకు ఇంట్రెస్టింగ్ గా మారుతున్నది. హైదరాబాద్ లోనే రిచెస్ట్ నియోజక వర్గంగా పేరున్న ఈ స్థానంలో తమ సత్తా ఏంటో చాటేందుకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నాయి. అయితే ఈ ఉప ఎన్నికను తమ ఖాతాలో వేసుకోవడం ద్వారా తమ పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ క్రమంలో ఈ ఉపఎన్నిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ బై పోల్ అభ్యర్థి విషయంలో తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ లో చిచ్చు రాజేశాయి. హైదరాబాద్ ఇన్ చార్జి మంత్రిగా ఉన్న పొన్నం నిన్న మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ బై పోల్ లో కాంగ్రెస్ టికెట్ బయటి వాళ్లకు ఇవ్వబోమన్నారు. 'అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది. కానీ అభ్యర్థి మాత్రం స్థానిక జూబ్లీహిల్స్ కు చెందిన వ్యక్తి మాత్రమే ఉంటారు' అని స్పష్టం చేశారు. మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు హైదరాబాద్ కాంగ్రెస్ లో రచ్చగా మారాయి.

**పొన్నం ఏమైనా హైకమాండా?:** పొన్నం చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ కౌంటర్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ స్థానికులకే టికెట్ ఇస్తామని చెప్పడానికి పొన్నం ఏమైనా హైకమాండా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వయనాడ్‌లో పుట్టి పెరిగారా? మరి వాళ్లెందుకు వయనాడ్‌లో పోటీ చేశారు? అని నిలదీశారు.

ఇది కాంగ్రెస్ పార్టీ.. అభ్యర్థి ఎంపిక కు ప్రాసెస్ ఉంటుంది అని హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి చనిపోవడంతో జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ పార్టీకి సింపతీ ఉంది. స్థానికులకే జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే టికెట్ ఇస్తామనడం మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదన్నారు. అయితే అజారుద్దీన్ ను తన పక్కన పెట్టుకుని పొన్నం ఈ వ్యాఖ్యలు చేయడంతో కాంగ్రెస్ పార్టీలో జూబ్లీహిల్స్ టికెట్ ఆశిస్తున్నవారిని ఆగ్రహానికి గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.



**రేవంత్ మాటలు పెడచెవిన!:** జూబ్లీహిల్స్ అభ్యర్థి విషయంలో రాబోయే పరిణామాలను పసిగట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే పార్టీ నేతలను అప్రమత్తం చేశారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని హెచ్చరించారు. గత నెలలో జరిగిన కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో నేతలకు దిశానిర్దేశం చేసిన రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీని సిద్ధం చేయాలని సూచించారు. అభ్యర్థి విషయంలో ఎవరూ మాట్లాడకూడదని ఆదేశించారు. అయితే జూబ్లీహిల్స్ టికెట్ నాదే అని అజారుద్దీన్ గతంలో ప్రకటన చేయడంతో సీఎం ఈ హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఇంతలా హెచ్చరించినా మంత్రి పొన్నం మాత్రం అదే అజారుద్దీన్ ను పక్కన పెట్టుకుని స్థానికులకే టికెట్ అంటూ స్టేట్ మెంట్ ఇవ్వడం హైదరాబాద్ కాంగ్రెస్ లో తాజా వివాదానికి దారి తీసింది.

ఇక్కడ ముస్లిం మైనార్టీ ఓటర్లు డెసిషన్ మేకర్ పొజిషన్ లో ఉన్నారు. ఈ నేపథ్యంలో మైనార్టీ ఓటర్లే టార్గెట్ బీఆర్ఎస్ పావులు కదుపుతుంటే, ఈక్కడ జెండా పాతేందుకు కమలం పార్టీ కసరత్తు చేస్తోంది. ఇటువంటి తరుణంలో పొన్నం చేసిన వ్యాఖ్యలతో మరో కాంగ్రెస్ లోని మరో మైనార్టీ నేత ఫిరోజ్ ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేయడం అధికార పార్టీలో కాకరేపుతోంది. అంతిమంగా టికెట్ ఎవరికి దక్కినా కాంగ్రెస్ పార్టీలో తాజా పరిణామాలు పొలిటికల్ హీట్ ను పెంచుతున్నాయి.



# యూరియా కోసం రైతుల తిప్పలు.. భాజపా నేతల గొప్పలు

హైదరాబాద్: వ్యవసాయ రంగంపై కనీస అవగాహన లేకుండా భాజపా నేతలు మాట్లాడుతున్నారని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేంద్రం సరఫరా చేసిందన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ఒక రాష్ట్రానికి పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. రామచంద్రరావుకు, భాజపాకి తెలంగాణ రైతాంగం పట్ల ఉన్న నిబద్ధతను ఏంటో తెలుస్తోందని ఎద్దేవా చేశారు. రైతుల విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదని ఎన్నిసార్లు తాను విన్నవించినా.. రామచంద్రరావు వైఖరి మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి రాష్ట్ర రైతాంగం యూరియా కోసం క్షేత్రస్థాయిలో తిప్పలు పడుతుంటే చేయని గొప్పలు చేసినట్లుగా చెప్పుకొంటున్నారని, అది వారి అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ మొత్తానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు. ఇది తెలియకుండా 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని భాజపా నాయకులకు హితవు పలికారు. ఇప్పటికే ఎన్నో సార్లు క్షేత్రస్థాయి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఇతర లెక్కలతో సహా కేంద్ర రసాయన ఎరువులశాఖ మంత్రి, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి, సహాయ మంత్రికి లేఖలు రాశామని.. తాజాగా రామచంద్రరావుకు కూడా లేఖ రాసినట్లు తుమ్మల పేర్కొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డితో మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్ భేటీ

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు.

జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్‌లపై దిల్లీలో పోరాడేందుకు కార్యాచరణపై చర్చించారు. దాదాపు గంటన్నరపాటు ఈ సమావేశం కొనసాగింది. ఈనెల 31 నుంచి వచ్చే నెల 4 వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి దిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణ వీరి మధ్య చర్చకు వచ్చింది. ఆగస్టు 5న పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టాలని నిర్ణయించారు. ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు, బీసీ సంఘాల నేతలు పాల్గొననున్నారు.

7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నారు. ప్రత్యేక రైలులో ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది నేతలు, కార్యకర్తలు దిల్లీకి వెళ్లనున్నారు. దిల్లీ పర్యటన అనంతరం కాంగ్రెస్ పాదయాత్ర యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు.

# బీసీ రిజర్వేషన్లపై భాజపా, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు: వినోద్ కుమార్



హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో భాజపా, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని భారత రాష్ట్ర సమితి మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. ప్రధాని మోదీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అనుకుంటే గంటలోపు బిల్లుకు ఆమోదం లభిస్తుందని పేర్కొన్నారు. శాసనసభ, మండలి బిల్లు ఆమోదించిన అంశంపైనే ఆర్డినెన్స్ సాధ్యం కాదని.. కాంగ్రెస్, భాజపాలు బీసీలను ఎందుకు మోసం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, చట్టసవరణ చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేరిస్తేనే న్యాయపరమైన రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రైవేట్ బిల్లు పెట్టొచ్చు కదా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ అడగరు, మోదీ చేయరు, అన్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 243%ణ%లోని %జ% క్లాజ్‌కు సవరణ చేసినా కూడా బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతుందని వినోద్ తెలిపారు. ముఖ్యమంత్రిగా ఉండి ధర్నాలు అంటూ డ్రామాలు చేయాల్సిన అవసరం లేదని, రాహుల్ గాంధీతో కలిసి వెళ్లి మోదీని అడగాలని సీఎం రేవంత్‌కు సూచించారు. భాజపాకు చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ హయాంలో ఆమోదించిన, రేవంత్ రెడ్డి హయాంలో ఆమోదించిన బిల్లులను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

# మూడేళ్ల తర్వాత నల్లగొండ కాంగ్రెస్ నాయకులను నేనే సర్కస్ ఆట ఆడిస్తా : ఎమ్మెల్యే జగదీశ రెడ్డి

హైదరాబాద్ : మూడేళ్ల తర్వాత నల్లగొండ కాంగ్రెస్ నాయకులను నేనే సర్కస్ ఆట ఆడిస్తానని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఎంత ఎగిరినా మూడేళ్లే కదా.. ఆ తర్వాత మీకు మేము చూపిస్తాం బిడ్డా సర్కస్ ఆట అని ఘాటుగా వ్యాఖ్యానించారు జగదీశ్ రెడ్డి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై తుంగతుర్తి నియోజకవర్గంలోని పాటిమట్ల గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మోత్కూరు, అడ్డగూడూరు మండలాల బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మోత్కూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ అమీర్, మహేశ్వరం హనుమంతు, వెంకట్‌తో పాటు పలువురు నాయకులకు జగదీశ్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి ప్రసంగించారు. 2018లో నల్గొండ నాయకులను ఓడగొట్టే బాధ్యత తీసుకున్నా, అందరిని ఓడించిన.. ఇప్పుడు వీళ్లందరినీ సర్కస్ ఆడించే బాధ్యత తీసుకుంటా, వీళ్ళతో ఆడిస్తా. కాంగ్రెస్ నాయకుల ఉడతా ఊపులకు మేము భయపడం. కేటీఆర్ రేవంత్ రెడ్డిని హౌలే అంటే బండి సంజయ్ ఒకటే ఏడుస్తున్నాడు. బండి సంజయ్‌కి ఏం సంబంధం అసలు? కాంగ్రెస్ మంత్రులు ఏమో మేము అనలేకపోయినా కేటీఆర్ అన్నాడు అని సంతోష పడుతుంటే.. బీజేపీ మంత్రులు ఏమో ఏడుస్తున్నారు. రేవంత్ రెడ్డిని హౌలే అంటేనే మీకు అంత కోపం వస్తుంది కదా.. అలాంటిది తెలంగాణ కోసం చావు అంచులదాకా వెళ్లిన కేసీఆర్‌ని లాగులో తొండలు వేస్తా, గుడ్లు పీకి గోలీలు ఆడుతా, పేగులు తీసి మెడలో వేసుకుంటా, ఉరి తీస్తా, పెట్రోల్ పోసి సంపుతా అన్నప్పుడు కేటీఆర్ హౌలే అని అంటే తప్పేముంది అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. మోదీ తెలంగాణలో ఈడీ రైడ్స్ కేసీఆర్ మీద బీఆర్ఎస్ పార్టీ మీద చేయిస్తున్నాడు. తమిళనాడులో అక్కడి స్టాలిన్ ప్రభుత్వం మీద ఈడీ రైడ్స్ అవుతున్నాయి.. కానీ ఇక్కడ తెలంగాణలో రేవంత్ ప్రభుత్వాన్ని మోదీ కాపాడుతున్నాడు. మోదీ శత్రుత్వం చూపించాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం మీద, రేవంత్ రెడ్డి మీద చూపించాలి కానీ ఇక్కడ వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ మీద చూపిస్తున్నాడు అని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు.



# గొర్రెల పంపిణీ కుంభకోణం.. హైదరాబాద్‌లో 6 చోట్ల ఈడీ సోదాలు

హైదరాబాద్: గొర్రెల పంపిణీ కుంభకోణం కేసులో హైదరాబాద్‌లోని ఆరుచోట్ల ఈడీ సోదాలు చేపట్టింది. పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామచందర్ నాయక్, ప్రధాన నిందితుడు మొయినుద్దీన్, పలువురి ఇళ్లలో అధికారులు తనిఖీలు చేశారు. తొలుత ఈ కుంభకోణంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. గొర్రెల పంపిణీతో రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వేల మంది లబ్ధిదారులకు సుమారు రూ.4వేల కోట్ల విలువైన గొర్రెలను పంపిణీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో మొదటి నుంచి అధికారులు, దళారులు కుమ్మక్కై నిధులు స్వాహా చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. కొంత మంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు రికార్డుల్లో చూపించి, ఆ నిధుల్ని ఈ ముఠా స్వాహా చేసింది. ఈ నిధుల్ని బినామీ ఖాతాల్లోకి మళ్లించి అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు వెల్లడైంది. ఈ కుంభకోణంలో కొందరు పెద్దల పాత్ర కూడా ఉన్నట్లు ఏసీబీ, ఈడీ అనుమానిస్తోంది.



# సాగర్ 26 గేట్లు ఎత్తి నీటి విడుదల

**నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం కూడా మొత్తం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లోకి ఇన్ ఫ్లో 1,68,988 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 3,13,016 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా.. ప్రస్తుతం 586.5 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 302.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది.**



# బెట్టింగ్ యాప్స్‌తో డబ్బు సంపాదించాలని భావించొద్దు

హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్‌తో డబ్బు సంపాదించాలని ఎవరూ భావించవద్దని సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ సూచించారు. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం కేసులో ఈడీ ఎదుట విచారణకు ఆయన హాజరైన సంగతి తెలిసిందే. అధికారులు ఆయన్ను ఐదు గంటలపాటు విచారించారు. అనంతరం మీడియాతో ప్రకాశ్‌రాజ్ మాట్లాడారు. బెట్టింగ్ యాప్స్ ప్రచారం వ్యవహారంలో నిర్వాహకుల నుంచి తనకు డబ్బులు అందలేదన్నారు.

ఇక నుంచి బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేయనని తెలిపారు. ఈడీ అధికారులు తాను చెప్పిన విషయాలను నమోదు చేసుకున్నారని, మళ్లీ విచారణకు పిలవలేదన్నారు.



# భద్రాచలం రాములోరిని దర్శించుకున్న రామచందర్ రావు

**భద్రాచలం: భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందరరావు భద్రాచలం సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అందరికీ మంచి జరగాలని స్వామివారిని ప్రార్థించారు. అంతకుముందు ఆయనకు భాజపా నేతలు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం రామచందర్‌రావుకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.**



# సునామీ ముప్పు.. తరలుతోన్న రాష్ట్రం

రష్యాలోని కామ్చాట్కా ద్వీపకల్పంలో బుధవారం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. దీని ప్రభావంతో రష్యా, జపాన్ తీర ప్రాంతాలను సునామీ తాకింది. పలుచోట్ల రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. వీటితో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు, దీవులకు సునామీ ముప్పు పొంచి ఉంది. అమెరికాలోని ద్వీప రాష్ట్రం హవాయి మొత్తానికి సునామీ హెచ్చరిక జారీ అయింది. అలలు ఆరు అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతున్నాయి. రాష్ట్రం మొత్తం సునామీ సైరన్లు వినిపించాయి. దాంతో పర్యాటకులు, స్థానికులు తమ స్వస్థలాలను వీడి ఎత్తైన ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఒక్కసారిగా రాష్ట్ర ప్రజలంతా తరలుతుండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్లన్నీ కారులతో బారులు తీరాయి. ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక అలస్కాలోని కొన్ని ప్రాంతాలను అమెరికా వాతావరణ విభాగం అప్రమత్తం చేసింది.

**ఒక్క అలగానే రాదు.. జాగ్రత్త..!..** అమెరికా వాతావరణ విభాగం కీలక హెచ్చరిక జారీ చేసింది. సునామీ తీవ్రతను తేలిగ్గా తీసుకోవద్దని, ఫొటోల కోసం తీరానికి వెళ్లొద్దని చెప్పింది. ఒక్క అలతో సునామీ రాదని, అలలు పెద్దసంఖ్యలో వస్తాయని, సముద్రం నుంచి తీరానికి వచ్చే నీటి పరిమాణం భారీగా ఉంటుందని వెల్లడించింది. ఇదిలాఉంటే.. జపాన్ తీర ప్రాంతంలోని 9 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. చైనాకు ఈ ప్రకృతి విపత్తు ముప్పు పొంచి ఉంది. సునామీనే కాకుండా సైక్లోన్ ప్రమాదమూ ఉంది. దాంతో షాంఘైలోని 28 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విమానాలు, బోట్ సర్వీసులను నిలిపివేశారు. ప్రస్తుతం తూర్పు చైనాలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తున్నాయి. రష్యాలో తూర్పు ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వచ్చిన భారీ భూకంపం కారణంగా దాంతోపాటు చుట్టుపక్కల దేశాలపై సునామీ అలలు విరుచుకుపడ్డాయి. అలలు తాకిన దీవుల్లో రష్యా అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ సునామీ వల్ల ఆయా ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి.

# అలనాటి మేటి గాయకుడు రఫీ - జూలై 31...మహమ్మద్ రఫీ వర్ధంతి



హిందీ సినిమా రంగం 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. ఆయన ఉత్తర భారత ప్రముఖ నేపథ్య గాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. కేవలం రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళు నిజం. తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ 24 డిసెంబర్ 1924 పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. అలా చిన్నప్పుడే సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటు దేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడడానికి 1944లో బొంబాయి వెళ్లాడు. 'గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం నిజంగా మహమ్మద్ రఫీ యుగం. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు. రఫీ, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్య గాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం, జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కొడుకు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ. నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ - జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ.పీ.నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ - ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా మరియు ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నీస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో "తేరా జల్వా జిస్ నే దేఖా" మరియు జుగ్ను (1947) చిత్రంలో "వో అప్ని యాద్ దిలాన్ కో" పాటల కోసం తెరపై కనిపించాడు. 1948 - స్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్ లాల్ నెహ్రూ చేతుల ద్వారా ప్రదానం చేయ బడింది. 1967 - భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేయ బడింది. 2001 - హీరో హొండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా "బెస్ట్ సింగర్ ఆఫ్ ద మిలీనియం గౌరవ ప్రదానం. 2013 - సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు. "చౌధవీం కా చాంద్ హెూ" , "తేరీ ప్యారీ ప్యారీ సూరత్ కో", "చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే","బహారో ఫూల్ బర్సావో", "మై గావూ తుమ్ సోజావో", "ఖిలోనా జాన్ కర్", "క్యా హువా తేరా వాదా", ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రంలోని "ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ", ఎన్టీఆర్ 'ఆరాధన'లో "నా మది నిన్ను పిలిచింది గానమై".. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన "సిపాయి" పాట నేటికీ తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి వుంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచి పోయాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఆసమానాలు అటవీ రేంజర్ల త్యాగాలు - జూలై 31...ప్రపంచ రేంజర్ దినోత్సవం




ప్రకృతిని పరిరక్షించేవారు ఆయుధాలతో కాదు... అడవిలో అడుగులు వేసే నిరాహంకార పాదాలతో, వన్య జీవులను కాపాడే మానవతా హృదయాలతో. అలాంటి అటవీ సంరక్షకులు ౧ రేంజర్లు ౧ వారి సేవలకు స్మరణార్థంగా ప్రతి సంవత్సరం జూలై 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ రేంజర్ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం వన రక్షకుల త్యాగాలకు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లకు గుర్తింపుగా, భద్రతా హక్కులపై చర్చకు వేదికగా నిలుస్తోంది. 1992లో ఏర్పడిన ఇంటర్నేషనల్ రేంజర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2007 నుంచి ఈ దినోత్సవం నిర్వహించ బడుతోంది. ఇదే తేదీన 1992లో విధిలో ప్రాణాలు కోల్పోయిన యుగాండా రేంజర్‌కు స్మారకంగా జూలై 31ను ఎంచుకున్నారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా 100కి పైగా దేశాల్లో ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. రేంజర్ పదవిని మామూలుగా అటవీ భద్రతా ఉద్యోగిగా భావించినా... వాస్తవానికి వీరు పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్య సంరక్షణకు ముందు వరుసలో నిలిచే యోధులు. వారివల్లే మన అడవులు, వన్య ప్రాణులు, ప్రకృతి వనరులు కాపాడ బడతాయి. వీరు వేటగాళ్లు, అక్రమ కలప స్మగ్లర్లు, అడవిని ఆక్రమించే వారితో రోజూ పోరాడాల్సి వస్తోంది. దట్టమైన అడవులు, కఠిన వాతావరణ పరిస్థితులు, హింసాత్మక ఘటనలు వీరి పని భాగమై పోయాయి. కానీ వీరికి సరైన మౌలిక వసతులు, రక్షణా పరికరాలు, శిక్షణలు చాలా చోట్ల లేవు. ఇలాంటి పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారు. గత 15 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 1,700 మందికి పైగా వన రక్షకులు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఒక్క ఏడాది లోనే 137 మంది రేంజర్లు మరణించారు, వీరిలో 46 మంది హత్యలు, 22 మంది వాతావరణ ప్రమాదాలు, 19 మంది వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు విడిచారు. ప్రస్తుతం 105కి పైగా దేశాల్లో 2 లక్షల మంది వన రక్షకులు విధుల్లో ఉన్నారు. వారి ప్రాణాలకు గౌరవంగా పనిచేస్తున్న థిన్ గ్రీన్ లైన్ ఫౌండేషన్ వంటి సంస్థలు వీరి కుటుంబాలకు సహాయ పడుతున్నాయి. భారత దేశం మొత్తం 7,13,789 చదరపు కిలోమీటర్ల అటవీ భూమిని కలిగి ఉండగా, దాదాపు 2.5 లక్షల మంది అటవీ ఉద్యోగులు ఈ విభాగంలో ఉన్నారు. వీరిలో రేంజర్లు, బీట్ గార్డులు, వన్య జీవ పరిరక్షణ అధికారులు ముఖ్యులు. గడచిన 20 ఏళ్లలో 250 మందికి పైగా భారత రేంజర్లు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార?ండ్, నాగలాండ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వన రక్షకులు మావోయిస్టు దాడులు, అక్రమ వేటగాళ్ల హింసను ఎదుర్కొన్నారు. 2019లో ఛత్తీస్ గఢ్‌లో ఓ రేంజర్ మావోయిస్టుల పేలుడు బాంబులో మరణించాడు. 2021లో మాధవరావ్ నేషనల్ పార్క్‌లో ఒక జింకను రక్షించేందుకు ప్రయత్నిస్తూ ఓ రేంజర్ మరణించాడు. 2023లో ఒడిశాలోని సింహాచలం అడవిలో అక్రమ వేట నుంచి ప్రాణులను రక్షిస్తూ ఒక మహిళా రేంజర్ ప్రాణాలు కోల్పోయింది. 2024లో తెలంగాణలోని కౌన్సర్ ఫారెస్ట్ రిజర్వులో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు వన రక్షకులపై సామూహిక దాడి జరిగింది. ఈ నేపథ్యంలో రేంజర్లకు ఎదురయ్యే ప్రధాన సవాళు : ఆధునిక టెక్నాలజీ లేమి %- లూూ%, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలు లేవు. భద్రతా దుస్తులు, ఆయుధాల లేమి. అల్ప వేతనాలు, రాత్రిపూట పని, మానసిక ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు. విధుల్లో గాయపడినా మెరుగైన వైద్యం లేకపోవడం. మరణించిన తర్వాత కుటుంబాలకు సరైన న్యాయం, పరిహారం ఆలస్యంగా రావడం. ఈ నేపథ్యంలో కేంద్ర వనశాఖ, విధుల్లో మరణించిన రేంజర్లకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలన్న ప్రతిపాదన చేసింది. రాష్ట్రాల స్థాయిలో కూడా రేంజర్లకు విశ్రాంతి వసతులు, ఆరోగ్య శిబిరాలు, రక్షణా పరికరాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వన రక్షకులను సైనికుల్లా గౌరవించాలి. వన యోధుడు పురస్కారం వంటి అవార్డులు ఇవ్వాలి. అటవీ సంరక్షణలో సమాజం భాగస్వామ్యంగా మారాలి. పాఠశాల స్థాయిలో నుంచే వన్యజీవ సంరక్షణపై అవగాహన కల్పించాలి. పర్యాటకులు అటవీ నియమాలను గౌరవించాలి. పౌర సమాజం రేంజర్లకు మద్దతుగా నిలవాలి. ప్రపంచ రేంజర్ దినోత్సవం అంటే కేవలం స్మరణ మాత్రమే కాదు... అది ఒక బాధ్యత. మనకు ఊపిరినిచ్చే అడవులను కాపాడే వారి పోరాటాన్ని గౌరవించాల్సిన బాధ్యత. వారు మాట్లాడే వారు కాదు, ప్రకృతికి స్వరమిచ్చే వారు. అటువంటి వనరక్షకులకు మన హృదయ పూర్వక వందనం.**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# చిత్తా నక్షత్రంలో వెలిసిన సుదర్శనుడు: సుదర్శన జయంతి వైభవం

భారత ఆధ్యాత్మిక సాంప్రదాయంలో విశిష్ట స్థానం సంపాదించిన దివ్యాయుధాలలో సుదర్శన చక్రాయుధం ముఖ్యమైనది. ఇది కేవలం ఆయుధంగా కాక, స్వతంత్ర దేవత తత్త్వంగా పూజింపబడే తత్త్వశక్తి. సుదర్శనుడు విష్ణుమూర్తికి ఆయుధరూపంగా వర్ణించబడినా, ఆయన తత్త్వానికి వెలుగు నిచ్చే ప్రతీకగా, కాల నియంత్రణ, దిక్ఛేదనం, దుర్గుణ నివారణకు మార్గదర్శకంగా భావించబడుతున్నాడు. ఈ సుదర్శనుడు ఆగమశాస్త్ర ప్రకారం చిత్తా నక్షత్రంలో, సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశించిన సందర్భాన సుదర్శనుని అవతారం సంభవించినదిగా పేర్కొనబడింది. ఈ కాలాన్ని 'కర్కాటక సంక్రమణం' అంటారు. ఈ ఏడాది 2025లో జూలై 31 గురువారం చిత్తా నక్షత్రం సంభవిస్తున్నందున ఈ పుణ్యదినం సుదర్శన జయంతిగా దేశవ్యాప్తంగా పూజలు, హవనాలు ఘనంగా జరుగనున్నాయి. చిత్తా నక్షత్ర స్వభావాన్ని పరిశీలించినప్పుడు ఇది తపస్సు, దైవశక్తిపట్ల నిబద్ధత, చిత్తశుద్ధి, న్యాయనిష్ఠా వంటి విలువలకు ప్రతీకగా చెప్పబడుతుంది. ఇదే నక్షత్రంలో సుదర్శనుని అవతారం జరిగిందనడం ద్వారా ఆత్మశుద్ధికి, ధర్మవ్యతిరేక శక్తుల నిర్మూలనకు ఈ తత్త్వం ఎంతటి శక్తివంతంగా పనిచేస్తుందో స్పష్టమవుతుంది. సుదర్శనుని తత్త్వాన్ని విశ్లేషించినప్పుడు అది కేవలం శారీరక ఆయుధబలాన్ని సూచించదు. ఇది జ్ఞానశక్తి, ఆత్మబలాన్ని సూచిస్తుంది. సుదర్శనుని రూపం అష్టకోణాకారమై ఉండడం, అందులో 108 ధారలు ఉండటం, కాలచక్రానికి ప్రతీకగా నిలవడం, ఈయన త్రిశక్తులను %-% సృష్టి, స్థితి, లయ శక్తులను తనలో సేకరించుకోవడం ఇందుకు ఉదాహరణలు. వేద, పురాణ, ఆగమ సాహిత్యంలో సుదర్శనుని ప్రాధాన్యం విస్తృతంగా ఉంది. విష్ణుపురాణం, నారదపాంచరాత్రం, భాగవతం, అగ్నిపురాణం వంటి గ్రంథాలలో ఈయన మహిమలు విశదీకరించబడ్డాయి. శ్రీకృష్ణుని చేత శిశుపాలుని శిరశ్చేదం, మత్స్యావతారంలో హయగ్రీవాసురుని సంహారం, నరసింహ రూపంలో హిరణ్యకశిపుని వ్యతిరేక శక్తుల వినాశనం, అర్జునునికి ఇచ్చిన సుదర్శనాస్త్రం వంటి విశిష్ట ఘట్టాల్లో ఈ చక్రాయుధ శక్తి ప్రభావం కనిపిస్తుంది. ఆధ్యాత్మికంగా చూసినప్పుడు ఇది మనస్సు లోపాలను, అహంకారాన్ని, మోహాన్ని అణిచివేసే తత్త్వశక్తిగా ఆరాధించబడుతోంది. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి కుడిచేతిలో ఉండే సుదర్శన చక్రం 'చక్రత్తాళ్వార్'గా భక్తులనుండి పూజలు అందుకుంటుంది. ప్రత్యేక పూజా విధానాలు, హోమాలు, అలంకారాలు ఈ దివ్యాయుధానికి నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం చిత్తా నక్షత్రంలో, కర్కాటక సంక్రమణ సమయంలో జరుపుకునే సుదర్శన జయంతి సందర్భంగా తిరుమల, కంచీ, మంగలగిరి, శ్రీకాకుళం, శ్రీరంగం, మదురై వంటి క్షేత్రాల్లో ఘనోత్సవాలు జరుగుతాయి. సుదర్శన హోమం ఈ రోజున అత్యంత పవిత్రంగా నిర్వహించబడుతుంది. ఈ హోమం నిర్వహణ వల్ల శరీర-మానసిక దోష నివారణ, ఆరోగ్య రక్షణ, పాప విమోచన, శత్రు శాంతి, పితృదోష నివారణ, గ్రహదోష శాంతి లాంటి అనేక ఫలితాలు భక్తులకూ లభిస్తాయని ఆగమ నిగమాలు చెబుతున్నాయి. ముఖ్యంగా భయాలు, అనిశ్చితి, అధర్మ ప్రభావాల నుండి విముక్తి పొందాలనుకునే వారికి సుదర్శనుని ఆరాధన అనివార్యంగా భావించబడుతోంది. సుదర్శన చక్రం ఆవేశాన్ని, ఆత్మబలాన్ని, ధర్మ నిశ్ఠను సూచించడమే కాదు ౧ ఇది ఆధ్యాత్మికంగా కాల చక్రం సూచికగా, మనసు సంస్కార సాధనకు మార్గదర్శకంగా పనిచేస్తుంది. దీనిని ధ్యానించడం వల్ల చిత్తశుద్ధి, ఏకాగ్రత, విశ్లేషణా బుద్ధి కలుగుతుందని భావన. క్రమమైన ఆరాధన ద్వారా జీవన విధానంలో గుణాత్మక మార్పులు సంభవిస్తాయని అనేక భక్తుల అనుభవాల ద్వారా స్థిరమైన నమ్మకంగా మారింది. ఈ సందర్భంలో సుదర్శనుని ఆరాధనతో పాటు మనిషిలోని లోపాలను నిగ్రహించి, నిష్కామత్వంతో, నిస్వార్థభావంతో ధర్మపథంలో నడవాలన్న సంకల్పంతో సుదర్శన జయంతిని ఆచరించాలి. 2025 జూలై 31 గురువారం జరగనున్న ఈ పవిత్ర దినం భక్తులందరికి సుదర్శనుని కరుణాకటాక్షాలను ప్రసాదించే పర్వదినంగా మారాలని కోరుకుందాం.

**రచన: రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్టు**

# మరో సంచలనానికి తెరతీస్తున్న 'ఇస్రో'



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరోసారి అంతరిక్ష పరిశోధనలలో తన సత్తాను చాటుకోవడానికి సిద్ధమవుతోంది. ఇస్రో ఛైర్మన్ శ్రీ నారాయణన్ ఇటీవల చేసిన ప్రకటనలు భారత అంతరిక్ష రంగంలో రాబోయే కీలక ఘట్టాలను స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, డిసెంబర్‌లో రోబోట్‌తో కూడిన మానవ రహిత అంతరిక్ష నౌక ప్రయోగం.. 2027 నాటికి మానవ సహిత గగనయానం లక్ష్యం, అలాగే నాసాతో కలిసి నిషార్ ఉపగ్రహ ప్రయోగం వంటివి ఇస్రో భవిష్యత్ ప్రణాళికలను తెలియజేస్తున్నాయి. ఇస్రో ఛైర్మన్ నారాయణన్ వెల్లడించిన దాని ప్రకారం.., ఈ డిసెంబర్‌లో రోబోట్‌తో కూడిన మానవ రహిత అంతరిక్ష నౌకను ప్రయోగించడం ద్వారా ఇస్రో గగనయాన్ కార్యక్రమానికి పటిష్టమైన పునాది వేయనుంది. ఇది కేవలం ఒక ప్రయోగం మాత్రమే కాదు, భవిష్యత్తులో మానవులను అంతరిక్షంలోకి పంపే ప్రణాళికకు ఒక కీలకమైన పరీక్ష. ఈ రోబోట్ మిషన్ ద్వారా అంతరిక్ష నౌక పనితీరు, భద్రతా వ్యవస్థలు.. ఇతర సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం లభిస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే.. 2027 నాటికి మానవులను అంతరిక్షంలోకి పంపే లక్ష్యం మరింత సాకారమవుతుంది. ఈ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ పూర్తి మద్దతు ప్రకటించడం ఇస్రోకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఇది ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి మరో నిదర్శనం, ఎందుకంటే అంతరిక్ష పరిశోధనలలో స్వయం సమృద్ధిని సాధించడం దేశ భవిష్యత్తుకు అత్యవసరం.

**-నిషార్ ఉపగ్రహం: భూమిని పర్యవేక్షించడంలో ఒక కొత్త అధ్యాయం...** డిసెంబర్ ప్రయోగంతో పాటు ఈ నెల 30వ తేదీన నాసాతో కలిసి అభివృద్ధి చేసిన నిషార్ ఉపగ్రహాన్ని శ్రీహరికోట నుంచి ప్రయోగించనున్నారు. ఇది ఇస్రో - నాసా మధ్య అంతరిక్ష సహకారానికి ఒక గొప్ప ఉదాహరణ. నిషార్ ఉపగ్రహంలోని ఎస్-బ్యాండ్ సింథటిక్ అపర్చర్ రాడార్ పూర్తిగా భారతదేశంలో తయారవగా, ఎల్-బ్యాండ్ రాడార్ అమెరికాలో తయారైంది. ఈ ఉపగ్రహం 24 గంటలు వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా, భూమి యొక్క స్పష్టమైన ఫోటోలను అందించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది సహజ వనరుల అధ్యయనం, భూకంపాలు, కొండచరియలు వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే గుర్తించడంలో కీలకంగా ఉపయోగపడుతుంది. ప్రతి 12 రోజులకు ప్రపంచ మొత్తం ఉపరితలాన్ని స్కాన్ చేసి సేకరించిన ఫోటోలను భారతదేశంతో పాటు ఇతర దేశాలతో కూడా పంచుకోవడం ద్వారా వాతావరణ మార్పుల అధ్యయనం-విపత్తు నిర్వహణలో ఇది ప్రపంచానికి ఎంతో సహాయపడుతుంది.

**చంద్రయాన్ మిషన్లు: చంద్ర పరిశోధనలలో కొనసాగుతున్న ప్రస్థానం...** చంద్రయాన్-3 విజయం తర్వాత, ఇస్రో తన చంద్రయాన్-4 మిషన్ పనులను వేగవంతం చేసింది. తదుపరి చంద్రయాన్-5 ప్రాజెక్టుపై కూడా త్వరలో దృష్టి పెట్టనున్నట్లు నారాయణన్ తెలిపారు. ఇది చంద్రుడిపై మరింత లోతైన పరిశోధనలు చేయడానికి ఇస్రో నిబద్ధతను తెలియజేస్తుంది. చంద్ర పరిశోధనలు మన సౌర వ్యవస్థ గురించి, చంద్రుడి పుట్టుక గురించి.. భవిష్యత్ అంతరిక్ష మిషన్లకు అవసరమైన వనరుల గురించి కీలక సమాచారాన్ని అందిస్తాయి. ఇస్రో రాబోయే నెలల్లో పలు కీలకమైన ప్రయోగాలకు సిద్ధమవుతోంది. డిసెంబర్‌లో రోబోట్‌తో కూడిన మానవ రహిత అంతరిక్ష నౌక ప్రయోగం, నిషార్ ఉపగ్రహ ప్రయోగం, చంద్రయాన్ మిషన్ల కొనసాగింపు వంటివి భారత అంతరిక్ష పరిశోధనా రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలకనున్నాయి. ఈ ప్రయోగాలు భారతదేశాన్ని అంతరిక్ష పరిశోధనలలో ఒక ప్రపంచ నాయకుడిగా నిలబెట్టడమే కాకుండా, మానవజాతికి ప్రయోజనం చేకూర్చే విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక పురోగతికి దోహదపడతాయి. ఈ విజయాలు ఆత్మనిర్భర్ భారత్ కలను మరింత బలోపేతం చేస్తాయి.

# విమానం అంత స్పీడు.. గంటకు 623 కి.మీల మాగ్లెవ్ రైలు.. చైనా సంచలనం

సాంకేతికతలో ఎప్పుడూ ముందుండే చైనా, రవాణా రంగంలో మరో అద్భుతమైన మైలురాయిని అధిగమించింది. గంటకు 623 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే మాగ్లెవ్ ట్రైన్‌ను విజయవంతంగా ప్రదర్శించి, సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించింది. బీజింగ్‌లో జరిగిన 17వ మోడ్రన్ రైల్వేస్ ఎగ్జిబిషన్‌లో ఈ ట్రైన్‌ను ప్రదర్శించారు, ఇది ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.

**-టెక్నాలజీ అండ్ స్పీడ్: ఒక అసాధారణ కలయిక...** చైనా అభివృద్ధి చేసిన ఈ మాగ్లెవ్ ట్రైన్ కేవలం 7 సెకన్లలోనే 600 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. ఈ అద్భుతమైన వేగానికి కారణం మాగ్నెటిక్ లెవిటేషన్ టెక్నాలజీ. ఈ టెక్నాలజీ వల్ల ట్రైన్ పట్టాలపై కదులుతున్నప్పుడు ఎటువంటి ఘర్షణ (ఫ్రిక్షన్) లేకుండానే ప్రయాణిస్తుంది. దీనివల్ల ట్రైన్ అత్యంత వేగంగా, నిశ్శబ్దంగా దూసుకుపోతుంది. 623 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని తాకి, చైనా మరోసారి తన సాంకేతిక నైపుణ్యాన్ని నిరూపించుకుంది.

**-విమానాలకు పోటీగా రైలు ప్రయాణం...** ఈ మాగ్లెవ్ ట్రైన్ పూర్తిస్థాయిలో వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తే, ఇది ప్రయాణ





సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఉదాహరణకు, బీజింగ్ నుండి షాంఘై వరకు ఉన్న 1200 కిలోమీటర్ల దూరాన్ని ప్రస్తుతం 5.30 గంటలు పడుతుంటే, ఈ కొత్త ట్రైన్‌తో కేవలం 150 నిమిషాల్లో (2.30 గంటలు) చేరుకోవచ్చు. ఇది నిజంగా విమాన ప్రయాణం ఎంత వేగంగా ఉంటుందో, రైలు ప్రయాణం కూడా అదే స్థాయిలో వేగాన్ని అందుకోవడాన్ని సూచిస్తుంది.

**చైనా హై-స్పీడ్ రైల్వే నెట్‌వర్క్: అగ్రస్థానం...** ప్రపంచంలోనే అతిపెద్ద హై-స్పీడ్ రైలు వ్యవస్థను కలిగి ఉన్న దేశంగా చైనా ఇప్పటికే తన సత్తా చాటింది. 2023 చివరినాటికి, చైనా 48,000 కిలోమీటర్ల హై-స్పీడ్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. 2025 నాటికి ఈ సంఖ్యను 50,000 కిలోమీటర్లకు పెంచే లక్ష్యంతో చైనా ముందుకు సాగుతోంది. ఇది వారి రవాణా వ్యవస్థల విస్తరణ పట్ల నిబద్ధతను తెలియజేస్తుంది. గతంలో చైనా తయారు చేసిన CR450 బుల్లెట్ ట్రైన్ ఇప్పటికే గంటకు 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. అయితే ఇప్పుడు మాగ్లెవ్ ట్రైన్ 623 కిలోమీటర్ల గరిష్ట వేగంతో దానిని మించిపోయింది. ఇది చైనా యొక్క నిరంతర పరిశోధన, అభివృద్ధి ఫలితం.

**-భవిష్యత్ రవాణాకు దిక్సూచి...** సాంకేతికత, వేగం, సామర్థ్యం.. ఈ మూడు రంగాల్లో చైనా రైల్వే వ్యవస్థ ప్రపంచాన్ని ముందుండి నడిపిస్తోంది. 623 కిలోమీటర్ల వేగంతో మాగ్లెవ్ ట్రైన్ రికార్డు సృష్టించడం కేవలం చైనా సాధించిన విజయం మాత్రమే కాదు, భవిష్యత్ రవాణా రంగంలో ప్రపంచం ఏ దిశగా పయనిస్తుందో చెప్పే సంకేతం కూడా. ఇది మరింత వేగవంతమైన, సమర్థవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాలను అందించే దిశగా ఒక పెద్ద అడుగు.

# పాదరసాన్ని బంగారంగా మార్చే టెక్నాలజీ.. స్టార్టప్ కంపెనీ సంచలనం

ప్రపంచంలోనే అత్యధికుల మనసుల్ని దోచే బంగారానికి ఉండే క్రేజ్ ఎంతో తెలిసిందే. ఈ విలువైన లోహాన్ని పాదరసంతోనూ తయారు చేయొచ్చని.. దీనికి సంబంధించిన సాంకేతికతను తాము డెవలప్ చేసినట్లుగా సంచలన ప్రకటన చేసిందో స్టార్టప్. యూఎస్ లోని సిలికాన్ వ్యాలీకి చెందిన మారథాన్ ఫ్యూజన్ అనే స్టార్టప్ చేసిన ప్రకటన ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పాదరసాన్ని బంగారంగా మార్చే టెక్నాలజీ తమ వద్ద ఉందని.. తమ ప్రయోగాలు కార్యరూపం దాలిస్తే బంగారం ధరలపై తీవ్ర ప్రబావం పడే అవకాశం ఉందని పేర్కొంది. పాదరసంతో తయారు చేసేది మేలిమి బంగారమే అయినప్పటికీ ఫ్యూజర్ రియాక్టర్ వినియోగం కారణంగా.. పద్నాలుగేళ్ల నుంచి పద్దెనిమిదేళ్ల వరకు అందులో రేడియో ధార్మికత ఉండే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. దీని కారణంగా వాణిజ్య పరంగా



వినియోగించే వీలుండదని చెబుతున్నారు. ఇంతకూ ఇదెలా సాధ్యమన్న ప్రశ్నకు సమాధానంగా సాంకేతిక అంశాల్ని ప్రస్తావిస్తున్నారు. పాదరసం 198 అనే ఐసోటోప్ తొలుత పాదరసం 197గా మార్చాల్సి ఉంటుంది. ఆ తర్వాత దాన్ని బంగారం 197 ఐసోటోప్ గా మార్చొచ్చని మారథాన్ ఫ్యూజన్ వెల్లడించింది. మూలకాల మార్పిడి ద్వారా సాధ్యమని పేర్కొన్న సంస్థ.. ఈ ప్రక్రియ ద్వారా ఏటా ఐదు వేల కేజీల బంగారాన్ని ఉత్పత్తి చేసే వీలుందని చెప్పింది. ఈ స్టార్టప్ ఇప్పటివరకు ఆరు మిలియన్ డాలర్ల పెట్టుబడులు.. నాలుగు మిలియన్ డాలర్ల ప్రభుత్వ నిధుల్ని సాధించటం గమనార్హం. ఇక్కడే మరో అంశాన్ని ప్రస్తావించాలి. పాత రోజుల్లో అంటే.. యాభై అరవై ఏళ్ల క్రితం మన దేశంలోని పలువురు పాదరసంతో బంగారాన్ని తయారు చేయొచ్చంటూ భారీగా ప్రయోగాలు చేస్తూ ఫెయిల్ అయ్యేవారు. అయితే.. పాదరసంతో బంగారం చేయాలన్న మాట బలంగా వినిపించినా.. దాన్ని సాధ్యం చేయలేదు. ఇదే అంశం ఇప్పుడు అమెరికాకు చెందిన ఒక సంస్థ చేతల్లో చేసి చూపిన వైనం ఆసక్తికరంగా మారింది.

చురకలు

# సంపాదకీయం

## మోడీ పక్కనే యోగీ...ఇమేజ్ అలాంటిది !

బీజేపీలో నరేంద్ర మోడీ వారసుడు ఎవరో చెప్పమంటే హిందూత్వ నినాదం ఎక్కువగా వినిపిస్తున్న యూపీ సీఎం ఆదిత్య నాథ్ యోగి పేరునే ఎక్కువ మంది చెబుతారు. యోగి సైతం కుటుంబ జీవనాన్ని త్యజించారు. ఆయన ఆజన్మ బ్రహ్మచారి. ఇక ఆయన తనకంటూ ఏమీ లేకుండానే ప్రజలకు అంకితం అయ్యారు. రాజకీయంగా చూస్తే యాభై ఏళ్ళ వయసు ఉన్న యోగీని యువ నేత కిందనే అంతా చూస్తారు. యోగీ ఇమేజ్ చూస్తే దేశమంతా ఉంది. ఒక పెద్ద రాష్ట్రానికి సీఎం గా ఆయన కొనసాగుతూ వస్తున్నారు.

**నిన్న మోడీ నేడు యోగీ :** ఇక రికార్డుల పరంగా చూస్తే కనుక నిన్న మోడీ రికార్డులు బద్ధలు కొట్టారు. ఆయన దేశంలో శ్రీమతి ఇందిరా గాంధీ మాదిరిగా నిరాటంకంగా పలించే ప్రధానిగా కొత్త రికార్డుని నెలకొల్పారు. ఆ విధంగా 1966 జనవరి నుంచి 1977 మార్చి వరకూ ఇందిరాగాంధీ పాలించిన పదకొండేళ్ళ కంటిన్యూస్ పాలన రికార్డుని మోడీ తాజాగా బ్రేక్ చేసి శభాష్ అనిపించుకున్నారు. ఈ టెర్మ్ మొత్తం పూర్తి చేస్తే కనుక ఆయన ఇందిరాగాంధీ ప్రధానిగా ఎక్కువ కాలం పాలించిన రికార్డులను బ్రేక్ చేయడానికి కూడా సిద్ధంగా ఉంటారు. ఇపుడు చూస్తే యూపీలో మొత్తం పాలించిన ముఖ్యమంత్రులు అందరి కంటే ఎక్కువ కాలం పాలించిన సీఎం గా యోగీ కొత్త రికార్డు నెలకొల్పారు.

**ఆయనను దాటేశారుగా :** యూపీని ఎంతో మంది పాలించారు. అయితే కాంగ్రెస్ హయాం లో గోవింద్ వల్లభ్ పంత్ పేరు మీదనే అత్యధిక కాలం పాలించిన రికార్డు ఉంది. ఆయన ఏకంగా ఎనిమిది సంవత్సరాల 127 రోజుల పాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. తాజాగా యోగీ ఆ రికార్డుని అధిగమించారు. 2017 మార్చి 19న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన యోగీ తాజాగా ఎనిమిదేళ్ళ 128 రోజులకు తన పాలన పూర్తి చేసుకున్నారు. దాంతో ఆయన యూపీలో అత్యధిక కాలం పాలించిన తొలి సీఎం గా రికార్డులకు ఎక్కారు.

**రెండు సార్లు వరసగా :** యోగీ ఎంపీగా 2014 లో ఉంటూండగానే 2017లో యూపీకి సీఎం అయ్యారు. అయిదేళ్ళ పాటు పూర్తిగా పనిచేసిన ఆయన నాయకత్వంలో 2022లో ఎన్నికలు యూపీకి జరిగాయి కొన్ని సీట్లు తగ్గినా మరోసారి యూపీలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దాంతో రెండవమారు ఆయనే కొనసాగారు. ఇక 2027 యూపీ ఎన్నికలు ఉన్నాయి. అంటే ఈ టెర్మ్ కూడా పూర్తి చేసుకుంటే యోగీ పదేళ్ళ సీఎం గా ఉంటారు అన్న మాట. మరి ఆ రికార్డుని బద్ధలు కొట్టాలీ అంటే ఇప్పట్లో కుదిరేది కాదేమో. ఎందుకంటే యూపీలో రాజకీయాలు అలా ఉన్నాయని అంటున్నారు.

**ప్రధాని రేసులో కూడా :** ఇక యోగీ ఇమేజ్ చూస్తే జాతీయ స్థాయిలోనే ఉంది. ఆయనే మోడీకి సిసలైన వారసుడు అని అంతా అంటారు. దాంతో మోడీ కనుక తప్పుకుంటే చాన్స్ ఆయనకే ఇవ్వాలని ఆర్ ఎస్ ఎస్ కూడా భావిస్తోంది అని చెబుతారు. హిందూత్వకు మారు పేరుగా ఉంటూ దూకుడుగా రాజకీయాలు చేసే యోగీ రాజకీయ వ్యూహాలలో పదును తేరారు అని అంటారు. నిజానికి ఆయన పేరు యోగి కానీ ఆయన ఎత్తుగడలు మాత్రం వేరే లెవెల్ అని అంటారు. ఈ క్రమంలోనే ఒక ఎంపీ నుంచి పెద్ద స్టేట్ కి సీఎం గా అయ్యారు. ఇపుడు ప్రధాని రేసులో బలమైన అభ్యర్థిగా అవతరించారు అంటే మాటలు కాదు కదా అని అంటున్నారు. దటీజ్ యోగీ అన్న మాట.

## ప్రతిజ్ఞా పాలనలో లక్ష్యాన్ని ముద్దాడిన ఉద్ధం సింగ్ - జూలై 31...ఉద్ధం సింగ్ బలిదాన దినం




భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన వారెందరో... అయితే అమర వీరుడు ఉద్ధం సింగ్ ఆత్మార్పణం ఒక ప్రత్యేకం. కళ్ళముందే అగణిత ప్రాణాలను కిరాతకంగా తుపాకీ గుళ్ళకు బలి చేసిన శ్వేత జాతి అధికారిని హతమార్చి పగ తీర్చుకున్న సందర్భం. దేశ చరిత్రలో చెరిగి పోలేని దేశభక్తికి పరాకాష్టగా నిలిచిన ముఖ్య ఘట్టం. జలియన్ వాలా బాగ్ మారణ కాండలో ప్రాణాలతో బయటపడిన యువకుడు తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి, పగ తీర్చకోవడానికి ఏళ్ళ తరబడి నిరీక్షించి, లక్ష్య సాధనలో దేశాన్ని వదిలి, విదేశానికి శ్రమకోర్చి వెళ్ళి, సమయం కోసం వేచి ఉండి, నర రూప రాక్షసుడైన డయ్యర్ ను హత మార్చి, ఉరి తాడును ముద్దాడిన దేశం గర్వించదగ్గ అమరుడు ఉద్ధమ్ సింగ్ సాహసోపేత నేపద్యం అనన్య సామాన్యం, అపూర్వం, అసమానం. ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసు కోవాలంటే వంద ఏళ్లు వెనకకు వెళ్లాల్సిందే. పంజాబ్, బెంగాల్ లో నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం, భారత ప్రజల్లో నానాటికీ రగులు తున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్ లో), మొదలైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తి యైన సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుసరించి బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం ద్వారా తిరుగుబాట్లను అణిచి వేయడానికి వైస్రాయ్ లకు విశేష అధికారాలని కట్టబెట్టారు. ప్రెస్ నోళ్ళను కట్టేయడానికీ, విచారణ లేకుండా రాజకీయ నాయకులను నిర్బంధించడం, తిరుగు బాటు దారునిగా అనుమానితులైన వ్యక్తులను వారంటు లేకుండా అరెస్టు చేయడం మొదలైన నిరంకుశమైన అధికారాలు ఇందులో ఉన్నాయి. ఈ చట్టం పై దేశంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్త మయ్యాయి. జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టమైన సంఘటన. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్సర్ లోగల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోటలో దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశ మైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశ మవడానికి ముఖ్య కారణం, ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లులను అక్రమంగా నిర్బంధించడాన్ని వ్యతిరేకించడం. ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైనికులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులు పది నిమిషాలపాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహనాలు బాగ్ లోపలికి రాలేక పోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్ద భవనాలతోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలావాటికి తాళాలు వేసిఉన్నాయి. కాల్పుల కారణంగా వందల మంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మంది బాలురు, 6 వారాల పసికందు) మరణించారు. కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000 కి పైగా మరణించారు. 2000 మందికి పైగా గాయపడ్డారు. అక్కడ స్మారక చిహ్నంపైన వ్రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను బయటకు తీశారు. నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. పంజాబ్ అమృత్ సర్ లోని 1919 ఏప్రిల్ 13న జలియన్ వాలా బాగ్ లో శాంతియుతంగా వేల మంది సామాన్య పౌరులు సమావేశం అయి ఉండగా పోలీసులతో చుట్టు ముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేల మంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్. షేర్ సింగ్ (ఉధం సింగ్) 1899 డిసెంబర్ 26 న పంజాబ్ లో సంగ్ర జిల్లా సునం అనే గ్రామంలో కాంబోజి సిక్ కుటుంబంలో జన్మించాడు. తండ్రి తెహల్ సింగ్ పొరుగు గ్రామమైన ఉపాల్ లో జమ్ము రైల్వే క్రాసి కాపలా దారుగా జీవనం సాగించేవారు. ఉదం సింగ్ తల్లి 1901 తండ్రి 1లో చనిపోయారు. షేర్ సింగ్ (ఉధం సింగ్ ) వారి తల్లి తండ్రు చనిపోయాక అన్న ముక్తా సింగ్ తో కలిసి అమృత్ సర్ లో సెంట్రల్ ఖల్సా అనాథ ఆశ్రమంలో చేరారు. అక్కడ సిక్కులకి మతపరమైన దీక్ష చేసి అక్కడ వారి చేత ఉదం సింగ్ అనే పేరుని స్వీకరించాడు. మెట్రిక్యు లేషన్ చదువు 1918లో పూర్తి చేసి 1919లో ఆ అనాథ ఆశ్రమం నుండి బయటకి వచ్చాడు. జలియన్ వాలా బాగ్ సంఘటనలో యువకుడు సింగ్ కూడా ఉన్నాడు. అమానుష దాడి తన కళ్ళ ముందే జరగడం హత్యాకాండకు సూత్రధారి అయిన డైయర్ను జెనరల్ మైకెల్ ఓడ్ వాయర్ ను హతమార్చడానికి ప్రతీకారాన్ని తీర్చు కోవటానికి ప్రతిన బూనాడు. భగత్ సింగ్ విప్లవ భావాలకి ఆకర్షితుడై 1927 న భగత్ సింగ్ ఆదేశాల మేరకు విదేశాల నుండి తుపాకులు తెస్తు పోలీసులకు దొరికి 1931 వరకు జైలు జీవితం గడిపాడు. విప్లవ వీరుడు భగత్ సింగ్ ను ఉరి తీయడం సింగ్ ను కలచి వేసింది. జైలు నుండి విడుదల అయిన తరువాత చదువు పేరుతో పేరు మార్చుకుని పోలీసుల నిఘా నుండి తప్పించు కుని కాశ్మీర్, జర్మనీ మీదగా లండన్ చేరాడు. డైయ్యర్ ని హత్య చేయడానికి పగబట్టి 9 సంవత్సరాలు ఎదురు చూసి 21 సంవత్సరాల తరువాత 1940 మార్చి 13న లండన్ కాక్స్ టన్ హాల్ లో డయర్ ని అందరు చూస్తుండ గానే తుపాకీతో కాల్చి హత్య చేసి ప్రతీకారం తీర్చుకుని పోలీసులకి స్వచ్ఛందంగా పట్టుబడి, తను చంపిన కారణాన్ని నిర్భయంగా చెప్పాడు. దీంతో జూన్ 4, 1940 ఓల్డ్ బెయిలీలోని సెంట్రల్ క్రిమినల్ కోర్టులో, జస్టిస్ అట్కిన్సన్ మరణ శిక్ష విధించాడు. జూలై 31, 1940 న, ఉధమ్ సింగ్ ను లండన్ పెంటన్ విల్లే జైలులో ఉరి తీసారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## సినీ వినీలాకాశంలో హాస్యపు హరివిల్లు అల్లు - జూలై 31...అల్లు రామలింగయ్య వర్ధంతి

తెలుగు సినిమాకు దొరికిన అపురూపమైన కళాకారుడు అల్లు రామలింగయ్య. ఆయన నటించే ప్రతిపాత్ర ఆయనకే స్వంతమా అనే రీతితో నటించి నవ్వించిన సాటిలేని మేటి నటుడు అల్లు రామలింగయ్య. నిజానికి హాస్యానికి ఆయన అసలు చిరునామాగా మారారు. అయినా ఏ పాత్రలోకైనా పరకాయప్రవేశం చేసి మెప్పించారు. హాస్యాన్ని పండించారు. ఆకారంతో పనేమి? నవ్వించడమే నా అసలు పని అని నవ్వుకే నడకలు నేర్ప గలిగిన హాస్య నట దిగ్గజం అల్లు. రేలంగి తరువాత 'పద్మశ్రీ' అందుకున్న హాస్యనటుడుగా చరిత్ర సృష్టించారు. హెూమియోపతి డాక్టర్‌గా పలు సేవాకార్యక్రమాలు అందించారు. తెలుగు సినీ పరిశ్రమలో నటుడిగా ఎంత బిజీగా వున్నా వైద్య వృత్తిని మాత్రం వదల్లేదు. వీలైనప్పుడు నటీనటులకు కూడా తన వైద్యాన్ని అందించారు. నిర్మాతగా మారి గీతా ఆర్ట్స్ బ్యానర్ స్థాపించి అనేక సూపర్‌హిట్స్ అందించారు. ఆయన నాటి స్వతంత్ర పోరాటంలో భాగస్వామిగా, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లారు. అల్లు రామలింగయ్య (అక్టోబర్ 1, 1922 - జూలై 31, 2004) నటునిగా, వైద్యుడిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, తత్వవేత్త. లోతైన తత్వవేత్తగా, నిర్మాతగా, ఎందరికో మార్గదర్శకుడిగా, గురువుగా విభిన్న సేవలు అందించారు. ఆయన కుమారుడు అల్లు అరవింద్ సినీ నిర్మాతగా, . మెగా స్టార్, చిరంజీవి అల్లుడు, మనమళ్లు చరణ్, అర్జున్, శిరీష్ సినీ పరిశ్రమలో రాణించడం విశేషం. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో 1922 అక్టోబర్ 1న అల్లు రామలింగయ్య జన్మించారు. పాలకొల్లులో ఉన్న క్షీర రామలింగేశ్వర స్వామి గుర్తుగా తల్లిదండ్రులు రామలింగయ్యని పేరు పెట్టుకున్నారు. అల్లు చదువులో పెద్దగా రాణించ లేదు. ఆకతాయిగా తిరుగుతూ అందరినీ అనుకరిస్తూ నవ్వించేవారు. ఇదే క్రమంతో నాటకాల్లో నటించాలనే ఉత్సాహం పెరిగింది. ఊళ్లోకి ఎవరు నాటకాల వాళ్ళు వచ్చినా వారి వెంటే తిరుగుతూ ఉండేవారు. వాళ్లతో స్నేహం చేయడం, ఏదైనా చిన్న వేషం ఇమ్మని అడగడం నిత్యకృత్యంగా చేసుకున్నారు. ఓ సారి వాళ్ల ఊళ్లో 'భక్త ప్రహ్లాద' నాటకం చూస్తుండగా.. బృహస్పతి వేషం వేస్తున్న పిల్లాడు బాగా చేయడం లేదనిపించి%ఔ%ఇంట్లోంచి బియ్యం దొంగతనం చేసి వాటిని అమ్మి నాటక కాంట్రాక్టరుకు మూడు రూపాయలు ఎదురిచ్చి ఆ వేషం తనే వేసిన తపన ఉన్న కళాకారులు. నాటకానుభవం పెద్దగా లేకున్నా కొద్దిపాటి నటనావగాహనతో తన వేషం మెప్పించారు. అలా మొదలైంది అల్లు నట జీవితం. అల్లు నాటకాల్లో నటిస్తూనే, తన సామాజిక బాధ్యతను గుర్తెరిగి గాంధీజీ పిలుపు నందుకుని క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్లారు. జైలులో కూడా తోటివారిని పోగేసుకుని నాటకాలాడే వారు. మరోవైపు అంటరానితనంపై పోరు సలిపారు. అల్లు నాటకాలు చూసిన గరికపాటి రాజారావు చిత్రసీమలో తొలిసారిగా 1952లో పుట్టిల్లు చిత్రంలో కూడు-గుడ్డ శాస్త్రి తరహా పాత్రను అల్లుచే వేయించారు. ఆ తరువాత హెచ్.ఎం.రెడ్డి వద్దంటే డబ్బులో అవకాశం వచ్చింది. పుట్టిల్లు చిత్రం నిర్మాణ కాలంలో తన భార్యా నలుగురు పిల్లలతో మదరాసుకు మకాం మార్చారు. అల్లు తన కుటుంబాన్ని పోషించేందుకు చాలా కష్టాలు పడ్డారు. మరోవైపు హెూమియో వైద్యం నేర్చుకున్న అల్లు ఏమాత్రం తీరిక దొరికినా ఉచిత వైద్యసేవ లందించేవారు. ప్రారంభంలో ఎన్నో అవాంతరాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో చిత్రసీమలో నిలద్రొక్కు కున్నారు. అల్లు హాస్యపు జల్లునేకాదు కామెడీ విలనిజాన్ని కూడా రక్తి కట్టించాడు. రామలింగయ్యలో ఉన్న నటుడ్ని అద్భుతంగా వాడుకున్న దర్శకుల్లో విశ్వనాథ్ ఒకరు. మొదట్లో కామెడీ వేషాలే చేసినా%ఔ%నెమ్మదిగా కామెడీ విలనీ కూడా చేయడం ప్రారంభించారు. ఓ జమానాలో విలన్ వెనకాల ఉండే ఓ తరహా గుంటనక్క లాంటి పాత్రలో అల్లు రామలింగయ్య ఎక్కువగా కనిపించేవారు. రామలింగయ్యలో చిన్నతనం నుంచి ఓ మిమిక్రీ కళాకారుడు ఉన్నారు. ఈ కళను ఆయన చాలా పదిలంగా కాపాడు కుంటూనే వచ్చారు. అల్లు రామలింగయ్య నిర్మాతగా గీతా ఆర్ట్స్ బానర్ నెలకొల్పి బంట్రోతు భార్య, దేవుడే దిగివస్తే, బంగారు పతకం చిత్రాలను నిర్మించారు. చాలాకాలం తర్వాత అల్లు 90 దశకంలో డబ్బు భలే జబ్బు చిత్రం తీసారు. ముత్యాల ముగ్గు సినిమా చిత్రీకరణకు ముందు అతను కుమారుడు ఆకస్మికంగా మరణించినా బాధను మనసులో అణుచుకుని షూటింగ్‌లో పాల్గొన్నారు అల్లు. సుమారు 1030 సినిమాల్లో కామెడీ విలనీ, క్యారెక్టర్ పాత్రలు చేసారు. 1116 చిత్రాల్లో నటించాలనే కోరిక అతనుకు తీరలేదు. అల్లు అభినయించిన చాలా పాటలకు బాలు గళం సరిగా సరి పోయింది. మనుషలంతా ఒక్కటే చిత్రంలో ముత్యాలు వస్తావా అడిగిందీ ఇస్తావా అనే పాట అప్పట్లో సూపర్ హిట్. యాభైయేళ్ల పాటు సినిమాల్లో నవ్వుతూ నవ్విస్తూ యావత్ తెలుగు ప్రజానీకాన్ని అలరించిన అల్లును వరించిన సన్మానాలు, గౌరవాలు, అవార్డులు అసంఖ్యాకమైనవి. భారత ప్రభుత్వం




1990లో ' పద్మశ్రీ ' అవార్డుతో గౌరవించింది. రేలంగి తరువాత ' పద్మశ్రీ' అందుకున్న హాస్యనటుడు అల్లునే. 2001 వ సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యున్నత ' రఘుపతి వెంకయ్య ' అవార్డు ఇచ్చింది. పాలకొల్లులో ఆయన విగ్రహం నెలకొల్పారు. 2013లో భారత చలనచిత్ర పరిశ్రమ వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంలో విడుదలయిన 50 తపాలా బిళ్ళలలో ఒకటి అల్లు రామలింగయ్య జ్ఞాపకార్థం విడుదలయింది. పాలకొల్లులో ఆయన విగ్రహం నెలకొల్పారు. అల్లు రామలింగయ్య 2004 జూలై 31 వ తేదీన తన 82 వ ఏట కన్ను మూసారు. మరణించే నాటికి తెలుగు చిత్రసీమలో అల్లు రామలింగయ్యది ప్రత్యేక స్థానం. రేలంగి, రమణారెడ్డి, కుటుంబ రావు, బాలకృష్ణ వంటివారి కాలంతో మొదలు ఈతరం హాస్యనటుల వరకూ కొనసాగిన ఏకైక హాస్యనటుడు అల్లునే. ఆమ్యామ్య.. అప్పం అప్పం లాంటి ఊతపదాలు అతను సృష్టించినవే. అల్లు భౌతికంగా లేకపోయినా హాస్య రస ప్రధాన పాత్ర ధారిగా చిరంజీవిగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచి పోయారు..

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## నండూరి పార్థసారథి: సాహిత్యమూ, పాత్రికేయమూ కలిసిన జీవన యానం - జూలై 31...నండూరి పార్థసారథి జయంతి

తెలుగు సాహిత్య, పత్రికా రంగంలో నిండుగా రసదాయకంగా దశాబ్దాల పాటు విస్తరించిన పేరు ౦ నండూరి పార్థసారథి. వ్యంగ్యం, హాస్యం, విమర్శ, సంగీతం, చలనచిత్రం వంటి అనేక కళా విభాగాలపై లోతైన చింతనతో రచన చేసి పాఠకులకు కొత్త పోకడలను చూపించిన అరుదైన రచయిత. 1939, జూలై 31న కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, ఆరుగొలను గ్రామంలో జన్మించిన ఆయన, 2024 జూన్ 14న హైదరాబాదులో పరమపదించగా, తన రచనల ద్వారా చిరంజీవిగా నిలిచిపోయారు. విజయవాడలో ఇంటర్మీడియట్ చదివిన ఆయన, హైదరాబాద్‌లో బి.ఏ. పూర్తిచేసి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పూర్తి చేశారు. విద్యార్హత మాత్రమే కాదు, అభిరుచి, పాండిత్యం కలగలిసిన భావదృష్టితో 1959లో "ఆంధ్రప్రభ" పత్రికలో పాత్రికేయుడిగా ప్రస్థానం మొదలుపెట్టారు. తరువాత ఏకకాలంలో శార్వరి, విద్వాన్ విశ్వం, గొల్లపూడి మారుతీరావుల వంటి సాహిత్య వేత్తలతో కలిసి పనిచేశారు. ఆయన రచనా నైపుణ్యం, సామాజిక పరిపక్వత, వ్యవస్థలపై వాడిగా బాణాలు ఎక్కుపెట్ట గలిగిన ధైర్యం ఆయనను పత్రికా రంగంలో విశిష్టంగా నిలబెట్టాయి. పార్థసారథి రచనలు మొదటిగా 1957లో ప్రచురితమవ్వగా, తరువాత 'రాంబాబు డైరీ' (మూడు భాగాలు), 'పిబరే హ్యూమరసం', 'అయోమయ రాజ్యం', 'సాహిత్య హింసావలోకనం', 'ఖారా?నాఖ్యానము', 'జేజి మావయ్య పాటలు' వంటి హాస్య రచనలతో తెలుగు పాఠకులను నవ్విస్తూ ఆలోచింపజేసే శైలిని ఏర్పరచుకున్నారు. ఆయన రచనలు కేవలం వినోదం కోసం గాక, సంఘాన్ని ప్రశ్నించే, అలసిన మానవ సమాజాన్ని చైతన్యపరచే రీతిలో సాగతీత చేశాయి. ఆయన వ్యాసాలు, సమీక్షలు, సంగీతంపై రచనలు హిందుస్తానీ సంగీతం పై నిశిత అవగాహనను చాటాయి. "స్వరార్ణవం", "సంగీత కళా చరిత్ర", "శ్రీకృష్ణ కథామృతం" వంటి రచనలు సంగీతారాధకులను ఆకట్టుకున్నాయి. నాటక, శిల్ప, చిత్రకళలపై కూడా వ్యాసాలు రాశారు. 2000 అక్టోబరులో దీపావళి సందర్భంగా ఆయన ప్రారంభించిన 'రసమయి' మాసపత్రిక (95 సంచికలు) ఒక సాంస్కృతిక వేదికగా నిలిచి, నాటకీయ సమీక్షలు, కళా విశ్లేషణలు, సంప్రదాయ -నవీన విలయ రూపంగా పాఠకులకు వినూత్న అనుభవాన్ని అందించింది. సంపూర్ణంగా స్వంత ఖర్చుతో, సాహిత్యాన్ని సేవా ధర్మంగా భావించిన తపస్విగా ఆయన దీనిని నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం 1992లో హాస్య రచనకు, 2002లో పాత్రికేయ సేవలకు ఆయనకు పురస్కారాలు అందించింది. 1993లో "హాస్య రచయిత"గా విశ్వవిద్యాలయ ప్రత్యేక గుర్తింపు పొందారు. అతని రచనా వైవిధ్యం, భాషలో సరళత, లోతైన విశ్లేషణ సామర్థ్యం, మరియు నిర్భయంగా భావాలు చెప్పగల ధైర్యం ఆయనను అసామాన్య రచయితగా నిలిపాయి. వ్యక్తిగతంగా ఆయన అతి సామాన్యుడిగా, మితభాషిగా, పరిపక్వ విశ్లేషణతో కూడిన అరుదైన వ్యక్తిగా పేరుగాంచారు. ఆయనతో పనిచేసిన యువ రచయితలు, పాత్రికేయులు ఆయన దగ్గర నుండి స్పష్టత, నిబద్ధత, శాస్త్రీయతను నేర్చుకున్నారు. ఆయన సోదరుడు నండూరి రామ్మోహనరావు కూడా ప్రముఖ పాత్రికేయుడు. ఆయన భార్య సువర్చలాదేవి, కుమారుడు మధుసారథి కూడా ఆయన వారసత్వాన్ని గౌరవించేవారే. నండూరి పార్థసారథి పేరు, రచనలు, విమర్శా ధృక్కోణం తెలుగుకు ఒక ఆత్మీయమైన ఖ్యాతిని తెచ్చాయి. ఆయన జీవితం ౦ రచనకు అంకితమైన జీవితం. ఆయన పదాలు ౦ నవ్విస్తూ, తోచిస్తూ, చదివించిన తర్వాత ఆలోచింపజేసే పదాలు. అలాంటి రచయితలను ఒక్కసారి చనిపోయారని చెప్పినా, నిజంగా వాళ్ళు చదివే ప్రతి పాఠకుడి హృదయంలో నవ్యంగా పునర్జన్మిస్తుంటారు. తెలుగు పత్రికా, సాహిత్య రంగాలకు చేసిన ఆయన సేవలు ఎనలేనివి. నండూరి పార్థసారథి సాహిత్యమూ, దృక్కోణమూ భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఆయన జ్ఞాపకాలను, రచనలను మనం గౌరవంగా, స్ఫూర్తిగా భావించాలి.



**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## ఇందిరమ్మ ఇంటికి మోకాలడ్డు

ఇల్లెందు : తిలక్‌నగర్ పంచాయతీ, 21 పిట్ ఏరియాకు చెందిన వాసం విజయకు ఇందిరమ్మ గృహం మంజూరైంది. ఖాళీ స్థలంలో గుంతలు తీసింది. సింగరేణి అధికారులు అడ్డుకోవటంతో ఇంటి నిర్మాణం నిలిచిపోయింది. నూతన గని నిర్వాసిత జాబితాలో అసలు 21పిట్ ఏరియా లేదు. 24 ఏరియాలోనూ ఇదే పరిస్థితి. కుంచపు రాజేశ్వరి తన శిథిలావస్థ ఇంటిని కూల్చేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించింది. అధికారులు ఇది సింగరేణి స్థలం అంటూ అడ్డుకున్నారు. దీంతో ఆ కుటుంబం నిలువ నీడలేక రోడ్డున పడింది. వారి ఇంట్లో ఓ దివ్యాంగుడు సైతం ఉండటంతో రోడ్డు పక్కన జీవనం సాగించలేక కుటుంబం నానా అవస్థలు పడుతుంది.

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది ఇల్లెందు పరిధిలో కొంతమంది ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల పరిస్థితి. 24ఏరియా, 21 పిట్ ఏరియాలో పేదలకు ఇళ్లు మంజూరయ్యాయి. వారు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న క్రమంలో గని విస్తరణ పేరిట సింగరేణి అధికారులు అడ్డుకుంటున్నారు.

**ఇదీ విషయం..** ఇల్లెందులో ఏకైక జేకే-5 ఓసీలో నిల్వలు నిండుకుంటున్న క్రమంలో బొగ్గుట్ట భవిష్యత్తును కాపాడేందుకు సింగరేణి యాజమాన్యం ఉపరితల గని ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.



కోల్‌మైన్ పేరుతో దాదాపు 290 హెక్టార్ల విస్తీర్ణంలో నూతన ఓసీ ఏర్పాటుకు సన్నాహకాలు పూర్తి చేశారు. మండలంలోని విజయలక్ష్మీనగర్ పంచాయతీ వాసులను నిర్వాసితులుగా గుర్తించారు. వారితో పూర్తి స్థాయి చర్చలు అనంతరం, పరిహారం అందించాక ఇక్కడ ఖాళీ చేయించి, ఆ ప్రాంతంలో గని విస్తరణ మొదలుపెడతారు. నిర్వాసిత జాబితాలో లేని ఇల్లెందు పట్టణం, మండల పరిధిలోని 21పిట్ ఏరియా, 24ఏరియా, కుమ్మరిబస్తీ, భూపేష్‌నగర్ ప్రాంతాల్లో కొంతమంది ఇందిరమ్మ ఇంటి పనులు చేపడుతుంటే సింగరేణి అధికారులు అడ్డుకుంటున్నారు. గని విస్తరణ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి అంగీకరించబోమని చెబుతున్నారు. లీజు స్థలంలో నిర్మాణాలు చేపడు తున్నారు: అంజిరెడ్డి, ఎస్అండ్‌డీసీ అధికారి సింగరేణి సంస్థ లీజు స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నందున్న జీఎం ఆదేశానుసారం అడ్డుకు ంటున్నాం. కంపెనీ స్థలాలు కబ్జాకు గురికాకుండా జాగ్రత్తలు చేపడుతున్నాం.

## 'పైసా'చికం..!

సూర్యాపేట :"సూర్యాపేటలో రెండు నెలల క్రితం మోతెకు చెందిన మహిళకు గర్భవిచ్ఛిత్తి వికటించి మృతిచెందిన విషయం విదితమే. ఆమెకు నకిరేకల్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు అప్పట్లో పోలీసులు తమ విచారణలో తేల్చారు. చర్చికంపౌండ్ ప్రాంతంలో మెడికల్ షాపు ముసుగులో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం శుక్రవారం వెలుగు చూసింది. ఏడాది నుంచి ఇక్కడ వందలాది పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఇందుకు ఒక్కో గర్భిణి నుంచి రూ.పది వేలు వసూలు చేస్తున్నారు." కఠినమైన చట్టాలు అమలులో ఉన్నప్పటికీ సూర్యాపేట జిల్లా కేంద్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడిన అక్రమార్కులు పోలీసులకు పట్టుబడినా.. తిరిగి ఇదే దుర్మార్గానికి ఒడిగడుతుండటం గమనార్హం. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ లాంటి కఠినమైన చట్టాలు వీరిని ఎందుకు కట్టడి చేయలేకపోతున్నాయన్న ప్రశ్నలు



సామాన్యుడిని తొలచివేస్తున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతోనే వీరి ఆగడాలకు అంతు లేకుండా పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**వేటు పడినా..**

ఈ వ్యవహారంలో సంబంధిత అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత డీఎంహెచ్‌వో కోటాచలం హయాంలో నకిలీ వైద్యులు, స్కానింగ్ కేంద్రాలు, అనుమతి లేని ఆసుపత్రులపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు నిర్వహించి కొన్ని ఆసుపత్రులు, వైద్యులపై చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే నకిలీ వైద్యుల నుంచి లంచం డిమాండ్ చేసి డీఎస్పీ పార్థసారథి, ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు ఏసీబీకి చిక్కిన విషయం విదితమే. అనంతరం డీఎంహెచ్‌వోపై అవినీతి ఆరోపణలు రావడంతో బదిలీ వేటు పడింది. ఆ తర్వాతా లింగ నిర్ధారణ పరీక్షలకు చెక్ పడుతుందని ఆశించినా మళ్లీ వెలుగుచూడటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

కాసులు కురిపిస్తున్న అక్రమ వ్యాపారం

లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కొంత మంది అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. గతంలో ఈ తతంగం ఖమ్మం, మహబూబాబాద్ లాంటి పట్టణాల్లో ఎక్కువగా జరిగేది. ప్రస్తుతం కొందరు ఇక్కడే ఈ అకృత్యాలకు తెరలేపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న కొంత మంది ఆర్ఎంపీలను మధ్యవర్తులుగా చేసుకొని ఈ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. వారసుల కోసం తల్లిదండ్రుల ఆశ అక్రమార్కులకు ఆసరాగా మారుతోంది. జిల్లాలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, క్లీనిక్‌లు కేవలం అబార్షన్లు చేసేందుకే ఏర్పాటు కావడం గమనార్హం. ఇప్పటికైనా పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి భ్రూణ హత్యల నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**కఠిన చర్యలు తీసుకుంటాం: వెంకటయ్య, ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట**

సూర్యాపేటలో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఇద్దరిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నాం. ఈ కేసులో ఎవ్వరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదు. వీరికి సహకరించిన ఆర్ఎంపీలనూ రిమాండ్ చేస్తాం.

# మట్టి దందా ఆగేదెన్నడో?



ఎల్లారెడ్డిపేట : జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, కోనరావుపేట, సిరిసిల్ల తదితర మండలాల్లో గుట్టలను అక్రమార్కులు లక్ష్యంగా చేసుకున్నారు. సాధారణంగా మట్టిని రవాణా చేయాలంటే క్యూబిక్ మీటర్ల చొప్పున ప్రభుత్వానికి నిర్ణీత రుసుం చెల్లించాలి. దరఖాస్తు ఆధారంగా రెవెన్యూ, గనుల శాఖల అధికారులు పరిశీలించి, అనుమతులు జారీ చేయాలి కానీ.. జిల్లాలో ఇలాంటివేవీ లేకుండానే విలువైన మట్టి, మొరంను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. జిల్లాలో ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావడంతోపాటు ప్రైవేటు భవనాలు, పరిశ్రమల నిర్మాణాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. కొందరు యంత్రాలు, టిప్పర్ల యజమానులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరిట మట్టి, మొరంను పక్కదారి పట్టిస్తుండగా మరికొందరు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్భయంగానే రవాణా చేస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, పోతురెడ్డిపల్లి గ్రామాల నడుమ చీకటిపూట మట్టిని తరలించే టిప్పర్ ఢీకొట్టడం వల్ల అడవి పంది చనిపోయింది. సదరు టిప్పర్ డ్రైవర్ చనిపోయిన అడవిపంది మాంసాన్ని తీసుకెళ్లి, కొంతమేర కళేబరాన్ని అక్కడే వదిలిపెట్టి వెళ్లినట్లు గ్రామస్థులు చర్చించుకున్నారు. వెంకటాపూర్, పోతురెడ్డిపల్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉంటుంది. రాత్రి సమయాల్లో అడవిపందులు, జింకలు, దుప్పులు, కుందేళ్లతోపాటు ఎలుగుబంట్లు వంటి జీవులు కూడా తరచుగా కనిపిస్తాయని రైతులు చెబుతున్నారు. అక్రమంగా మట్టిని తరలించే వాహనాలతో వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల శివారు అటవీ ప్రాంతాల్లోని గుట్టలు, ఎత్తయిన ప్రదేశాలు మాయమవుతున్నాయి. రేయింబవళ్లూ యంత్రాల శబ్దాలు, మట్టి రవాణాతో వన్యప్రాణులు, ఇతర అటవీ జంతువులు తమ ఆవాసాలను కోల్పోతున్నాయి. దీంతో కొత్తగా ఆవాసాన్ని ఏర్పరచుకోవడం కోసం వనాలను వీడి జనావాసాల్లోకి వచ్చి చేరుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, రాగట్లపల్లి తదితర ప్రాంతాల్లో కొద్దిరోజుల క్రితం చిరుతలు సంచరించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. వేములవాడ నుంచి సిరికొండ వైపుగా పెద్దపులి కూడా వెళ్లినట్లు నిర్ధారించారు. గొండగొర్రెలు, అడవిపందులు, మయూరాలు, కుందేళ్లు తదితర అటవీ జీవులు పల్లెల పక్కన ఉండే వ్యవసాయ పొలాల్లోకి వచ్చి చేరుతున్నాయి. ఇలా అడవులను వీడుతున్న వన్యప్రాణులు, అటవీ జీవులు వేటగాళ్ల ఉచ్చులకు అవలీలగా చిక్కే అవకాశాలున్నాయి.

అధికారులు దాడులు చేస్తున్నా మట్టి, మొరం దందా ఆగడం లేదు. చిన్నపాటి గుట్టలు, మైదానాలు, చెరువు శిఖం భూములను కొందరు అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అనుమతులు లేకుండా మట్టి, మొరంను ఇతర ప్రాంతాలకు భారీ వాహనాల్లో తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నా సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో పట్టించుకోవడం లేదని, నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

## గంజాయి దందా.. అక్రమార్కుల పంథా




పెద్దపల్లి : జిల్లాలో గంజాయి రవాణా జోరుగా సాగుతోంది. పోలీసులు తనిఖీ చేసి పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా.. అడ్డుకట్ట పడటం లేదు. అక్రమార్కులు రోజు రోజుకు తమ రవాణా పంథాను మార్చుకుంటున్నారు. పెద్దపల్లిలో ఆటో కింది భాగంలో ప్రత్యేక అరను ఏర్పాటు చేసుకుని తరలిస్తుండగా రూ.21 లక్షల విలువైన 41.88 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాకు గంజాయి రవాణా హబ్‌గా పెద్దపల్లి ప్రాంతం మారిందన్న ఆరోపణలున్నాయి. రైలు, రోడ్డు మార్గాలతోపాటు ఒడిశా, చత్తీస్‌గఢ్ కూలీలు గంజాయి రవాణాకు సహకరిస్తున్నారు. వీరి ద్వారా పెద్ద మొత్తంలో రవాణా జరుగుతోంది. మరికొందరు జిల్లాలోని రహస్య ప్రాంతాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారు. విద్యార్థులు, యువతతోపాటు నిరుద్యోగులు గంజాయికి బానిసలుగా మారుతున్నారు.

**మూలాలు అన్వేషించకపోవడంతో..**

రెండు నెలల కిందట సుల్తానాబాద్‌లోని ఓ బియ్యం మిల్లులో గంజాయి మొక్కలు వెలుగులోకి వచ్చాయి. గతంలోనూ ఇదే మిల్లులో గంజాయి మొక్కలను గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ మూలాల గురించి అన్వేషణ చేయకపోవడంతో మరోసారి అక్కడే పట్టుబడటం గమనార్హం. ఈ ప్రాంతంలో బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమలు, భవన నిర్మాణం, ఫర్నీచర్ తదితర పనులు నిర్వహించే కూలీలు పని చేయడంతోపాటు గంజాయి వ్యాపారం చేస్తున్నారనే ప్రచారం కొన్ని రోజులుగా సాగుతోంది.

**ఛాయ్ దుకాణాలే అడ్డాలు**

పొడి, ద్రవరూపంలో సులభంగా దొరకడం, పాన్‌టేలాలు, ఛాయ్ హొటళ్లు విక్రయాలకు అడ్డాలుగా మారాయి. గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన కార్పొరేట్ స్థాయిలోని టీ దుకాణాల్లో సిగరెట్ తాగేందుకు ప్రత్యేక గదులను కేటాయిస్తున్నారు. ఈ గదుల్లోనే సిగరెట్‌మాటున యువత గంజాయి తాగుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఛాయ్ తాగడానికంటే గంజాయి తాగడానికే కొన్ని హొటళ్లకు యువత ఎగబడుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులు ఛాయ్ దుకాణాల్లోని ప్రత్యేక గదులపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

**దొరికితే జైలుకే..**గంజాయి రవాణాపై 2021లో బసంత్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేయగా ముగ్గురికి ఈ నెల 13న పెద్దపల్లి జిల్లా న్యాయమూర్తి 7 ఏళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానా విధించారు.గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు 2017లో నమోదు చేసిన గంజాయి రవాణా కేసులో నిందితులు ఇద్దరికి ఈ నెల 24న జిల్లా న్యాయమూర్తి ఒక్కొక్కరికి అయిదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు.

## నాలాల చుట్టూ.. ఆక్రమణల గుట్టు..!

కరీంనగర్ : సాయికృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న ఈ నాలా కూడలిలోనే నగరంలోని 40 శాతం వరద కలుస్తోంది. వాస్తవానికి 12 అడుగుల విస్తీర్ణంలో ఉండే ఈ కాలువలో పట్టాల్సిన నీళ్లకన్నా దాదాపు మూడింతల వరద అధికంగా వస్తోంది. నీటి ప్రవాహం ముందుకెళ్లే దిక్కు లేక రోడ్లపై పారుతూ.. ముకురంపుర, కలెక్టరేట్ వరకు నిలుస్తున్నాయి. ఇటీవల కురిసిన వానకు కరీంనగర్ జలమయమైంది. నాలాల నుంచి పొంగిపొర్లిన వరద రోడ్లను ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లకు చేరిన బురద జనజీవనాన్ని అస్తవ్యస్తంగా మార్చింది. స్మార్ట్‌సిటీ, అభివృద్ధికి ఐకాన్‌గా చెప్పుకొనే నగరానికి ఇదేమి కర్మ అని జనాలు తిట్టుకునే పరిస్థితి ఎదురైంది. భారీ వానలకు ఇంకెంతటి అనర్థాల్ని ఈ విపత్తు రూపంలో ఎదుర్కోవాల్సి వస్తుందనే దిగాలు ప్రజల్లో నెలకొంది.

**బల్దియా ఏం చేస్తున్నట్లు?**

దాదాపు 32 కి.మీ మేర నగరంలో విస్తరించి ఉన్న నాలుగు పెద్ద నాలాలపైన ఇష్టారాజ్యంగా ఇళ్లు, దుకాణ సముదాయాల్ని నిర్మించేశారు. నిబంధనలకు విరుద్ధంగా కాలువల స్థలాలను కబ్జా చేస్తూ కట్టిన ఇళ్ల విషయంలో బల్దియా వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అసలు రహదారి, సెట్‌బ్యాక్‌ల ఊసే లేకుండా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారు. దర్జాగా ఆక్రమించిన కట్టడాలను కూల్చే పరిస్థితి లేదు. పైగా ఉన్న నాలాను వెడల్పు చేయడమనేది ఇప్పుడున్న పరిస్థితుల్లో కష్టమైన ప్రక్రియనే. కనీసం నాలాలో పేరుకున్న మట్టిని చెత్తా చెదారాన్ని తీసేందుకు వీలు లేకుండా వీటిపైన భవనాలను కొన్ని చోట్ల నిర్మించారు. ఇప్పుడు ఈ



కాలువల్లోనుంచి నీరు ముందుకు సాగడం కష్టమవుతోంది.

పట్టణ ప్రణాళిక విభాగం తప్పిదాల పాపమే ఇలా ముంపు బెడద రూపంలో ప్రజలను వెంటాడుతోంది. ఇప్పటికైనా బృహత్తర ప్రణాళిక అమలుతో భవిష్యత్తులో వరద ముంపు లేకుండా చూడాల్సిన అవసరముంది.

అసలు పరిమాణం తక్కువగా ఉండటం.. నీటి ప్రవాహం ఇంతకింతకు పెరగడంతో దాదాపు అన్ని ప్రధాన రహదారులకు ఈ సమస్య ఇబ్బందిని కలిగిస్తోంది. చిన్నా చితకా మురుగు కాలువలన్నీ కలిపి 321 కి.మీ పొడవున్నాయి. వీటన్నింటి నుంచి వచ్చే వరద ఈ నాలాల్లో పడి ముందుకెళ్లకపోవడం.. చాలా చోట్ల కొన్నేళ్ల కిందట నిర్మించిన డ్రైనేజీలు వంకర, మలుపులతో నిర్మించడంతో సాఫీగా వాన నీరు వెళ్లే పరిస్థితి లేదు.

## వర్షాభావం.. వరిసాగుపై ప్రభావం

భువనగిరి : జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రధానంగా వరి సాగు విస్తీర్ణంగా గతేడాది వానాకాలంతో పోల్చుకుంటే సగం కూడా చేపట్టలేదు. కేవలం 42.70 శాతం మాత్రమే సాగైంది. అందులోనూ మూసీ పరివాహక ప్రాంతాల్లోనే ఎక్కువగా సాగు చేశారు. ఆగస్టు మాసాంతం వరకు వరి నాట్లు వేసేందుకు సమయం ఉన్నప్పటికీ రాబోయే రోజుల్లో సమృద్ధిగా వర్షాలు పడితేనే సాధ్యమౌతుంది. గత వారం రోజులుగా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలే మినహా భారీ, అతి భారీ వానలు ఎక్కడా పడలేదు. మెట్ట పంటలకు ప్రయోజనం చేకూరిందే తప్ప వరికి ఒరిగిందేమి లేదు. జిల్లాలో 2024-25లో 2,87,985 ఎకరాల్లో సాగు కాగా.. ఈసారి ఇప్పటి వరకు కేవలం



1,22,978 ఎకరాల్లోనే నాట్లేశారు. గత ఏడాది ఇదే సమయానికి సుమారుగా 2లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి.

**ఐదు మండలాల్లోనే అధికం..** ఆసీఫ్‌నహర్ ఆనకట్ట కింద ఎక్కువ సాగు చేశారు. రామన్నపేటలోనే 22 వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఆ తదుపరి వర్షాధారిత ప్రాంతమైన రాజపేట మండలంలో 14,651, వలిగొండ మండలంలో 11,150 ఎకరాల్లో వేశారు. బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక నారాయణపురం మండలంలో జిల్లాలోనే అత్యల్పంగా 900 ఎకరాల్లో వరి వేశారు. ఈ మండలంలో 26 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోవడం ప్రధాన కారణం. మోత్కూరు మండలం లోనూ అదే పరిస్థితి. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాల నుంచి చెరువులు నింపితే తప్ప వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం లేదు. అతి భారీ వర్షాలు కురిసి చెరువు కుంటలైనా నిండాలి. లేదంటే సాగు తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

## మార్గాలకు మహర్దశ..!

నల్గొండ రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన సూచిక రహదారులే.. కొన్నాళ్లుగా నిర్వహణ లేకపోవడంతో అవి అధ్వానంగా మారాయి. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో ఆర్ అండ్‌బీ రహదారులు పెద్ద సంఖ్యలో దెబ్బతిన్నాయి. గుంతల రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నారు. గమనించిన ప్రభుత్వం తాజాగా రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించింది. హ్యామ్ పద్ధతిలో మెరుగైన రవాణ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో రోడ్లను రాష్ట్రవ్యాప్తంగా 17 ప్యాకేజీలుగా విభజించి అభివృద్ధి, విస్తరణ చేపట్టాల ని నిర్ణయించింది. అందులో భాగంగా నల్గొండ సర్కిల్ పరిధిలోని నల్గొండ, సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి చేపట్టనున్న రహదారులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. టెండర్ల ప్రక్రియకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**537.78 కి.మీ... రూ.622 కోట్లతో అభివృద్ధి**

నల్గొండ సర్కిల్ పరిధిలోని నల్గొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో 44 రోడ్లను గుర్తించి, 537.78 కి.మీ. మేర రోడ్లు ఉన్నతీకరించేందుకు ప్రతిపాదించారు. సుమారు రూ.622 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ప్యాకేజీల వారీగా టెండర్ల ప్రక్రియకు సన్నద్ధమయ్యారు. రెండు జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో రద్దీగా ఉండి, అధ్వానంగా మారిన రోడ్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇచ్చారు. హ్యామ్ పద్ధతిలో వీటి నిర్మాణం పూర్తి చేయనున్నారు.

**రెండో ప్యాకేజీల్లో...**

సాగర్ పీడీబ్ల్యూ రోడ్డు-రాజవరం, పడమటపల్లి-శ్రీశైలం రహదారి, మాడ్గులపల్లి-సాగర్, డిండి-దేవరకొండ వయా బాపనకుంట, కొత్తపల్లి-అంజపూర్ వయా ధర్మాతండా, కుక్కడం-పాములపహాడ్, బొత్తలపాలెం-రాగడప, ముకుందాపురం-తుమ్మడం, బరాఖత్‌గూడెం-కాగితా రామచంద్రపురం, కోదాడ-రివర్ రోడ్డు, రాగినిగూడెం-బరాఖత్‌గూడెం, శాంతినగర్-నడిగూడెం, హుజూర్‌నగర్ లింక్‌రోడ్డు, రింగ్ రోడ్డు, దురాజ్‌పల్లి- గరిడేపల్లి, హుజూర్‌నగర్- యాతవాకిళ్ల, కోదాడ- రివర్‌రోడ్డు, హుజూర్‌నగర్- మేళ్లచెరువు, దామరచర్ల-జాన్‌పహాడ్, సూర్యాపేట-నెమ్మికల్, గౌరారంతండా-నెమ్మికల్, మాదారం-చీదెళ్ల రోడ్లను ఉన్నతీకరించనున్నారు

**ఉన్నతీకరించే రోడ్లు ఇవే..!**

నల్గొండ-మహబూబ్‌నగర్, నల్గొండ-చౌటుప్పల్, నల్గొండ-కట్టంగూర్, మునుగోడు-చౌటుప్పల్, మునుగోడు-కొండాపూర్, ఇడికూడ-నారాయణపూర్, కచలపూర్-కిష్టాపురం, ఎంఎన్‌రోడ్డు-యాచారం వయా తుర్కపల్లి, ఎంఎన్ రోడ్డు-నాగార్జునసాగర్ రోడ్డు, నకిరేకల్-మూసీ వయా నోముల, కట్టంగూరు-ఈదులూరు, నకిరేకల్-గురజాల వయా కడపర్తి, కరుమర్తి-శాలిగౌరారం(ఆకారం), ఈదులూరు-తక్కెళ్లపాడు, తక్కెళ్లపాడు-మనిమద్దె.

## ఇంకుడు గుంత.. నిధుల చింత!

పెద్దశంకరంపేట: ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకించి భూగర్భజలాలను పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టే సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణాలకు లక్ష్యాలనూ నిర్దేశించింది. 2025-26 ఆర్థికసంవత్సరంలో గ్రామాల్లో ఇంకుడు గుంతలు ముమ్మరంగా నిర్మించాలని నిర్ణయించింది. గ్రామాల్లో మురుగు కాలువల చివరన వదిలేయడంతో అక్కడ దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు విజృంభిస్తుంటాయి. ఈ బెడద లేకుండా ఉండేలా సామాజిక ఇంకుడుగుంతల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అయితే నిధుల కొరతతో వెనుకడుగు పడుతోంది.

**ఉపాధి నిధులతో..**

స్వచ్ఛభారత్ మిషన్ కింద మురుగు కాలువల చివర పెద్దవి, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆలయాలు, గ్రామపంచాయతీలు, నీటి ట్యాంకుల వద్ద చిన్నవి నిర్మించాలని నిర్దేశించారు. గ్రామపంచాయతీలలో ప్రస్తుతం నిధులు లేక అడుగు ముందుకు పడటం లేదు. సర్పంచిలు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించలేదు. గ్రామ కార్యదర్శులు నిధుల్లేక పారిశుద్ధ్య పనులకే ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ వీటికి సొంతంగా డబ్బు పెట్టే పరిస్థితి లేదు. జిల్లాకు స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా 324 నిర్మాణాలు మంజూరయ్యాయి. ఒక్కో దానికి అయ్యే ఖర్చు రూ.92,747. కేంద్రం 70, పంచాయతీ నుంచి 30 శాతం నిధులు వెచ్చించాలి. ఇప్పటి వరకు కేవలం 25 చోట్ల మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి ఉపాధి నిధులు కేటాయించారు.

**అక్టోబరు నాటికి సందేహమే..**

ఉపాధి హామీ కింద వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6500 చెల్లిస్తోంది. సామాజికమైతే రూ.15 వేలు చెల్లిస్తారు. కొన్ని మండలాల్లో నిర్మాణాలకు స్థల పరిశీలన చేసి వదిలేశారు. దీంతో అక్టోబరు నాటికి లక్ష్యాన్ని చేరుకోవడం సందేహమే. 15 రోజుల క్రితం నిర్మాణాలు చేపట్టామని, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తామని ఎస్‌బీఎం కోఆర్డినేటర్ ఇలియాస్ తెలిపారు.

చరకలు



## చకచకా.. మారనున్న రూపురేఖ

హైదరాబాద్: అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద చేపట్టిన రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులు వడివడిగా సాగుతున్నాయి. నగరంలోని ఆరు స్టేషన్లలో అభివృద్ధి పనులకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే రూ.170.61 కోట్ల నిధులు మంజూరు చేయగా బేగంపేట్ రైల్వేస్టేషన్ ఇటీవలే ప్రారంభమైంది. మిగిలిన స్టేషన్లలోనూ దాదాపు 75 నుంచి 80శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన ఐదు రైల్వేస్టేషన్లను ఈ ఏడాది డిసెంబరు వరకు పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నాహాలు చేస్తోంది.

**ఉప్పుగూడలో 70 శాతం పూర్తి**

ఉప్పుగూడ స్టేషన్ పునరాభివృద్ధి పనులను రూ.26.81 కోట్లతో చేపట్టారు. రోజూ 50 రైళ్లు ఇక్కడ ఆగుతుండగా..సుమారు 5వేల మంది ప్రయాణిస్తున్నారు. నూతన ముఖద్వారం ఏర్పాటు, స్టేషన్ ఆవరణ ప్రాంత అభివృద్ధి, 12 మీటర్ల ఫుట్ఓవర్ బ్రిడ్జి, 2 ప్యాసింజర్ లిఫ్ట్‌లు, 2 ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫామ్ ఉపరితలాన్ని మెరుగుపరచడం,



ప్లాట్‌ఫామ్ పైకప్పులు అదనంగా ఏర్పాటు, నూతన సూచిక బోర్డులు, ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా అన్నీ పనులు ఏకకాలంలో పురోగతిలో ఉన్నాయి. సుమారు 70శాతం పనులు పూర్తికాగా మరో ఐదు నెలల్లో మొత్తం పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకు న్నారు.

**మల్కాజిగిరిలో 82శాతం..**

ప్లాట్‌ఫామ్-1, ప్లాట్‌ఫామ్-2 వైపు షెల్టర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ప్లాట్‌ఫామ్-1 పై వీఐపీ లాంజ్, శౌచాలయాలు, బాత్‌రూమ్ నిర్మాణం పురోగతిలో ఉంది. ప్లాట్‌ఫామ్-2 పక్కన సైడ్‌వాల్ పనులు, అప్రోచ్‌రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఫుట్ఓవర్ బ్రిడ్జి పిల్లర్లపై గర్డర్లను ఏర్పాటు చేశారు. ఆధునికీకరించిన స్టేషన్ అందుబాటులోకి వచ్చేందుకు మరో 4 నెలలు పట్టే అవకాశం ఉంది.

హఫీజ్‌పేట్, హైటెక్‌సిటీ, మలక్‌పేట్ స్టేషన్లలో సుమారు 25 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో ఐదు నెలల్లో పూర్తిచేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

## అందలానికి అర్హులెందరు..?

ఖమ్మం : సంవత్సర కాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు ఎట్టకేలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఉద్యోగోన్నతులు కల్పించనున్నారు. జిల్లాలో ఎంతమంది ఉపాధ్యాయులు అర్హులనే విషయం తేల్చే పనిలో జిల్లా విద్యాశాఖ అధికారులున్నారు. అర్హుల జాబితా తయారు కోసం కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతులపై ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ నెలాఖరు వరకు చాలామంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆగస్టు 1 తర్వాత



పూర్తి స్థాయిలో ప్రమోషన్లకు ఎంతమంది అర్హులో తేలే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు షెడ్యూల్ ఇచ్చి వాయిదా వేసింది. మళ్లీ వాయిదా వేస్తే ఉపాధ్యాయుల్లో అసంతృప్తి పెరుగుతుందని భావించి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తాజాగా నిర్ణయించింది. ఉద్యోగోన్నతుల అంచనా.. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు- 33, గణితం- 15, భౌతికశాస్త్రం- 14, జీవశాస్త్రం-38, ఆంగ్లం-20, సాంఘికశాస్త్రం-50, తెలుగు-26, హిందీ-20, ఫిజికల్ డైరెక్టర్లు-12, స్పెషల్ ఎడ్యుకేషన్-13, పీఎస్ ప్రధానోపాధ్యాయులు-30.

## దోమల వలయం.. వ్యాధుల నిలయం

అశ్వారావుపేట : అసలే వర్షాకాలం.. ఎక్కడ చూసినా మురుగునీటి గుంతలు.. కుక్కలు, పందుల సంచారం.. చెత్తాచెదారంతో నిండిన ఖాళీ స్థలాలు.. ఏ పంచాయతీ చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్టు ఎక్కడికక్కడ వ్యర్థాలతో మురుగునీటి కాలువలు దోమలకు నిలయాలుగా మారాయి. మశకాల విజృంభణతో జిల్లాలో జనాలు ఆసుపత్రుల పాలవుతున్నారు. మశకాల నిర్మూలనకు ప్రభుత్వం జిల్లాలోని పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు సరఫరా చేసింది. పురపాలక సంఘాలు మినహా 471 పంచాయతీలకు 336 మిషన్లు ఉన్నాయి. వాటిలో సగం కూడా పనిచేయని దుస్థితి నెలకొంది. కొంతకాలం సేవలందించినా మరమ్మతులకు గురి కావడంతో మూలనపడ్డాయి. ఒక్కసారి వీటిని ఉపయోగిస్తే కనీసం రూ.3000 నుంచి రూ.6000 వరకూ ఖర్చు వస్తుండటంతో పంచాయతీలకు భారంగా మారింది. దీంతో ఉన్నతాధికారులు అడిగినప్పుడు మమ అనిపించి చేతులు దులుపుకొంటున్నారు. మలేరియా దోమలను గుర్తిస్తే తప్ప ఆ ప్రాంతంలో మలేరియా మందులు పిచికారి చేయరు. దీంతో మందు పిచికారి చేయక, ఫాగింగ్ లేక ప్రజలు జ్వరాలతో ఆసుపత్రులపాలవుతున్నారు. డెంగీ, మలేరియా, గన్యా జ్వరాలు ఇప్పుడిప్పుడే విజృంభిస్తున్నాయి.ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళిని వివరణ కోరగా.. చాలా పంచాయతీల్లో యంత్రాలు పని చేయడం లేదని తెలిసిందన్నారు. వాటికి మరమ్మతులు చేయించి దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని చెప్పామని వివరించారు. ఎంపీడీఓలకు, డీఎల్‌పీఓలకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆదేశాలు ఇచ్చామన్నారు.

## ట్రా'ఫికర్' తీరేలా.. దిద్దు'బాట' చర్యలు



హైదరాబాద్: ట్రాఫిక్ పోలీసుల అధ్యయనం ప్రకారం.. గతేడాది నగరంలో వాహన సగటు ప్రయాణ వేగం గంటకు 17-18 కిలోమీటర్లు. ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ పరిస్థితిని సమీక్షించి క్షేత్రస్థాయిలో కొన్ని చర్యలు చేపట్టారు. పీక్ అవర్స్‌లో సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండడం.. రోడ్డు ప్రమాదం జరిగితే వెంటనే రాకపోకలు పునరుద్ధరించడం, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడటం, వర్షాకాలంలో రహదారులపై వరద సమస్యకు పరిష్కారం, వీఐపీల రాకపోకల సమయంలో జాగ్రత్తలు ఇలా అనేక చర్యలతో పరిస్థితి మెరుగుపడింది.

**హై-రైజ్ కెమెరాలతో..**

25 చోట్ల హై-రైజ్ కెమెరాల ఏర్పాటుతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే గుర్తించి పరిస్థితిని చక్కదిద్దుతున్నారు. ఈ ఏడాది మే సగటు వేగం గంటకు 24- 25 కిలోమీటర్లకు పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో దేశంలోని మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ ముందు వరుసలో ఉంది. ఈ వేగాన్ని మరింత పెంచడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

**అడ్డంకిగా నిర్మాణాలు**

నగర పరిధిలో రహదారులపై 90 ప్రాంతాల్లో వివిధ రకాల నిర్మాణాలు ఉన్నట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. ప్రార్థనా స్థలాలు, చారిత్రక భవనాలు వంటి అనేక నిర్మాణాలున్నాయి. ఇవి కొన్నిచోట్ల రోడ్డు మధ్యలో లేదా మలుపుల్లో ఉండటం ఇలా పలు కారణాలతో రహదారి విస్తీర్ణం తక్కువగా(బాటిల్ నెక్) మారుతోంది. వాహనాలు అక్కడికి వచ్చేసరికి వాహనాల వేగం ఒక్కసారి నెమ్మదిస్తుంది.

పండగల సందర్భాల్లో జనం రాకపోకలతో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారుతుంది. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ పోలీసులు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంతో సంప్రదింపులు జరుపుతున్నారు. తరలింపు లేదా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టిసారించారు. ఉదాహరణకు పంజాగుట్ట ట్రాఫిక్ పరిధిలోని నిర్మాణంపై పోలీసులు స్థానిక నేతలు, అన్ని వర్గాల ఆమోదం తీసుకునేందుకు సంప్రదింపులు జరపగా సానుకూలత వ్యక్తమైంది. మిగిలిన వాటి విషయంలోనూ చర్చించాలని నిర్ణయించారు.

**బ్రేక్‌డౌన్‌తో సమస్యలు** డ్రైనేజీలు, మ్యాన్‌హోళ్లు పొంగడం, వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలు 63 ఉన్నాయి. ఇవేకాకుండా రోడ్డు ప్రమాదాలు, కొన్నిప్రాంతాల్లో ధర్నాలు, దీక్షలు, వాహనాల బ్రేక్‌డౌన్‌తో తరచూ అకస్మాత్తుగా ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రోజూ సగటున నాలుగు వాహనాలు బ్రేక్‌డౌన్ అవుతున్నాయి. సమస్య పరిష్కరించడానికి అరగంట కంటే ఎక్కువ సమయం పడుతోంది. ఆయా ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటోంది. ఇలా అకస్మాత్తుగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఏం చేయాలనే దానిపైనా ట్రాఫిక్ ఉన్నతాధికారులు చర్చిస్తున్నారు.

# డెంగీ కలవరం



పెద్దపల్లి : జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలతో పల్లె, పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోజు రోజుకూ రోగుల తాకిడి పెరుగుతోంది. జిల్లాలో డెంగీ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఒక వైపు ఇంటింటి సర్వే చేస్తూనే డెంగీ అనుమానిత ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు. కేసుల తీవ్రత తగ్గించేందుకు డెంగీ నిర్ధారణ పరీక్షలు ముమ్మరం చేస్తున్నారు.

**నిత్యం రెండువేలకు పైగా**

జిల్లా ప్రధాన ఆసుపత్రి, గోదావరిఖని సార్వజనిత, మంథని, సుల్తానాబాద్ సామాజిక వైద్యశాలలు, జిల్లాలోని 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగుల తాకిడి పెరుగుతోంది. జిల్లావ్యాప్తంగా నిత్యం 2,853లకుపైగా రోగులు వస్తుండగా వీరిలో చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు. టీడయాగ్నొస్టిక్‌లో నిర్ధారణ పరీక్షలు ముమ్మరం చేస్తున్నారు.

డెంగీ, చికున్‌గన్యా, మలేరియా నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా ఒక్క డెంగీ మాత్రమే పాజిటివ్‌గా తేలింది. టీ డయాగ్నొస్టిక్ కేంద్రలో డెంగీ నిర్ధారణ సౌకర్యం ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ఆర్థికభారం తప్పింది. పంచాయతీ, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో దోమల నియంత్రణ కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

**గర్రెపల్లిలో..**

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో ఇటీవల డెంగీ పాజిటివ్ కేసు నమోదైంది. దీంతో పారిశుద్ధ్యలోపం, వర్షం నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. చెడిపోయిన ఇంజిన్ ఆయిల్, కర్ర పొట్టుతో తయారు చేసిన ఆయిల్ బంతులను గ్రామంలో మురుగు నీటి నిల్వ ప్రాంతాల్లో వదులుతున్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా బాధితుల ఇంటి సమీపంలోని ప్రాంతాల్లో ఫాగింగ్ యంత్రాలతో పిచికారీ చేయిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మూడు డెంగీ కేసులు నమోదుకాగా.. అడ్డుకట్టకు తలమునకలయ్యారు.

**నిరంతరం పరీక్షలు చేస్తున్నాం**

కలెక్టర్ పర్యవేక్షణలో కాలానుగుణ వ్యాధుల కట్టడికి జ్వర సర్వే చేస్తున్నాం. డెంగీ అనుమానిత ప్రాంతాలపై దృష్టిసారించాం. మురుగు నీటి నిల్వలపై ఆయిల్ బంతులు వదులుతున్నాం. జిల్లాలో మలేరియా కేసులు లేవు.

శ్రీరాములు, జిల్లా కీటక జనిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి

# మారుతీ.. ఇలాగేనా వసతి!



మల్యాల : అది ఆలయ పరిధిలోని నిర్మాణం.. అక్రమార్జనపై ఆశతో గుత్తేదారు పనులు నాసిరకంగా చేశారు.. పర్యవేక్షించాల్సిన అధికారులు నాణ్యతను పట్టించుకోకుండా పర్సంటేజీలు దండుకున్నారు.. ఎవరికి వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రెండు దశాబ్దాలు కూడా కాకముందే భవనం శిథిలమైంది.. పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన నిర్మాణాలు ప్రమాదకరంగా మారి భక్తులను భయాందోళనకు గురి చేస్తున్నాయి.. జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయం పక్కన దాదాపు 22 ఏళ్ల కిందట నిర్మించిన మారుతి నిలయం (ధర్మసత్రం) దుస్థితి ఇది..**ప్రమాదకరంగా భవనం** కొండపై ఆలయానికి వెళ్లే దారికి కుడి వైపున 10 గదులతో కూడిన ధర్మశాల భవనానికి 2000 మార్చి 30న అప్పటి ధర్మకర్తల మండలి సభ్యులు భూమిపూజ చేశారు. దాదాపు రెండేళ్లకు నిర్మాణం పూర్తయింది.గదుల కొరత కారణంగా 2005లో అదే భవనంపై దాతల సహకారంతో మరో 10 గదులు నిర్మించారు. మొత్తం 20 గదులతో కూడిన ధర్మశాలకు అధికారులు 'మారుతి నిలయం'గా నామకరణం చేశారు. నిర్మించి 25 ఏళ్లు కూడా పూర్తి కాకముందే మారుతీ నిలయంలో గదులు శిథిలావస్థకు చేరాయి. ఒక్కో గదికి రోజుకు రూ.300 చొప్పున భక్తులకు అద్దెకు ఇస్తున్నారు. నిర్వహణపై అధికారులు పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గదుల్లో నీటి సరఫరా, మరుగుదొడ్ల వసతి అంతంతమాత్రంగానే ఉన్నట్లు భక్తులు పేర్కొంటున్నారు. కొన్ని గదులు ఉరుస్తుండగా, సజ్జలపై సిమెంటు రాలి ఇనుప చువ్వలు తేలాయి. గదుల వెనుక వైపున గోడలు బీటలు వారి చెట్లు మొలిచాయి. భవనంపైకి ఎక్కడానికి నిర్మించిన మెట్ల భాగం కూలిపోయింది.

**ఏటా రూ.25 కోట్లకు పైగా ఆదాయం**భక్తులు హుండీలో నగదు, ఇతర కానుకలు వేస్తుంటారు. కొందరు వెండి, బంగారంతో పాటు అన్నదాన సత్రానికి రూ.లక్షల్లో నగదు సమర్పిస్తుంటారు. ఇలా ఏటా రూ.25 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఈ సొమ్ముతో ఆలయ పరిధిలో అభివృద్ధి పనులను చేస్తున్న నాయకులు, గుత్తేదారులు నాసిరకంగా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. దీంతో కొన్ని పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయన్న విమర్శలున్నాయి.

**భవనాన్ని తొలగిస్తాం** ప్రమాదకరంగా మారిన మారుతి నిలయం భవనాన్ని తొలగించి ఈవో కార్యాలయ భవనం పక్కనున్న ధర్మశాలపై మరో 20 గదులు నిర్మిస్తాం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ధర్మశాల గదులకు మరమ్మతు చేయించి వాటి నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. దాతల సాయంతో కుటీరాలు నిర్మిస్తాం. పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకుంటాం.శ్రీకాంతరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి

## 'ఉపాధి'లో మరింత పారదర్శకత

మెట్‌పల్లి : ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా, సమర్థంగా నిర్వహించే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పథకం కింద ఏటా రూ.కోట్లతో పనులు సాగుతుండగా.. వీటిపై ఏడాదికోమారు సామాజిక తనిఖీలు చేపడుతూ ప్రజావేదికల్లో వివరాలు వెల్లడిస్తున్నారు. అయితే అక్కడక్కడ అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. వీటికి చెక్ పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. అవినీతికి అడ్డుకట్ట పడేలా చర్యలు తీసుకు ంటున్నారు.

**రెండుసార్లు చిత్రాల నమోదు**

క్షేత్ర సహాయకులు ఇప్పటివరకు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) ద్వారా పని ప్రదేశంలో పనిచేసిన కూలీల చిత్రాలను తీసి సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవారు. ఆయా మస్టర్ల ఆధారంగా వారికి వేతన చెల్లింపులు జరిగేవి. ప్రస్తుత విధానంలో రెండుసార్లు కూలీల చిత్రాల నమోదు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. గత రెండు వారాలుగా క్షేత్ర సహాయకులు పని ప్రదేశంలో



ప్రారంభ, ముగింపు సమయాల్లో కూలీల చిత్రాలను తీస్తూ అప్‌లోడ్ చేస్తున్నారు. రెండుసార్లు అప్‌లోడ్ చేస్తేనే హాజరు నమోదవుతుంది. లేకపోతే గైర్హాజరు కింద లెక్కగడుతున్నారు. అనంతరం సామాజిక తనిఖీ వరకు ఫొటో మస్టర్ వివరాలను హార్డు డిస్కుల్లో భద్రపరచనున్నారు.

**నిర్దేశిత వేతనమే లక్ష్యం**

కూలీలకు నిర్దేశించిన రోజువారీ వేతనం రూ.307 పూర్తిగా పొందేలా పని చేయించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో ఉదయం చిత్రం తీసిన తర్వాత కూలీలు కొద్దిసేపు పనిచేసి వెళ్లిపోయేవారు. దీంతో వారికి నిర్దేశించిన వేతనం కంటే తక్కువ వచ్చేది. దీనిని అరికట్టేందుకు కొలతల ప్రకారం పనిచేసి నిర్దేశించిన వేతనం పొందేలా చర్యలు తీసుకోనున్నారు.

**పరిశీలన ఇలా..**చిత్రాలు పని ప్రదేశంలోనివా? మరోచోటివనే విషయం పరిశీలించడం చిత్రంలో ఉన్న కూలీల సంఖ్య, మస్టర్‌లో హాజరైనవారి సంఖ్యకు వ్యత్యాసం వేర్వేరు మస్టర్లలో ఒకేవారు ఉంటే ఆరా తీయడం మొదటి సారి, రెండోసారి తీసిన చిత్రాల్లో ఒకే వ్యక్తులు ఉన్నారా అనేది చూడటం

## కాన్పు కష్టమవుతోంది!

ఖమ్మం : జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య ఆశించిన స్థాయిలో లేదు. ఈ ఏడాది జనవరి నుంచి జులై 25 వరకు నమోదైన గణాంకాల ప్రకారం అనేక పీహెచ్‌సీలూ కాన్పుల్లో వెనకబడ్డాయి. ఉన్నతాధికారులు నిత్యం సంస్థాగత ప్రసవాలను పెంచాలని సూచిస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇటీవల ఓ సమీక్ష సమావేశంలో కలెక్టర్ సైతం ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్య తగ్గిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రసవాల తీరును విశ్లేషిస్తూ కథనం.

**జనవరి నుంచి ఇలా..**

జిల్లాలో 31 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది వాటిలో 227 ప్రసవాలు మాత్రమే నమోదయ్యాయి.

ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం, ముస్తాఫనగర్, వెంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల ప్రక్రియ అసలు లేదు. కాన్పుల విషయంలో బోనకల్లు(32) అగ్రభాగంలో ఉంది. తర్వాత స్థానాలు వేంసూరు (25), గంగారం (24) పీహెచ్‌సీలవి. అయిదు కంటే తక్కువగా పెద్దగోపతి, దెందుకూరు, సుబ్లేడులో నిర్వహించారు. బోదులబండ, కామేపల్లి, కూసుమంచి, మాటూరుపేటలో ఒక్కో కాన్పు మాత్రమే నిర్వహించారు.



ముదిగొండ, మధిర, వల్లభి, నేలకొండపల్లి, కొణిజర్ల కేంద్రాల్లో ఒక్క ప్రసవం కూడా చేయకపోవటం గమనార్హం.

**వెనుకబాటుకు కారణాలెన్నో..**

పీహెచ్‌సీల్లో చాలాచోట్ల వైద్యులు, మౌలిక వసతులున్నా అధికార యంత్రాంగం ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచడంలో విఫలమవుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం, కొంతమంది క్షేత్ర స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడం.నగరానికి చుట్టుపక్కల మండలాల వారు సర్వజనాసుపత్రిలో ప్రసవాలకు ఆసక్తి చూపుతుండటం.

కొన్ని పీహెచ్‌సీల్లో సిబ్బంది, ప్రధానంగా స్టాఫ్ నర్సుల కొరత.

24 గంటల ఆసుపత్రులు కాకపోవటంతో రాత్రివేళలో, అత్యవసర సమయాల్లో ఇబ్బందవుతుందని సందేహిస్తుండటం. కాన్పుల సమయంలో సమీప పట్టణాల్లో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తుండటం.

ఏంచేయాలి? దూరాభారం లేకుండానే ఉచిత, నాణ్యమైన సేవలు అందుతాయన్న విశ్వాసం కల్పించాలి. ఈ దిశగా స్థానిక ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రోత్సహించాలి. ప్రసవానికి ముందు తర్వాత అవసరమైన వైద్య పరీక్షలు, మందులు, చికిత్సలు ఉచితంగా అందిస్తారని, అమ్మఒడి పథకంలో 102 వాహనాల ద్వారా ఉచిత రవాణా సదుపాయం సమకూరుతుందని వివరించాలి. వైద్యారోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమం, పంచాయితీరాజ్, ఇతర అనుబంధ శాఖల మధ్య సమన్వయం పెరగాలి.

'ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలను పెంచడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. తక్కువ సంఖ్య నమోదైన ప్రాంతాలపై దృష్టి సారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నాం. నూరుశాతం లక్ష్యాలను సాధించేందుకు తగిన చర్యలు చేపట్టాం. ' డాక్టర్ చందునాయక్, ప్రోగ్రాం అధికారి.

# ఏఐ బోధనకు ఆటంకాలు!

కొత్తగూడెం : ప్రాథమిక దశలో విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాల పెంపునకు విద్యాశాఖ మూడేళ్ల క్రితం చేపట్టిన 'తొలిమెట్టు' కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సాంకేతికతను వినియోగించుకొని ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలని సర్కారు సంకల్పించింది. కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా 3, 4, 5 తరగతుల విద్యార్థులకు భాష, గణితంలో బోధన ప్రారంభించాలని గతేడాది ప్రణాళిక రూపొందించింది. తొలుత కంప్యూటర్ ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యమిచ్చింది. ఎంపిక చేసిన బడులకు ఐదేసి కంప్యూటర్లను ఈ ఏడాది జూన్‌లో అందిస్తామని పలుమార్లు ప్రకటించింది. ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించింది. అయితే కంప్యూటర్లు పంపిణీ చేయకపోటంతో 'ఏఐ' బోధన అరకొరగా కొనసాగుతోంది.

**50 మందికి పైగా విద్యార్థులు కలిగిన పాఠశాలల ఎంపిక**

ఉభయ జిల్లాల్లో 50 మందికిపైగా విద్యార్థులు కలిగిన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరం నుంచి 'ఏఐ' ద్వారా విద్యనందించేందుకు ఉన్నతాధికారులు సమాయత్తమయ్యారు. కంప్యూటర్ల సరఫరాతో పాటు ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తామని ప్రకటించారు. గతేడాది ప్రయోగాత్మకంగా ప్రారంభించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఐదేసి పాఠశాలల్లో మాత్రమే ప్రస్తుతం ఏఐ బోధన సాగుతోంది. మిగతా బడులకు ప్రభుత్వం



కంప్యూటర్లు, అంతర్జాల సదుపాయం సమకూర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోవైపు భద్రాద్రి జిల్లాలో 15 మంది లోపు విద్యార్థులు కలిగిన 75 పాఠశాలల్లో ట్యాబ్‌ల ద్వారా 'ఏఐ' పాఠాలు బోధిస్తుండటం విశేషం. 'కంప్యూటర్లు ఉన్న పాఠశాలల్లో కృత్రిమ మేధ తరగతులు కొనసాగుతున్నాయి. ఎంపికైన మిగతా బడులకు ప్రభుత్వం కంప్యూటర్లను అందజేయాల్సి ఉంది. కంప్యూటర్లు రాగానే ఆయాచోట్ల ఏఐ పాఠాలు బోధిస్తాం' అని భద్రాద్రి కొత్తగూడెం డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**భద్రాద్రి జిల్లాలో..**

ప్రాథమిక పాఠశాలలు: 95

ప్రాథమికోన్నత 75

# అమ్మ పేరిట పచ్చధనం.. పెరటిలో హరితవనం



సూర్యాపేట: జిల్లాలో 33 శాతం ఉండాల్సిన అటవీ విస్తీర్ణం(పచ్చదనం) తగ్గుముఖం పడుతోంది. హరిత జిల్లా లక్ష్యంగా ఏటా వనమహోత్సవం కింద విస్తృతంగా మొక్కలు నాటుతున్నారు. కానీ వాటిని సంరక్షించకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. 2021 నుంచి 2023 వరకు జిల్లాలో అటవీ విస్తీర్ణం తగ్గటం ఆందోళన కలిగిస్తుంది. గతేడాది వెల్లడైన 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్టు రిపోర్టు-2023' ప్రకారం మూడేళ్ల వ్యవధిలో 1.05 చ.కి.మీ తగ్గింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సారి నిర్దేశించుకున్న లక్ష్యం వెల్లివిరిసేలా నాటిన ప్రతి మొక్కను రక్షిస్తేనే వనం వృద్ధి చెందుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**గతేడాది వెనుకబాటే**

2024-25లో జిల్లా వ్యాప్తంగా 46.58 లక్షల మొక్కలు నాటాలనేది లక్ష్యం. కానీ నాటింది 38.47 లక్షలని తెలిసింది. అంటే 8.11 లక్షలు నాటలేదు. నాటిన ప్రతి మొక్క ఎదగడం లేదని, అందుకు వెచ్చించిన రూ.లక్షల నిధులు నేలపాలయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి.జిల్లాలోని 475 గ్రామాల్లో నర్సరీల్లో సుమారు 42 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 2 లక్షల మొక్కలు ఆరు నుంచి ఏడు అడుగుల ఎత్తులో ఉన్నాయి. చాలా వరకు అడుగున్నర పైగా ఎత్తులో ఉన్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి అప్పారావు పేర్కొన్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు..**

వర్షాలు కురుస్తున్నాయి. నాటేందుకు అవసరమైన మొక్కలు గ్రామ పంచాయతీ నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి. అందుకు తగినట్లు యంత్రాంగం 'ఇందిర వన ప్రభ' కార్యక్రమాల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. అన్ని ప్రభుత్వశాఖలు కలిసి జిల్లా వ్యాప్తంగా ఈ సారి 54.07 లక్షల మొక్కలను నాటేలా ప్రణాళికలను రూపొందించుకుంటున్నాయి. ఇది భాగానే ఉన్నా నాటిన ప్రతి మొక్క ఎదుగుదలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పచ్చదనం పెంపు అమల్లో కంటి తుడుపు చర్యలే కనిపిస్తున్నాయి. చాలా చోట్ల పాదులోనే చనిపోతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం కాగితాల్లోనే మొక్కలుంటున్నాయి కానీ నేలపై ఉండడం లేదు. నిధులూ వృథా అవుతున్నాయి. లక్ష్యం మేర పచ్చదనం పదింతలు పెరగాలంటే నిర్లక్ష్యం చేయకుండా రక్షణ చర్యలు చేపట్టాలి.

**ఇలా చేద్దాం..** ప్రతి ఇంటా నీడ, పండ్ల మొక్కల పంపిణీ విరివిగా జరగాలి. విద్యుత్తు తీగలను దృష్టిలో పెట్టుకొని నాటుదాం. పశువుల బారిన పడకుండా రోడ్లకిరువైపులా నాటిన వాటి చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేద్దాం. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీరందిస్తూ సంరక్షణ చేపట్టాలి. బడుల్లో జన్మదినం జరుపుకొనే విద్యార్థులతో నాటిద్దాం. ప్రధాని మోదీ చెప్పినట్లుగా అమ్మపేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి. వీధుల్లోని రోడ్ల వెంట నాటిన వాటి బాధ్యతను కాలనీవాసులు సమష్టిగా తీసుకోవాలి.

# ఔరా.. సౌర!

కొత్తగూడెం : విద్యుత్తు.. ఇది విద్య, వైద్యం, కమ్యూనికేషన్లు మొదలు ఇళ్లు, పొలాల దాకా ప్రతిచోటా ఉండాల్సిందే. జిల్లాలో ఏటా సగటుకు మించి విద్యుత్తు గిరాకీ పెరుగుతోంది. 2021-22లో రూ.22,354.12 లక్షల విద్యుత్తును వినియోగించగా 2024-25 నాటికి రూ.31,787.93 లక్షలకు చేరింది. అంటే నాలుగేళ్లలో రూ.9,433.81లక్షలు (42శాతం) పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి కోసం విచ్చలవిడిగా బొగ్గు తవ్వకాలు చేపట్టడం, థర్మల్ ప్లాంట్ల ఏర్పాటుతో పర్యావరణం కలుషితమవుతోంది. దీనిని అరికట్టేందుకు పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నాయి.

**మిగులు విద్యుత్తుతో రాబడి..**

సౌర విద్యుదుత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహిళా సంఘాల ద్వారా జిల్లాలో రెండు(ఒక్కోటి 0.50 మెగావాట్) సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. పీఎం కుసుమ్ పథకం కింద 25మెగావాట్ల సౌర ప్లాంట్లు నెలకొల్పేందుకు ఇప్పటికే



ఎల్ఓఏ(లెటర్ ఆఫ్ అవార్డు) జారీ చేసింది. వీటితో పాటు 'సూర్యఘర్' పథకం ద్వారా ఇంటి పైకప్పులపై 3కిలోవాట్ల వ్యవస్థ ఏర్పాటుకు రూ.2.40లక్షలు ఖర్చుకానుండగా.. కేంద్రం రూ.78వేలు రాయితీ ఇస్తోంది. బ్యాంకులు సైతం రుణాలిస్తున్నాయి. జిల్లాలోని ఆరు విద్యుత్తు డివిజన్ల పరిధిలో 743 సోలార్ సర్వీసులు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు 5,41,561యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ఒక్కో యూనిట్‌కు రూ.5.25 చొప్పున మొత్తంగా రూ.28,46,986 డిస్కంలు చెల్లిస్తున్నాయి. ఇందులో సొంత అవసరాలు పోనూ.. మిగులు విద్యుత్తు ద్వారా నిర్వాహకులు ఆదాయం పొందుతున్నారు.

పట్టణ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య అవసరాల కోసం 5-10కిలోవాట్ల సోలార్ ప్యానెళ్లు ఎక్కువగా ఏర్పాటు చేసుకుంటున్నారు. సొంత అవసరాలు తీర్చుకోగా.. మిగిలిన విద్యుత్తును డిస్కంలకు విక్రయిస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం సోలార్ ప్యానళ్ల ఏర్పాటు కోసం వచ్చే దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అజయ్‌కుమార్, జిల్లా మేనేజర్, టీజీ రెడ్కో

# మాలావు దిగుబడి..

కల్లూరు : సాధారణంగా రబీలో వరిలో లావు రకాలే అధికంగా పండిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ అందిస్తున్న నేపథ్యంలో గతేడాది యాసంగిలోనూ చాలామంది రైతులు సన్నాలే సాగు చేశారు. ఉభయ జిల్లాల్లో వరి ఉత్పత్తులకు పేరెన్నికగన్న కల్లూరు మండలంలో కొందరు ముతకల(లావు) వైపు మొగ్గుచూపారు. వీరిలో కొందరు 'పీఆర్ 126' విత్తన సాగుతో దిగుబడుల పంట పండించారు. వ్యవసాయాధికారులే కొందరు రైతుల సగటు దిగుబడుల తీరు చూసి ఆశ్చర్యపోయారు. రైతు పేరు జ్యేష్ఠ చిన్ననరసయ్య. పెద్దకోరుకొండి గ్రామం. తన 20 ఎకరాల పొలంలోని ఆరు ఎకరాల్లో పీఆర్ 126 సాగు చేశారు. ఎకరాకు సగటున 51 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. మంచి దిగుబడి రావటంతో సంతోషం వ్యక్తం చేశారు.

కనిపిస్తున్న రైతు పేరు పోట్రు సత్యం. ఎర్రబోయినపల్లి గ్రామం. పీఆర్ 126 వరివిత్తనాన్ని 12 ఎకరాల్లో సాగు చేశారు. దిగుబడి ఎకరాకు 53.20 క్వింటాళ్ల చొప్పున సాధించి మంచి లాభాలను పొందారు. ప్రభుత్వం ఈ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించటం ఖర్చుల పరంగా కలిసొచ్చిందని రైతు తెలిపారు.

ఎర్రబోయినపల్లి గ్రామానికే చెందిన మరో రైతు పేరు గద్దె శ్రీనివాసరావు. ఇతనూ పీఆర్ 126 విత్తనాన్ని వాడి 10 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు 52 క్వింటాళ్ల దిగుబడి పొందారు.

**ఎంత రావొచ్చు?**



అన్ని రకాల జాగ్రతలు, వ్యవసాయ నిపుణులు సూచించిన ప్రమాణాలను పాటిస్తే పీఆర్126 వరి విత్తనం సాధారణంగా ఒక్క ఎకరంలో 46 నుంచి గరిష్ఠంగా 49 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కల్లూరు మండలంలో రబీలో 48 క్వింటాళ్ల దిగుబడి దాటిన వారు సుమారు 60మంది వరకు ఉన్నారు. వ్యవసాయ నిపుణుల అంచనాలు మించి నలుగురైదుగురు 50 క్వింటాళ్ల పైచిలుకు ఉత్పత్తి రాబట్టారు.

**రైతులేమంటున్నారు?**

వానాకాలపు పంట కోసిన తరువాత వరిదుబ్బులు కాల్చకుండా గడ్డితో సాలుదుక్కులు దున్నాం. 3, 4 రోజుల వ్యవధిలో రెండోసారి కలియదున్ని గడ్డి మునిగే వరకు నీరుపెట్టాం. గడ్డి కూడా ఎరువుగా మారి బలాన్నిచ్చింది. విత్తనాలను మొలక కట్టి శాతాన్ని చూసుకుంటూ, వెదజల్లే పద్ధతిలో సాగు చేశాం. అందరికన్నా ముందుగా నీటి వసతులు ఉండటంతో డిసెంబరులోనే ఈ ప్రక్రియ ప్రారంభించాం. ఎరువులు కావాల్సిన మోతాదులో వినియోగించాం.

**దిగుబడులకు నాలుగు కారణాలు:**

శ్రీనివాసరెడ్డి, ఏడీఏ, సత్తుపల్లి

1 సాగర్ జలాలను వారబందీ పద్ధతిలో అందించటంతో వేరు వ్యవస్థ బాగా పెరిగి దుబ్బులు , దిగుబడులు ఎక్కువగా వచ్చాయి.

2 వెదజల్లే పద్ధతిలో కాలం కలిసి రావడంతోపాటు గింజ వేరు వ్యవస్థలో ఎక్కువ దుబ్బులు రావటానికి అవకాశం ఉంది.

3 సాగర్ జలాలు ఎక్కువ దూరం పారటంతో నీటి లోని మలినాలు (లవణాలు) శుద్ధి అయ్యే అవకాశం ఎక్కువ. దిగుబడు వృద్ధిలో ఇదీ భాగమే. 4 ఈ ఏడాది తెగుళ్లు కూడా చాలా తక్కువగా రావటంతో అనుకున్న దానికన్నా దిగుబడులు ఎక్కువగా వచ్చాయి.

రకం: పీఆర్ 126

అధిక దిగుబడులు సాధించిన గ్రామాలు: ఎర్రబోయినపల్లి, చెన్నూరు, పెద్దకోరుకొండి, రఘునాథగూడెం, చంద్రుపట్ల, వాచ్యానాయక్ తండా

గరిష్ఠ దిగుబడి: 53.2 క్వింటాళ్లు (వంద కిలోల చొప్పున)

# అడ్డుగా..దొడ్డుబియ్యం



హుజూర్‌నగర్ :నిల్వ ఉన్న దొడ్డు బియ్యం వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బియ్యం అమ్మి సొమ్ము చేసుకునే పనిలో పౌరసరఫరాలశాఖ ఉంది. దీనిపై త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు ఇప్పటికే రెండు, మూడు సమావేశాలు నిర్వహించి విధివిధానాలు తయారు చేస్తున్నారని రాష్ట్ర స్థాయి అధికారి ఒకరు తెలిపారు.

రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి హుజూర్‌నగర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి అన్ని ప్రాంతాలలో ఈ పంపిణీ జరుగుతోంది. సన్నబియ్యం పంపిణీ నాటికి జిల్లాలో అన్ని రేషన్ దుకాణాలు, గోదాముల్లో దొడ్డు బియ్యం మిగిలి ఉన్నాయి. వాటిని ఏం చేయాలనే నిర్ణయం ఇప్పటి వరకు తీసుకోకపోవడం వల్ల అవి ముక్కిపోతున్నాయి. దొడ్డు బియ్యం నిల్వ ఉండటంతో పురుగు పడి సన్న బియ్యానికి కూడా పాకుతుందని, బియ్యం గడ్డ కడుతున్నాయని రేషన్ డీలర్లు అంటున్నారు.

**టెండర్ ద్వారా అమ్మకం..**

రేషన్ దుకాణాలు, గోదాములలో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారుల అంచనా. వీటి విలువ రూ.420 కోట్ల పైమాటే. మార్చి నెల నుంచి ఇవి అలాగే మగ్గిపోతున్నాయి. సన్న బియ్యం పంపిణీ షురూ చేసే నాటికి మిగిలి ఉన్న దొడ్డు బియ్యం భద్రపర్చాలని అధికారులు రేషన్ డీలర్లను, గోదాం ఇన్‌ఛార్జిలను ఆదేశించారు. వీటిని పౌరసరఫరాలశాఖ దుకాణాల వారీగా ఉన్న నిల్వల ప్రకారం రికవరీ చేసుకుంటామని అధికారులు డీలర్లకు చెప్పారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. గతంలో కందిపప్పు పంపిణీని నిలిపివేసినప్పుడు డీలర్ల వద్ద ఉన్న పప్పును తీసుకుపోవడానికి దాదాపు 15 నెలల సమయం తీసుకున్నారు. దీంతో ఆ పప్పు పూర్తిగా చెడిపోయిందని డీలర్లు తెలిపారు. కొందరు డీలర్లు చెడిపోయి దుర్వాసన వస్తుందని పారబోశారు. తరువాత దాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులు టెండరు ద్వారా అమ్మకాలు చేశారు. తీరా డీలర్ల దగ్గరకు పప్పు కోసం వెళ్లే చాలా మంది వద్ద లేకపోవడంతో అధికారులు వారికి నోటీసులు జారీ చేశారు. డీలర్లు అప్పుడు మార్కెట్‌లో పప్పు కొని ఇవ్వాల్సి వచ్చింది. ఈ అనుభవం ఉన్న డీలర్లు దొడ్డు బియ్యం ముక్కి, పురుగు పడుతున్నా వాటిని అలాగే ఉంచుతున్నారు.

# వ్యాయామ విద్య.. సహకారం మిథ్య!

ఖమ్మం : కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో మూడే వ్యాయామ విద్య (బీపీఈడీ) కళాశాలలు ఉన్నాయి. వీటిలో రెండు వరంగల్‌లో కొనసాగుతున్నాయి. మరొకటి ఖమ్మంలోని కేయూ పీజీ కళాశాలలో ఉంది. దీనిని ప్రారంభించి పదకొండేళ్లయినా పూర్తిస్థాయి లో బోధనా సిబ్బంది లేరు. రెండేళ్ల బీపీఈడీ కోర్సులో ప్రథమ సంవత్సరం 100 మంది, ద్వితీయ సంవత్సరం 100 మంది విద్యార్థు లు ఇక్కడ చదువుతున్నారు. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల చెందినవారు ఉన్నారు. ఏటా ఫిజికల్ ఎడ్యుకేషనల్ టెస్టు ద్వారా అర్హత సాధించినవారు బీపీఈడీ కళాశాలల్లో చేరుతారు.

**వేధిస్తున్న బోధనా సిబ్బంది కొరత**

ప్రిన్సిపల్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు పార్ట్‌టైమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు క్రీడా శిక్షకులు, యోగా శిక్షకుడు, డైటీషియన్, పార్ట్‌టైమ్ వైద్యుడు ఉండాలి. ప్రస్తుతం ప్రిన్సిపల్, ముగ్గురు కన్సాలిడేటెడ్ సిబ్బంది కలిపి నలుగురే బోధనా సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం. బోధనేతర సిబ్బందిలో ఫిజియోథెరపిస్ట్, లైబ్రేరియన్, మ్యూజిక్ టీచర్, కంప్యూటర్ ఆపరేటర్, సాంకేతిక సహాయకుడు, అకౌంటెంట్, స్టోర్ కీపర్ ఒక్కొక్కరు, ఇద్దరు గ్రౌండ్‌మన్స్/మార్కర్స్,



మరో ఇద్దరు ఆఫీస్ సబార్డినే టర్లు ఉండాలి. ఒక్కో క్లర్కు, అటెండరు మాత్రమే పనిచేస్తున్నారు. మొత్తమ్మీద ఆరుగురితోనే దశాబ్దకాలంపైగా నెట్టుకొస్తున్నారు.

**ఏటా సీట్లు భర్తీ**

ప్రతి సంవత్సరం కళాశాలలో అన్ని సీట్లు భర్తీ అవుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో ఎక్కువ మంది విద్యార్థులు ఈకోర్సును ఇష్టపడుతున్నారు. ఏటా 55 మంది అమ్మాయిలు, 45 మంది అబ్బాయిల చొప్పున చేరుతున్నారు. ఇటీవల పదకొండో బ్యాచ్ విద్యార్థుల కోర్సు పూర్తయ్యింది. చాలామంది క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా బెంగళూరుకు చెందిన ఎడ్యుస్పోర్ట్స్‌లో ఉద్యోగాలు సాధిం చారు. మిగతా వారికీ ప్రభుత్వ, అనుబంధ విద్యాసంస్థల్లో, ప్రైవేటు విద్యాలయాల్లో కొలువులు లభిస్తున్నాయి. 'బోధన, బోధనేతర సిబ్బంది తక్కువ మంది ఉన్నప్పటికీ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. బీపీఈడీ అభ్యసించిన వారి కోసం ఇక్కడ ఎంపీఈడీ కోర్సు ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వ్యాయామ విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న క్రమంలో కళాశాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రజాప్రతి నిధుల సహకారం తీసుకుంటున్నాం.' అని ప్రిన్సిపల్ చేకూరి రవికుమార్ తెలిపారు.

# పోయిన ఉద్యోగాలు.. తిరిగి పొందారు



కొత్తగూడెం : పోయిందనుకున్న ఉద్యోగం తిరిగి లభించనుంది. దీంతో నాలుగేళ్ల ఎదురుచూపులు ఫలించాయి. నాలుగు రోజుల క్రితం సింగరేణి యాజమాన్యంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలకు తిరిగి ఉద్యోగావకాశాన్ని కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించింది. దీంతో ఉద్యోగాలను పోగొట్టుకొని తిరిగి అవకాశం కోసం చూస్తున్న 143 మంది మాజీ జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలు తిరిగి కొలువుల్లో చేరనున్నారు. ఈ అంశంపై యాజమాన్యానికి, గుర్తింపు సంఘానికి మధ్య ఒప్పందం కుదరగా త్వరలో దీనిపై త్రైపాక్షిక సమావేశంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లోని రీజనల్ లేబర్ కమిషనర్ ముందు ఇరు పార్టీలు ఒప్పంద పత్రాలపై అంగీకార సంతకాలు చేసిన తర్వాత ఓ సర్క్యులర్ జారీ కానుంది.మూడు నాలుగు సంవత్సరాలుగా సింగరేణిలో చేరిన జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీలు కంపెనీ నిబంధనలను పాటించక పోవటంతో తొలగింపునకు గురయ్యారు. వారు చేస్తున్న ఉద్యోగానికి తగిన పత్రాలను సాధించటంలో కొందరు విఫలమైతే, గైర్హాజరు కారణంగా మరికొంత మంది తొలగింపునకు గురయ్యారు. ఉద్యోగంలో చేరిన సంవత్సరంలోగా అర్హత కోసం గ్యాస్‌టెస్టింగ్, ఓవర్‌మెన్ మొదలైన సాంకేతిక కోర్సులను పూర్తిచేసి ధ్రువీకరణ పత్రాలను పొంది గడువులోగా సమర్పించాలి. కొందరు ఈ కోర్సులను పూర్తి చేసినా కరోనా సమయంలో డీజీఎంఎస్ డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ వారు ధ్రువీకణ పత్రాలు ఇవ్వకపోవటంతో వారు పత్రాలను సమర్పించలేకపోయారు. దీంతో వీరిని యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. సింగరేణిలో జేఎంఈటీలను తిరిగి విధుల్లో తీసుకోవటం విశేషం. తిరిగి ఉద్యోగావకాశాన్ని పొందిన జేఎంఈటీలు నిబద్ధతతో పనిచేయాలని సింగరేణి అధికారులు సూచిస్తున్నారు.

**సంతోషంగా ఉంది: నిశాంత్, మందమర్రి** ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న మాకు మళ్లీ కొలువు ఇప్పించటం సంతోషంగా ఉంది. నిబంధనల ప్రకారం కృషి చేసి ఉద్యోగాలు నిలుపుకొంటాం. ధ్రువపత్రాలు సమర్పించేందుకు గడువు దాటడంతో సమయానికి పత్రాలను సమర్పించలేకపోయాం. దాని వల్ల ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది.

**కొత్త జీవితం..: మాదరబోయిన దీక్షిత్, గోదావరిఖని**

మాకు గుర్తింపు సంఘం కొత్తజీవితాన్ని అందించింది. కరోనా సమయం కావటంతో కోర్సు చేసేందుకు అవకాశం లేకపోయింది. అందువల్ల తొలగింపునకు గురయ్యాం. యూనియన్ సహకారంతో తిరిగి నియామకం పొందేందుకు అవకాశం రావడం సంతోషంగా ఉంది.

## జీఎస్ఎల్వీ-ఎఫ్16 రిహార్సల్ పూర్తి

శ్రీహరికోట : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగంపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టారు. ఆదివారం ఉదయం 7.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రయోగానికి సంబంధించిన రిహార్సల్ నిర్వహించారు. రాకెట్లోని ప్రతి అంశాన్ని సున్నితంగా పరిశీలించి, వాటి పనితీరును తెలుసుకున్నారు. అన్నీ శాస్త్రవేత్తల అంచనాలకు తగ్గట్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ప్రీ కౌంట్డౌన్ ప్రారంభమైంది. ఈ ఏడాది నిర్వహించిన రెండు రాకెట్ ప్రయోగాలు విఫలం కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతి అంశాన్ని లోతుగా అన్వేషిస్తున్నారు. రాకెట్ సన్నద్ధత, లాంచ్ ఆథరైజేషన్ సమావేశాలు జరగనున్నాయి. ఇందులో రాకెట్ అనుసంధానంతోపాటు నిసార్ ఉపగ్రహం తదితర



వాటిపై శాస్త్రవేత్తలు చర్చించనున్నారు.

**కౌంట్డౌన్లో మార్పు**

ఇప్పటి వరకు ప్రయోగానికి 27.30 గంటల కౌంట్డౌన్ నిర్వహించాలని శాస్త్రవేత్తలు భావించారు. వాతావరణంలో మార్పులుంటే కౌంట్డౌన్ ప్రక్రియలో మార్పు చేయనున్నట్లు తెలుస్తోంది. రాకెట్ సన్నద్ధత సమావేశంలో దీనిపై ప్రకటన చేయనున్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్16 వాహకనౌక నాసా ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్(నిసార్) ఉపగ్రహాన్ని మోసుకెళ్లనుంది. నిసార్ రెండు శక్తివంతమైన రాడార్ వ్యవస్థలను కలిగి ఉంది. దీని బరువు 2,392 కిలోలు. దీనికి రూ.12,500 కోట్లు ఖర్చు చేశారు.

## ప్రజల ప్రాణాలతో ఆటలా!!

పరవాడ : అనకాపల్లి జిల్లా పరవాడ జేఎన్ ఫార్మాసిటీ డెవలపర్గా వ్యవహరిస్తున్న విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ (రాంకీ) యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ఫార్మా వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు అమలు చేయకుండా పర్యావరణానికి తూట్లు పొడుస్తోంది. తాడి కొండ ప్రాంతంలో రాంకీల్యాండ్ఫిల్ నిండిపోవడంతో మరో చోట భారీగా ఫార్మా ఘన వ్యర్థాలను నిల్వ చేయడంపై ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తీవ్రంగా పరిగణించి నోటీసులు జారీ చేసింది. ఎన్నో అంశాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు నోటీసులు ఇచ్చి సరిపెట్టేస్తున్నారని, చర్యలు మాత్రం లేవని 'ఫార్మా సిటీ' పరిసర ప్రజలు మండిపడుతున్నారు.

**ప్రత్యామ్నాయంపై దృష్టేది:** గత వైకాపా ప్రభుత్వం తాడికొండపై మరో 'ల్యాండ్ఫిల్' కేంద్రం నిర్మాణానికి 50 ఎకరాలు కేటాయించింది. 2024 జనవరిలో పరవాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణకు సభ నిర్వహించారు. ఇప్పటికే ఉన్న 'ల్యాండ్ఫిల్' నుంచి తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, మరో కాలుష్య కుంపటి తమపై పెట్టడం సరికాదని తాడి గ్రామం, పరిసర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పటి నుంచి ఏడాదిన్నర గడిచినా, ఉన్న ల్యాండ్ ఫిల్ కేంద్రం నిండిపోతుందని తెలిసినా రాంకీ సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఘనవ్యర్థాల సేకరణ ప్రక్రియను రాంకీ నిలిపివేయడం ఫార్మా కంపెనీలకు సమస్యగా మారింది. వ్యర్థాలను నెల్లూరులోని నిల్వ కేంద్రానికి తరలిస్తామని పీసీబీ అధికారులు చెబుతున్నా రవాణాభారం అవుతుందని పేర్కొంటున్నారు.

**తవ్విన చెరువును ఏం చేస్తారు?:** రాంకీ సంస్థ ఫార్మాసిటీ సమీపంలోని తానాం గ్రామం వద్ద దాదాపు ఎకరంపైగా భూమి కొనుగోలు చేసి



2022లో చెరువును తవ్వించింది. 'గ్రీన్బెల్టు' ప్రాంతంలో భూమి కొన్నా... మొక్కలు పెంచకుండా రసాయన వ్యర్థ జలాల నిల్వకు చెరువును తవ్వడం సరికాదని ప్రజలు మండిపడ్డారు. చెరువు తవ్వకం పనులు నిలిపేయాలని 2022లో తానాం పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామసభలో తీర్మానం చేశారు. తరువాత అధికారులకు ఫిర్యాదుచేశారు. చెరువు తవ్వకం పనులు ఆపాలని, తవ్విన మేరకు వెంటనే పూడ్చాలని రాంకీ సంస్థకు పీసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా..ఇప్పటికీ పరిస్థితి మారలేదు. చెరువు నీళ్లు తాగిన పశువులు, మూగజీవులు మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

**వ్యర్థ జలాలతో భయంభయం:** వర్షాల సమయంలో ఫార్మాసిటీలో రసాయన వ్యర్థ జలాలను బయటికి విడిచిపెట్టేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పరవాడ, భరణికం చెరువులు, గెడ్డలు కాలుష్యమయమై చేపలు మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. గత మే నెలలో రసాయన వ్యర్థ జలాలు బయటికి వదిలేయగా భరణికంలోని మొల్లోడు గెడ్డలోకి చేరాయి. రైతులు, స్థానికులు ఆందోళన చేసి కలెక్టర్, పీసీబీకి ఫిర్యాదు చేశారు. పీసీబీ సిబ్బంది గెడ్డలో నీటి నమూనాలు సేకరించి ల్యాబ్కు పంపారు. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(సీవోడీ) ఎక్కువ ఉన్నట్లు గుర్తించి గత నెలలో 'రాంకీ'కి నోటీసులు జారీచేశారు. తదుపరి చర్యలు నిమిత్తం పీసీబీ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపారు.

# ప్రగతి దారిలో పలుగురాళ్లు



తిరుపతి : కూటమి ప్రభుత్వం పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తోంది. ఎంఎస్ఎంఈలు మొదలుకొని మెగా పరిశ్రమలు స్థాపించాలని ఔత్సాహికులను కోరుతోంది. సరిపడా భూమి, నీరు, ప్రోత్సాహకాలు అందిస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఇదే సమయంలో ప్రస్తుతమున్న పారిశ్రామిక పార్కులపై దృష్టి సారించి మౌలిక వసతులు కల్పించాలి. కొత్తగా నెలకొల్పే పారిశ్రామికవాడలకు ఇవి ఆదర్శంగా నిలిస్తే మరింతమంది పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకొస్తారు. యంత్రాంగం ఈ దిశగా చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాలు.. చెన్నై, బెంగళూరు మహా నగరాలకు దగ్గరగా ఉన్నాయి. కర్మాగారాల స్థాపనకు అవసరమైన భూమి కూడా అందుబాటులోనే ఉంది. ఏ పక్క చూసినా జాతీయ రహదారులు, రైల్వే లైన్లు ఉన్నాయి. పొరుగునే కృష్ణపట్నం, చెన్నై నౌకాశ్రయాలున్నాయి. రేణిగుంటలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. ఇన్ని అనుకూలతలు.. మన జిల్లాల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో ఈఎంసీలు విస్తరించాయి. వీటి వరకు మౌలిక సదుపాయాలు బాగానే ఉన్నా పాత పారిశ్రామిక పార్కుల్లోనే సమస్యలు తిష్ఠ వేశాయి. ఇక్కడ యూనిట్ల స్థాపనకు ప్లాట్లు ఉన్నా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు వెనుకంజ వేస్తున్నారు. గంగాధరనెల్లూరులోని పారిశ్రామికవాడ 2014- 19 మధ్య ఓ వెలుగు వెలిగింది. భూమి తీసుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఇటువైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. తెలుగుదేశం హయాంలో మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడా. జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. రహదారులు, మురుగునీటి పారుదల వసతి కల్పించాలి. తిరుపతి జిల్లాలో మేనకూరు పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డు సైతం గుంతలమయంగా మారింది. రేణిగుంట మండలంలో మూడు పారిశ్రామివాడలుండగా అన్నింటిలోనూ రోడ్లు సరిగా లేవు. వీధిదీపాలు వెలగడంలేదు. గాజులమండ్యంలో విశాలమైన రహదారులున్నా అంతా గుంతలు తేలాయి.

**మచ్చుకు గంద్రాజుపల్లెను పరిశీలిస్తే..**

గంగవరం మండలంలోని గంద్రాజుపల్లె పారిశ్రామిక పార్కు.. బెంగళూరుకు సమీపంలోనే ఉంది. ఈ ప్రాంతానికి చేరుకోవడానికి రెండు గంటలు కూడా పట్టదు. ఇంతటి సానుకూలత ఉన్నా అంతర్గత రహదారులు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. దీనికితోడు విద్యుత్తు అంతరాయం వేధిస్తోంది. చిన్న చిన్న ఇబ్బందులను పరిష్కరిస్తే వందల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయి. స్థానికులకు ఉపాధి లభిస్తుంది.

**జిల్లా కేంద్రంలోనే అధ్వానంగా**

చిత్తూరు పారిశ్రామిక పార్కులో దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు ఛిద్రమయ్యాయి. వర్షం వస్తే రెండు- మూడు రోజులపాటు ఈ ప్రాంతం అంతా బురదమయమే. పారిశుద్ధ్య నిర్వహణ కూడా అధ్వానమే. మరోవైపు యూనిట్లు స్థాపించుకున్న వ్యక్తుల నుంచి మాత్రం డబ్బులు వసూలు చేస్తున్నారు. వైకాపా హయాంలో ఈ విషయమై గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. ఇప్పుడైనా వీటన్నింటినీ సరిదిద్దాలి.

**నివేదికలు సిద్ధం చేసి పంపితే..**

రెండు జిల్లాల్లోని పారిశ్రామిక పార్కుల్లో ఎక్కడెక్కడ మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయి? ఎంత ఖర్చవుతుంది? అని ప్రభుత్వానికి నివేదిస్తే ఫలితం ఉంటుంది. తీవ్రతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే కనీసం ఆరు నెలలు- ఏడాదిలోనైనా నిధులు విడుదలవుతాయి. ప్రస్తుతం పీపీపీ విధానంలో నూతన పారిశ్రామిక పార్కులు నెలకొల్పుతున్నందున.. ఇక్కడ కూడా ప్రైవేటు వ్యక్తులతో కలిసి కనీస సదుపాయాలు కల్పించవచ్చు.

# ఆస్తుల ఆటో మ్యుటేషన్ వైపు అడుగులు



చిత్తూరు : నగరంలో ఖాళీ స్థలం, ఇల్లు కొనుగోలు చేసుకున్నవారు ఆ ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయం ద్వారా రిజిస్టర్ దస్తావేజులు ఆన్లైన్లో పంపితే అధికారులు పరిశీలించి టైటిల్ మార్పు చేసి పన్ను విధిస్తారు. పాత విధానంలో ఆస్తుల మార్పిడికి నగరవాసులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ ఇబ్బందులు తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల్ని తీసుకొచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే ఆన్లైన్ విధానంలో ఆటో మ్యుటేషన్(యజమాని పేరు ఆన్లైన్లోనే మారడం)ను అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆగస్టు ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న దస్తావేజులకు ఆటో మ్యుటేషన్ విధానాన్ని అమలు చేయనుంది.

**మార్కెట్ విలువ ప్రకారం రుసుములు**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే ఆ వివరాలు నగరపాలక అధికారులకు ఆన్లైన్ ద్వారా చేరతాయి. అక్కడ పరిశీలించి ఆమోదం పొందగానే ఆటో మ్యుటేషన్ పత్రం జనరేట్ అవుతుంది. ఈ ప్రక్రియ ముగిశాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త దస్తావేజులతోపాటు ఆస్తి బదలాయింపు పత్రం పొందేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మార్కెట్ విలువ, స్థలం విస్తీర్ణం బట్టి మ్యుటేషన్ రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంపై జిల్లా రిజిస్ట్రారు ఏవీఆర్ మూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్లు సబ్ రిజిస్ట్రార్లు, నగరపాలక అధికారులకు అవగాహన కల్పించారు.

**ఆస్తి పన్ను రసీదు తప్పనిసరి**

రిజిస్ట్రేషన్ సమయంలో గతంలో ఇంటికి చెల్లిస్తున్న రసీదు సమర్పించాలి. స్థలమైతే వీఎల్టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) రసీదు అందజేయాలి. రిజిస్ట్రేషన్ తర్వాత ఆటోమేటిక్గా నగరపాలక రికార్డుల్లో పేరు మారుతుంది. అవి లేని పక్షంలో పన్ను వేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నగరపాలక లాగిన్కు సమాచారం వస్తుంది. ఆ మేరకు పేరు మార్చి పన్ను విధిస్తారు. ఒకే ఆస్తిని ఇద్దరు, ముగ్గురు కలిసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తించనుంది.

# కాలం మారేను మెల్లగా.. 'మెట్రో'లో వెళ్దాం చల్లగా!




విశాఖపట్నం: విశాఖలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి... మెట్రో రైలు ప్రాజెక్టును పట్టాలెక్కించే ప్రక్రియ వేగంగా సాగుతోంది. రూ.6,250 కోట్లతో మొదటి దశ పనులకు ఆంధ్రప్రదేశ్ మెట్రో రైలు కార్పొరేషన్ (ఏపీఎంఆర్సీఎల్) టెండర్లు ఆహ్వానించింది. ఇంజినీరింగ్ పనులు, ఆకృతులు, వాటి నిర్మాణానికి అర్హులైన కంపెనీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆసక్తి ఉన్న బిడ్డర్లు సెప్టెంబరు 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాలి. ఏపీఎంఆర్సీఎల్ కార్యాలయంలో ఆగస్టు 12న ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నారు. సెప్టెంబరు 5 నుంచి దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పిస్తారు. అదే నెల 12న బిడ్లు తెరవనున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టును ప్రారంభ తేదీ నుంచి 30 నెలల్లో పూర్తిచేసి అప్పగించాలని ఏపీఎంఆర్సీఎల్ స్పష్టం చేసింది. 'డబుల్ డెక్కర్' పైవంతెన పనులు ప్రారంభించిన రెండేళ్లలో పూర్తిచేయాలంది.

వీఎంఆర్డీఏకు అనకాపల్లి, విజయనగరం, విశాఖ జిల్లాల్లో 1,941.19 ఎకరాల భూసమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. రైతుల నుంచి సమీకరించిన భూములకు పరిహారంగా అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇస్తారు. మిగిలిన భూములను వీఎంఆర్డీఏ విక్రయిస్తుంది. ఈ ప్రక్రియలో వచ్చిన నిధుల్లో కొంత మెట్రో ప్రాజెక్టుకు వెచ్చించనున్నారు.

అతి పొడవైనదిగా: నగరంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పది పైవంతెనల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. అయితే ఆ వంతెనల స్థానంలో మెట్రోను డబుల్ డెక్కర్ తరహాలో తీసుకురానున్నారు. కొమ్మాది-స్టీల్ప్లాంటు మధ్య నిర్మించే 34.40 కి.మీ కారిడార్లోనే ఇది రానుంది. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 8 పైవంతెనలను అనుసంధానం చేసి ఒకే వంతెనగా నిర్మిస్తారు. గాజువాక నుంచి స్టీల్ప్లాంటు మధ్య మరొకటి నిర్మించనున్నారు. మొత్తంగా 20 కిలోమీటర్లలో 'డబుల్ డెక్కర్' వస్తుంది. ఇక్కడ కింద రోడ్డు... దానిపైన నాలుగు వరుసల్లో పైవంతెన (ఫ్లైఓవర్), ఆపైన మెట్రో ట్రాక్ రానుంది. ఇది పూర్తయితే ఆసియా ఖండంలోనే పొడవైన డబుల్ డెక్కర్ మెట్రోగా గుర్తింపు పొందనుంది.

## ఎడాపెడా వాడేస్తున్నారు..!

రాజమహేంద్రవరం : వ్యవసాయంలో రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. దీనికి సంబంధించి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పరిగణనలోకి తీసుకుంటే నాణ్యమైన ఆహార ఉత్పత్తులతోపాటు .. నేలతల్లి సారాన్ని సంరక్షించవచ్చు. దేశంలో 2023-24 సంవత్సరంలో ఎకరాకు సగటున 56 కిలోలు యూరియా వాడితే..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రైతులు సగటున 90 కిలోలు వినియోగించడం గమనార్హం. ఒక్క తూర్పుగోదావరిలోనే ఎకరాకు 164 కిలోలు వాడారు. కాకినాడలో 55.2 కిలోలు వినియోగించగా.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాత్రం 50.8 కిలోల చొప్పున వాడి ఆదర్శంగా నిలిచారు. ఎరువుల అధిక వినియోగం నియంత్రించాలని కేంద్రం హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇటీవల వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.



**నేలకు చేటు**

తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ సగటుకు మించి 200 శాతం అధికంగా ఎరువు వినియోగిస్తున్నారు. జిల్లాలో రబీలో 58 వేలు, ఖరీఫ్లో 72 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. దీనిలో దాదాపు 47 వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోందని గణాంకాలు చెబుతున్నా సుమారు 7 వేల ఎకరాల్లోనే పూర్తిగా అమలవుతోంది. మిగిలిన 40 వేల ఎకరాల్లో కషాయాలతోపాటు అప్పుడప్పుడూ యూరియా వినియోగిస్తున్నారు.

సాధారణంగా పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్లు నాలుగు, రెండు, పాళ్లు చొప్పున వేయాల్సి ఉండగా నత్రజని 8 నుంచి 13 పాళ్లు వాడుతున్నారు. దీంతో నేల సారం దెబ్బతింటోందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు.

**ఇలా చేస్తే మేలు**

నాట్లు వేసేటప్పుడు 50 కిలోల డీఏపీ బస్తాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలపాలి. దీనికి భిన్నంగా రైతులు బస్తాన్నర (దాదాపు 60 కిలోలు) యూరియా వేస్తూ పొటాష్, డీఏపీ వేయడం లేదు. పంట 30 రోజుల సమయంలో రెండో దఫా వేసినప్పుడు 25 కిలోల యూరియా సరిపోతుంది. లేకపోతే తక్కువ ధరకు లభించే నానో యూరియా పావు లీటరు పిచికారీ చేస్తే మేలు. 90 శాతం పంటకు ఉపకరిస్తుంది. పంట 45 నుంచి 50 రోజుల్లో 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ మాత్రమే వాడాలి. లేదంటే అరలీటరు నానో యూరియా వాడితే చాలు. విజయవాడలోని కార్యశాలలో నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచిస్తూ తూర్పుగోదావరిలో 1400, కాకినాడ, కోనసీమలో 1000 నుంచి 1200 లీటర్ల చొప్పున వినియోగించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

## ఆ అధికారుల్లో ఎవరి పాత్ర ఎంత?

కాకినాడ : గత వైకాపా ప్రభుత్వంలో కాకినాడ నగరపాలక సంస్థలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న కొందరి అధికారుల పాత్రపై రాష్ట్ర ఇంటిలిజెన్స్ విభాగం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. 2019-2024 వరకు సాగించిన అక్రమాల పర్వంపై లోతుగా వివరాలు సేకరిస్తోంది. దీనిపై సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందించనున్నట్లు సమాచారం. వైకాపా హయాంలో నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ)గా పనిచేసిన సీహెచ్.నాగనరసింహారావు, అప్పటి పర్యవేక్ష ఇంజినీరు పి.సత్యకుమారి, ఈఈ ఎస్.ప్రభాకరరావు, డీఈఈ కె.వెంకటరావు, ఎం.రమేశ్బాబులు మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి పూర్తిగా సహకరించారని, అడ్డగోలు నిర్ణయాలకు కౌన్సిల్ తీర్మానాలు చేసి రూ.కోట్లలో నిధులు లబ్ది చేకూరేలా చేశారని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ప్రాథమికంగా గుర్తించి, ఆ అధికారులపై చర్యలకు సిఫార్సు చేసింది. దీంతో గత



మూడు రోజులుగా కాకినాడ నగరపాలక సంస్థలో కలకలం రేగుతోంది. వారు ఎంత కాలం ఇక్కడ పనిచేశారు.. తీసుకున్న నిర్ణయాల్లేంటి, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి ఏ విధంగా ఆయాచిత లబ్ధి చేకూర్చారు అనే కోణంలో ఇంటిలిజెన్స్ విభాగం ఆరా తీస్తోంది. గతంలో కాకినాడ నగరపాలక సంస్థలో పనిచేశారా..? తర్వాత ఎక్కడి బదిలీ అయ్యారు..? వైకాపా ప్రభుత్వం వచ్చాక.. ఇక్కడకు ఎలా వచ్చారు..? అక్రమాలకు ఏవిధంగా సహకరించారనే నివేదికను సిద్ధం చేస్తున్నారు.

**పూడికతీతపై దుమారం**

ప్రధానంగా అరట్లకట్ట వేసవి జలాశయంలో పూడికతీత పనులకు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నుంచి కొటేషన్ తీసుకోకుండా, ఏకపక్షంగా ఇక్కడి అధికారులు వ్యవహరించారనే అంశం దుమారం రేపుతోంది. విజిలెన్స్ విభాగం చర్యలకు సిఫార్సు చేసిన అయిదుగురిలో సీహెచ్.నాగరసింహారావు మున్సిపల్ ఆర్డీగా రాజమహేంద్రవరంలో పనిచేస్తున్నారు. పి.సత్యకుమారి విజయవాడ నగరపాలక సంస్థలో పర్యవేక్షక ఇంజినీరుగా, ఈఈ ప్రభాకరరావు విజయవాడ, డీఈఈ కె.వెంకటరావు నూజివీడు, ఏఈ రమేశ్బాబు రాజమహేంద్రవరంలో పనిచేస్తున్నారు. వీరిలో సత్యకుమారి తన సర్వీసులో ఎక్కువ కాలం కాకినాడలో పనిచేసిన అంశంపైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మొత్తం మీద గత ప్రభుత్వంలో అధికారుల అడ్డగోలు వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు సిద్ధమవుతున్నారు. విజిలెన్స్ పూర్తి నివేదికను బట్టబయలు చేస్తే మరిన్ని అక్రమాలు వచ్చే అవకాశం ఉంది.

**నేను ఒక సంతకమే పెట్టాను**

కాకినాడ మున్సిపల్ కమిషనర్(ఎఫ్ఏసీ)గా ఉన్న కాలంలో అరట్లకట్ట రిజర్వాయర్లో పూడికను తరలించే క్రమంలో రైల్వే అనుమతి కావాలంటే నేను ఒక సంతకం మాత్రమే చేశాను. మిగతా వ్యవహారాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. సీహెచ్.నాగనరసింహారావు, మున్సిపల్ ఆర్డీ,రాజమహేంద్రవరం

చురకలు



# గుంతకల్లు, గుత్తి రైల్వే జంక్షన్లకు మహర్దశ

గుంతకల్లు : రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, స్టేషన్ల గుండా సకాలంలో రైళ్లు బయలుదేరి వెళ్లేవిధంగా చూడడానికి గుంతకల్లు, గుత్తి రైల్వే జంక్షన్లలో అత్యాధునిక వసతులు సమకూర్చనున్నారు. దీనికి గాను రూ. 47.69 కోట్లు కేటాయించి గుత్తేదారులకు ఆయా పనులు అప్పగించే ప్రక్రియను పూర్తి చేశారు. గుంతకల్లు జంక్షన్‌లో అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. పనులు పూర్తయితే గుత్తి, గుంతకల్లు జంక్షన్లలో మెరుగైన సౌకర్యాలు ప్రయాణికులకే కాకుండా రైల్వే సిబ్బందికి సమకూరనున్నాయి. స్టేషన్లలో పనులు చేపట్టడానికి అవసరమైన నిధుల కోసం గత 20 ఏళ్ల నుంచి నుంచి ఎదురు చూస్తుంటే రైల్వే బోర్డు ప్రస్తుతం నిధులు కేటాయించడం శుభపరిణామం.

**క్షేత్రస్థాయిలో చకచకా పనులు**



గుత్తి రైల్వే జంక్షన్‌లో ప్లాట్‌ఫాంల నిర్మాణం, షెల్టర్ల ఏర్పాటు, వంతెనల నిర్మాణం, అదనపు రైల్వేలైన్లు, గదుల నిర్మాణ పనులను చేపడుతున్నారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో యార్డు విస్తరణ, స్టేషన్ భవనాల నిర్మాణంతో పాటు స్టేషన్‌లోని అన్ని రైల్వేలైన్ల అనుసాధానం పనులు చేపడుతున్నారు. కొత్తదైన ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఇప్పుడు స్టేషన్‌లో ఉన్న మూడు సిగ్నలింగ్ క్యాబిన్లను తొలగించి వాటిని ఒకే గదిలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుకోసం ఇప్పటికే స్టేషన్‌లో రూ. 3 కోట్లు ఖర్చు చేసి సిగ్నలింగ్ క్యాబిన్ భవాలను నిర్మించారు. యార్డుల విస్తరణ పూర్తయితే తప్పా సిగ్నలింగ్ వ్యవస్థలో మార్పులు చేయడానికి అవకాశం లేదని విస్తరణ పనులను చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కొత్త వ్యవస్థ ఏర్పాటైతే కంప్యూటర్ల సాయంతో సిగ్నళ్లు పనిచేస్తాయని అధికారులు పేర్కొన్నారు. రైలు ప్రమాదాలు జరగడానికి, రైళ్లు డేంజర్ సిగ్నళ్లను దాటే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. లైన్ల అనుసంధాన పనులను చేయడానికి స్టేషన్‌లోని పాత బుకింగ్ కార్యాలయానికి చెందిన భవనాలు పూర్తిగా తొలగించనున్నారు.

# నైపుణ్యాభివృద్ధిమస్తు.. ఉద్యోగ ప్రాప్తిరస్తు..!

మద్దిలపాలెం : ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకే కొలువులు దొరకని రోజులివి. ఇక సాధారణ డిగ్రీ చేసిన విద్యార్థుల పరిస్థితి ఏమిటి..? వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయి.. ఈ ప్రశ్నలకు జవహర్ విజ్ఞాన కేంద్రాలు (జేకేసీలు) సమాధానాలు చెబుతున్నాయి. డిగ్రీ విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇచ్చి ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దుతున్నారు. 2006లో రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో వీటిని ప్రారంభించింది. అందులో మద్దిలపాలెం డాక్టర్ వీఎస్‌కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కేంద్రం కూడా ఉంది.

**ఒక్కో బ్యాచ్‌కు మూడు నెలలు:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎటువంటి ఫీజు చెల్లించకుండా జేకేసీలో శిక్షణ పొందవచ్చు. మూడు నెలలపాటు బ్యాచ్‌కి 60 మంది చొప్పున ఏడాదికి 240 మంది వీఎస్‌కృష్ణా కళాశాల జేకేసీలో శిక్షణ పొందుతున్నారు.

నిపుణులైన మెంటార్లు విద్యార్థుల్లో కమ్యూనికేషన్, విశ్లేషణాత్మక నైపుణ్యాల పెంపుదలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సాఫ్ట్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. ఎంపిక చేసిన అంశంపై బృంద చర్చలు ఏర్పాటు చేసి ఆంగ్లభాష నైపుణ్యాలు పెంచుకునేలా, వేదికలపై భయం లేకుండా మాట్లాడేలా తర్ఫీదు ఇస్తున్నారు. రోజు రెండు గంటలపాటు తరగతులు ఉంటాయి. ఒక గంట థియరీ, మరో గంట ప్రాక్టికల్స్.

కంప్యూటర్ కోర్సులు, వ్యక్తిత్వ వికాస తరగతులు: ప్రస్తుతం యువత ఏ ఉద్యోగంలో చేరాలన్నా కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. అందుకే ఇక్కడ విద్యార్థులకు ఎం.ఎస్.ఆఫీస్, ఇంటర్నెట్, సీ లాంగ్వేజ్



లాంటి కోర్సులు నేర్పిస్తున్నారు. ఉద్యోగ సాధనలో వ్యక్తిత్వ వికాసం కీలకపాత్ర పోషిస్తున్న నేపథ్యంలో నిపుణులతో వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వివిధ సంస్థలు ఉద్యోగాలు మేళాలు ఏర్పాటు చేస్తున్నాయి.

**పేద విద్యార్థులకు వరం..**

– సౌజన్య, వీఎస్‌కృష్ణా కళాశాల పూర్వ విద్యార్థిని

వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతూ జేకేసీలో శిక్షణ తీసుకున్నా. ఉద్యోగ మేళాలో ప్రతిభ చూపడంతో బెంగళూరులోని ఫ్లిప్‌కార్టు సంస్థలో ఉద్యోగం వచ్చింది. జేకేసీలో శిక్షణతో నైపుణ్యాలు పెరిగాయి.

**గ్రామీణ ప్రాంత యువతకు ఉపయుక్తం**

– డాక్టర్ జి.శ్రీనివాసరావు, జేకేసీ కోఆర్డినేటర్

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు జేకేసీ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతోంది. మూడు నెలల్లో వారిలో నైపుణ్యాలు పెరిగేలా తర్ఫీదు ఇస్తున్నాం. నమూనా ఇంటర్వ్యూలు నిర్వహించి ఆత్మవిశ్వాసం పెరిగేలా చూస్తున్నాం.

# తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ల నిర్వహణ అస్తవ్యస్తం!




అనంతపురం : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగిన తర్వాత తల్లీబిడ్డను సురక్షితంగా వారి ఇంటికి చేర్చే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఆరు వాహనాలు మరమ్మతుకు గురైతే గుత్తేదారు సంస్థ పట్టించుకోవడం లేదు. ఉదయం ఆసుపత్రుల నుంచి తల్లీబిడ్డలను డిశ్చార్జి చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. అప్పటి వరకూ వాహనాలను నిలుపుకొని ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వటం లేదని, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వాహనాల కేటాయింపు ఇలా**

ఉమ్మడి జిల్లాలో 36 వాహనాలు కేటాయించారు. ఇందులో అధికంగా ప్రసవాలు జరిగే అనంత సర్వజన వైద్యశాలకు 13, తాడిపత్రి 2, కదిరి, 2, హిందూపురం 3, మిగిలిన ప్రాంతాల్లోని ఆసుపత్రులకు ఒకటి చొప్పున కేటాయించారు.

సర్వజన వైద్యశాలకు కేటాయించిన నాలుగు వాహనాలు, శింగనమల ఒకటి , గుత్తిలో మరో వాహనం మరమ్మతులకు గురైంది. ఇక్కడ సమీప ఆసుపత్రులకు కేటాయించిన వాహనాలను సర్దుబాటు చేస్తున్నారు. ఆసుపత్రుల్లో ఆయా వాహనాలకు సంబంధించిన నంబర్ల బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఎవరికి ఫోన్ చేయాలో తెలియక కొంతమంది ప్రైవేట్ వాహనాల్లో ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

**ఒకే వాహనంలో ఇద్దరు**

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఒక తల్లి, బిడ్డ, వారికి సాయంగా ఉన్న ఒకరిని గమ్యస్థానానికి తీసుకెళ్లాలి. కొన్ని వాహనాలు మరమ్మతుకు గురవటంతో ఒకే రూట్‌లో వెళ్లాల్సిన ఇద్దరు తల్లులు, బిడ్డలను, వారి సహాయకులను తీసుకెళ్తున్నారు. కొందరు డ్రైవర్లు వారి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**వేతన బకాయిలు ఇప్పించేవారేరీ?**

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్‌కు నెలకు రూ.7,870 వేతనం ఇస్తున్నారు. ఈ మొత్తం కూడా నాలుగు నెలలుగా ఇవ్వకపోవటంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెంచాలని, బకాయిలు విడుదల చేయాలని ఇప్పటికే వారు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

**వినియోగంలోకి తీసుకొస్తాం :** శంకర్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల, ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ఆరు వాహనాల్లో నాలుగింటిని మరమ్మతులకు ఇచ్చాం. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేతనాలకు సంబంధించిన విషయం మా పరిధిలో లేదు. కాల్‌సెంటర్ నంబరును అన్ని ఆసుపత్రులోని కాన్పుల వార్డులో ఏర్పాటు చేస్తాం.ఉమ్మడి అనంత జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సంఖ్య : 36 రెండు నెలల్లో గమ్యస్థానాలకు చేర్చిన వారి సంఖ్య : 1,739మరమ్మతుకు గురైన వాహనాలు : 6

మొత్తం డ్రైవర్లు : 36

# బినామీల పేరిట కట్టేసి.. అద్దెలు దోచేసి




అనంతపురం : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) స్థలంలో నిర్మించిన వాణిజ్య దుకాణాల అద్దెల చెల్లింపు అస్తవ్యస్తంగా మారింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో డీసీఎంఎస్ కార్యాలయం ఎదురుగా 14 దుకాణాలు నిర్మించారు. వీటిని ఏడుగురు నిర్మించినట్లు గత అధ్యక్షుడు తన బంధువుల పేర్లను చేర్చారు. ఒక్కో దుకాణం నుంచి రూ.1.50 లక్షల వరకు అడ్వాన్సుల రూపంలో వసూలు చేశారు. కొందరు రూ.లక్ష చెల్లించారు. ఇలా.. రూ.10 లక్షలకుపైగా అడ్వాన్సులను అప్పట్లో వసూలు చేశారు. సహకార శాఖ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసి సొసైటీకి నష్టం వచ్చే విధంగా ఒక్కో దుకాణానికి రూ.10 వేలు అద్దె నిర్ణయించారు. ఇందులో రూ.4,500 డీసీఎంఎస్‌కు, రూ.5,500 మాజీ అధ్యక్షుడి ఖాతాకు చేరుతున్నాయి. అడ్వాన్సులు మాత్రం డీసీఎంఎస్‌కు చెల్లించకుండా కేవలం అద్దెలు మాత్రమే ఇస్తున్నారు.

**రూ.4 లక్షలకు చేరిన బకాయిలు**

దుకాణదారులు చెల్లిస్తున్న అద్దెలు కూడా బినామీల ఖాతాలకు చేరుతున్నాయి. డీసీఎంఎస్‌కు రూ.4 లక్షల వరకు బకాయి పెడుతున్నారు. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఇటీవలే కొత్త అధ్యక్షులను నియమించింది. ప్రస్తుతం అధ్యక్షుడిగా నెట్టెం వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. అద్దెలు వసూలు చేయడమే కాకుండా అడ్వాన్సులు, దుకాణాల నిర్మాణం ఎలా చేశారన్న విషయం తేల్చాల్సిన అవసరం ఉంది. అంతేకాదు ధర్మవరంలో నిర్మించిన 8 దుకాణాల వ్యవహారం కూడా తేల్చాలి. గతంలో కారుచౌకగా కట్టబెట్టిన భవనాలపై కూడా ఆరా తీయాల్సి ఉంటుంది. ఇటీవల అద్దెకు ఉంటున్న వ్యాపారులతో చర్చించినట్లు తెలిసింది. ఇప్పటి నుంచి అద్దె మొత్తాలను డీసీఎంఎస్‌కే చెల్లించాలని హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు.

**బకాయిలు వసూలు చేస్తున్నాం : విజయభాస్కర్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజరు** అద్దె బకాయిలు రూ.4 లక్షల వరకు ఉన్న విషయం వాస్తవమే. వచ్చే నెల నుంచి బకాయిలు వసూలు చేస్తాం. సొసైటీని లాభాల దిశగా నడిపించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

# త్వరలో లో ఓల్టేజి సమస్యలకు చెక్

చిత్తూరు : వైకాపా పాలనలో విద్యుత్తు శాఖ అవినీతి అక్రమాల్లో కూరుకుపోయింది. నూతన విద్యుత్తు ఉప కేంద్రాల నిర్మాణాలు కేవలం అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహించిన పుంగనూరుకే పరిమితమయ్యాయి. అవసరం లేనప్పటికీ.. ఇష్టానుసారంగా ఉప కేంద్రాలు నిర్మించి రూ.కోట్లు దోచుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున కేంద్రాలు మంజూరు చేయాలని ప్రతిపాదనలు వెళ్లినా.. అవి ఆచరణలోకి రాలేదు.

జిల్లాలో విద్యుత్తు వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. అందుకనుగుణంగా ఫీడర్లు, లైన్లు, ఉప కేంద్రాలు లేకపోవడంతో లో ఓల్టేజి, అధిక లోడు సమస్యలతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పూతలపట్టు, పలమనేరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో లో ఓల్టేజి, అధిక లోడు సమస్యలతో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్తు సరఫరాకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

**నియోజకవర్గానికి చొప్పున రెండు మంజూరు**

సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో నాలుగు ఉప కేంద్రాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. త్వరలో రెండు ఉప–కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. అలాగే చిత్తూరు, పలమనేరు, గంగాధర నెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలకు రెండు చొప్పున, నగరి నియోజకవర్గానికి ఓ ఉప కేంద్రాన్ని మంజూరు చేశారు. స్థల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించడానికి విద్యుత్తు శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే మరో విడతగా అధిక లోడు, లో ఓల్టేజి సమస్యలున్న ఫీడర్లను గుర్తించి అవసరమైన



చోట నూతన ఉప–కేంద్రాలు మంజూరు చేయనున్నారు.

**త్వరలో పనులు ప్రారంభం**

ఇప్పటికే కుప్పంలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మిగిలిన తొమ్మిది ఉప–కేంద్రాల ఏర్పాటుకు స్థలాల ఎంపిక పూర్తయింది.. త్వరలో టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తాం.

ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

కొత్తగా తొమ్మిది విద్యుత్తు ఉప కేంద్రాలు

వైకాపా పాలనలో పుంగనూరుకే పరిమితం

జిల్లాలోని మొత్తం విద్యుత్తు సర్వీసులు: 7.33 లక్షలు

వ్యవసాయ: 1.90 లక్షలు

గృహ : 5.02 లక్షలు

# నీళ్లే.. కన్నీళ్లై..!

వరదయ్యపాళెం : నియోజకవర్గంలో ఆరేళ్లలో కురిసిన వరదల కారణంగా పలు కాలువలకు గండి పడి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఫలితంగా కళ్లముందు నీళ్లున్నా ఆ నీళ్లే వారికి కన్నీళ్లను మిగిలిస్తున్నాయి. దీంతో రైతులు ఏటా ఆర్థికంగా నష్టపోతున్నారు. వర్షాలకు వర్షపునీరు గండి ద్వారా పొలాలకు మళ్లుతుండటంతో వేసిన పంటలు నీట మునిగి నష్టం ఏర్పడుతోంది. దీంతో ఆ ప్రాంతాల రైతులు తమ జీవనాధారమైన సేద్యం చేయలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ఆరంభం కావడంతో ఈ సారైనా తమ కష్టాలు తీరుతాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

**గండి పడి ఏడేళ్లు..**

2017 నవంబరులో కురిసిన వరదల కారణంగా నీటి ప్రవాహ ఉధృతికి మండలంలోని సంతవేలూరు సమీపంలోని పులిబొంద, మార్లమ



డుగు కాలువలకు గండి పడింది. 2018లో నాటి ప్రభుత్వం ఈ కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడం, ఇంతలో ఎన్నికలు సమీపించడంతో పనులు ఆగిపోయాయి. వైకాపా ఒక్కపైసా నిధులు మంజూరు చేయలేదు. ఏటా రైతులు వరి నార్లు వేసి సాగు చేయడం, వర్షాలకు గండి కారణంగా నీట మునగడం రివాజుగా మారింది. దీంతో రైతులు అప్పులతో ఆర్థికంగా నష్టపోతున్నారు. బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాల వద్ద కాళంగి నది ఆనకట్ట దెబ్బతిని అయిదేళ్లు గడుస్తున్నా, మరమ్మతులు చేపట్టలేదు. గతేడాది నవంబరులో కురిసిన వరదలకు పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడిన విషయం తెలిసిందే.

ఈ విషయమై జలవనరుల శాఖ ఏఈ నాగరాజు మాట్లాడుతూ గండి పడిన కాలువల మరమ్మతులకు నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నీరు నిల్వ కావడంతో పనులు చేపట్టలేక పోతున్నామని, తగ్గాక పూర్తి చేస్తామన్నారు.

**ఏటా నష్టం.. అన్నదాతకు కష్టం**

అన్నదాతలకు పొలం ఉన్నా సాగు చేయలేని దుస్థితి నెలకొంది. పులిబొంద, మార్లమడుగు కాలువలకు పక్కనే పొలాలు ఉండటం వారి పాలిట శాపంగా మారింది. ఏటా సాగు చేయడం వరదలకు గండి పడిన కాలువల నుంచి వరదనీరు పొలాలకు మళ్లడంతో రూ.వేలు వెచ్చించి వేసిన పంట నిలువునా నీట మునిగి ఏటా రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో గండ్లు పడిన కాలువలు, చెరువులకు మహర్దశ ఏర్పడింది. కాలువల మరమ్మతులకు రూ.9లక్షలు చొప్పున నిధులు మంజూరు చేయడంతో ఏడేళ్ల తర్వాత రైతుల ఆశలకు ఊపిరొచ్చింది.

# తప్పులు మార్చరు.. తిప్పలు తీర్చరు!!

విశాఖ : విశాఖ నగరంలో నివాసితులు తమ డోర్ నెంబర్ మార్చుకోవడానికి అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ పరిధిలో సుమారు 5,46,732 అసెస్‌మెంట్లు ఉన్నాయి. 7 లక్షలకు పైగా గృహాలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రతి ఇంటికి డోర్ నెంబర్ కేటాయించి, దాని ఆధారంగా జీవీఎంసీ ఆస్తి పన్ను విధిస్తుంది. ఆ నంబర్‌నే ప్రామాణికంగా తీసుకుని ఆస్తుల క్రయవిక్రయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తుంటారు.

**కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు:** కొన్ని సందర్భాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాల్లో, ఆస్తి పన్ను పుస్తకాల్లో జీవీఎంసీ కేటాయించిన డోర్ నెంబర్ కాకుండా..పొరపాటుగా తప్పు నెంబర్ పడుతుంటుంది. సరి చేసుకుంటేనే ఆస్తిపై లావాదేవీలు జరుగుతాయి. గృహ నిర్మాణానికి అవసరమైన రుణాలు, నిర్మాణంపై మరో అంతస్తు వేసుకోవడానికి అవసరమైన ప్లాన్ మంజూరవుతాయి. ప్రస్తుతం తప్పుగా ముద్రితమైన తమ డోర్ నంబర్లు మార్చుకునే వీల్లేక చాలా మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

**గతంలో ఇక్కడే...**కొన్నాళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం ఈఆర్‌పీ (ఎంటర్‌ప్యూనర్ రిసోర్స్ ప్రోగ్రాం) తీసుకొచ్చింది. అప్పటి వరకు మహా విశాఖ నగరపాలక సంస్థకు సంబంధించిన ఆస్తుల



వ్యవహారాలన్నీ జీవీఎంసీ డేటాలోనే నిక్షిప్తమై ఉండేవి. ఎలాంటి సమస్య వచ్చినా.. అధికారులు తమ లాగిన్ ద్వారా పొరపాట్లను సులువుగా సరి చేసేవారు. ప్రస్తుతం నగర పరిధిలోని ఆస్తుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం వద్దకు పంపించేయడంతో, అక్కడ అనుమతి ఇస్తేనే గాని జీవీఎంసీ అధికారు లు ఎలాంటి మార్పులు చేర్పులు చేయలేరు. జీవీఎంసీ ఆస్తి పన్ను విధింపు, ఆస్తి మార్పిడి (మ్యుటేషన్) అన్నీ ఈఆర్‌పీలోనే చేయాల్సి ఉంటుంది.

**పెండింగ్‌లో దరఖాస్తులు:** తప్పుగా ముద్రితమైన డోర్ నెంబర్‌ను సరి చేయాలని గత ఆరు నెలల కాలంలో జీవీఎంసీకి పలువురు దరఖాస్తు చేశారని రెవెన్యూ ఉప కమిషనర్ సత్తారు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమస్యపై మున్సిపల్ శాఖకు లేఖ రాశామని, మున్సిపల్‌శాఖ అధికారులు ఈఆర్‌పీలో మార్పులు చేసుకోవడానికి అనుమతి ఇచ్చే వరకు దరఖాస్తుదారులు వేచి ఉండాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్‌శాఖ అనుమతి ఇవ్వగానే ప్రజలకు సమాచారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# వీరు గిరిగీసుకుని.. వారు తవ్వేసుకుని

బనగానపల్లి : బనగానపల్లి సమీపంలో 4 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న రవ్వలకొండ అక్రమార్కులకు వరంగా మారింది. కొందరు మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాలు ఇలానే కొనసాగితే కొన్నేళ్లకు రవ్వలకొండ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. రవ్వలకొండలో పోతులూరి బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇంతటి చరిత్ర ఉన్న కొండను పట్టపగలే తవ్వి మట్టిని తరలిస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు వందలాది వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారు.

**అంతా నామమాత్రమే**

రవ్వలకొండ విషయంలో అటవీ, రెవెన్యూ, గనులు, పంచాయతీ అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఎవరికివారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నెలలో ఒకటి రెండుసార్లు పోలీసులు వాహనాలను పట్టుకొని జరిమానా వేసి వదిలేస్తున్నారు. ప్రతిరోజూ 50 టిప్పర్లు, 50 ట్రాక్టర్లలో మట్టి తరలిపోతోంది. వాహనాల యజమానులు టిప్పరుకు రూ.3 వేలకు పైగా, ట్రాక్టరుకు రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. దూరాన్ని బట్టి ధర పెంచుతున్నారు. ఈ లెక్కన పరిశీలిస్తే ప్రతిరోజు రూ.2 లక్షలకుపైగా విలువైన మట్టిని



అక్రమార్కులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**విలువైన భూములపై కన్ను**

రవ్వలకొండలో మట్టి తవ్వకాలు అటుంచితే భూ ఆక్రమణలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఇక్కడ 20 ఏళ్ల కిందట ఇందిరమ్మ ఇళ్లు నిర్మించారు. సమీపంలో మిగిలిన భూములపై అక్రమార్కులు కన్నేశారు. ఈ ప్రాంతంలో ఇటీవల రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇది రవ్వలకొండ ప్రాంతం మీదుగా వెళుతుంది. ఈ నేపథ్యంలో కొందరు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పక్కనే ఎస్సార్బీసీ కాలువ ఉంది. కాలువకు ఇరువైపులా మిగులు భూములు ఉన్నాయి. వీటిని కొందరు ఆక్రమించుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే కొందరు ఇళ్ల నిర్మాణాలు సైతం చేపట్టడం గమనార్హం.

**అటవీ పరిధిలో ఉంటే చర్యలు**–రామకృష్ణ, రేంజ్ అటవీ అధికారి

అటవీ పరిధిలో అక్రమ తవ్వకాలు ఉంటే చర్యలు చేపడతాం. రవ్వలకొండలో కొంత భాగం రెవెన్యూ, మరికొంత భాగం గనుల శాఖ పరిధిలో ఉంది. అక్రమ తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని మరింత అప్రమత్తం చేస్తాం.

# రుణాలు ఇక ఆన్‌లైన్‌లో..

డోన్: పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాల మంజూరును ప్రభుత్వం సరళతరం చేస్తూ మెప్మా అధికారులకు బాధ్యతలను ఇచ్చింది. తర్వాత అప్రూవల్‌ను బ్యాంకు అధికారులు ఇస్తారు. రుణాల మంజూరుకు పొదుపు సభ్యులు దరఖాస్తు చేయడంలోనూ నూతన విధానాన్ని తెచ్చారు. పొదుపు మహిళలు మహిళాకాశం యాప్‌లో ఆర్పీకి గానీ, మెప్మా సీవో, సీఎంఎం అధికారులకు గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఇదివరకే సంఘాల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారు. మొదటగా ఆర్పీ లాగిన్ నుంచి సీవో, తర్వాత సీఎంఎం లాగిన్‌కు వెళ్తే..దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి రూ. 5 లక్షల వరకు బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశాన్ని కల్పించారు. ఆపైగా రుణం తీసుకోవాలంటే మెప్మా పీడీ లాగిన్‌కు వెళ్తుంది.



**మెప్మా అధికారులకు ప్రతిపాదిస్తేనే..**

మెప్మాకు సంబంధించి ఆర్పీ లాగిన్‌లో 25 గ్రూపులు కన్పిస్తాయి. ఆర్పీ లాగిన్‌లో రుణం మంజూరు చేయాలని ప్రతిపాదన పంపించాలి. తర్వాత సీవో లాగిన్‌కు వస్తుంది. సీవో వాటిని పరిశీలించి అన్నీసరిగా ఉన్నాయని ధ్రువీకరిస్తే...తర్వాత సీఎంఎం లాగిన్‌కు వస్తుంది. సీఎంఎం రూ.5 లక్షల వరకు బ్యాంకు రుణం ఇప్పించేందుకు వీలుంటుంది. రూ.5 లక్షలకు పైగా రుణం తీసుకోవాలంటే పీడీ లాగిన్‌కు వెళ్తుంది. పీడీ లాగిన్ నుంచి ఎంఎల్‌సీసీ యాప్ ద్వారా బ్యాంకర్స్ లాగిన్‌కు వెళ్తుంది. బ్యాంకు అధికారులు లాగిన్‌లో పూర్తిగా పరిశీలించిన తర్వాత సూక్ష్మ రుణ ప్రణాళికను (ఎంసీపీ) ఆధారం చేసుకుని రుణాన్ని గ్రూపు సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు చేరుస్తారు. గ్రూపు లీడర్ల చరవాణులకు మెసేజ్ ద్వారా రుణం మంజూరైందా, తిరస్కరించారా అనేది తెలియజేస్తారు. మహిళలు బ్యాంకుకు కేవలం నగదు తీసుకునేందుకు వెళ్తే సరి. ఈ ప్రక్రియలో రూ.5 లక్షల వరకు అంటే మెప్మా ఆర్పీ, సీవో, సీఎంఎం లాగిన్‌కు (మహిళాకాశం యాప్ ద్వారా), రూ.5 లక్షలకు పైగా రుణం అయితే మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) లాగిన్ (ఎంఎల్ఎల్‌సీ యాప్)లు కీలకం కానున్నాయి. రుణం కావాలని దరఖాస్తు నమోదు నుంచి సమాచార సేకరణ, రుణం మంజూరు వరకు అన్నీ ఈ యాప్ ద్వారానే జరగనున్నాయి.

**ఎంతో ఉపయోగం**

రుణం మంజూరు విషయంలో పారదర్శకత పెరిగేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. ఒకటికి మించి సంఘాల్లో ఉండి రుణాలు పొందుతూ కొందరు బురిడీ కొట్టిస్తుంటారు. ఇటువంటి వారికి ఈ కొత్త విధానం ద్వారా అడ్డుకట్ట వేసేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. ఒక గ్రూపు ఒక బ్యాంకులోనే రుణం తీసుకునేందుకు వీలుంటుంది. కానీ మరో బ్యాంకులో రుణం తీసుకునేందుకు వీలుండదు. కొందరు గ్రూపు సభ్యులకు తెలియకుండా రుణాలు పొంది తర్వాత ఇబ్బందులు పెట్టిన సంఘటనలు ఉన్నాయంటే అతిశయోక్తి లేదు. రుణం మంజూరైందా, లేదా అని తెలుసుకునేందుకు మెప్మా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. కర్నూలు జిల్లాలో మొత్తం 16 వేల స్వయం సహాయక సంఘాలు ఉండగా, నంద్యాల జిల్లాలో 11 వేల సంఘాలు ఉన్నాయి. బ్యాంకుల్లో రుణాల మంజూరుకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో కర్నూలు జిల్లాలో 4,500ల ఎస్‌హెచ్‌జీలకు రూ.450 కోట్ల రుణాలు, నంద్యాల జిల్లాలో 2,700ల ఎస్‌హెచ్‌జీలకు రూ.270 కోట్ల రుణాలు ఇవ్వాలన్న లక్ష్యంతో అధికారులు రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల నాన్‌ఫెర్‌ఫార్మెన్స్ అకౌంట్స్ (ఎన్‌పీఏ) రుణాలు చెల్లించని గ్రూపులు తగ్గే అవకాశం ఉంటుంది.

# ప్రభుత్వం వరమిచ్చినా.. కరుణించని నేతలు!



నర్సీపట్నం : వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్ట వేస్తేనే సాగు భూములకు సంజీవిని అవుతుంది. వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఆనకట్టల గేట్ల పునరుద్ధరణ, గండ్ల పూడ్చివేతకు కూటమి ప్రభుత్వం నిధులిచ్చి నెల రోజులు అవుతున్నా.. పనులు చేపట్టేందుకు సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా వందల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులు చెబుతున్నా.. పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఆగస్టు నుంచి వరి నాట్లు ముమ్మరమవుతాయి. ఈలోగా మరమ్మతులు పూర్తి చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

రావణాపల్లి జలాశయం కింద నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లో 2,600 ఎకరాల ఆయకట్టు ఉంది. గబ్బాడ ఆనకట్ట గేట్లు పాడై ఐదేళ్లు కావస్తోంది. జలాశయ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పుడు అదనపు నీరు పొర్లుకట్ల మీదుగా ఈ ఆనకట్టకు చేరుతుంది. ఇక్కడి నుంచి కాలువలకు మళ్లించాలి. గేట్లు సరిగా లేక క్యూసెక్కుల కొద్దీ నీరు ఏటిపాలవుతోంది. ఈ గేట్ల మరమ్మతుకు రూ. 4 లక్షలు మంజూరయ్యాయి. గొలుగొండ మండలం కొత్తూరు కాలువకు పలుచోట్ల గతంలో గండ్లు పడ్డాయి. నీరు పొలాలను ముంచెత్తుతోంది. గట్లను బలోపేతం చేసేందుకు రూ.9.81 లక్షలు కేటాయించారు.

మాకవరపాలెం మండలంలో కోడూరు ఆనకట్ట, మల్లవరం ఆనకట్ట, గొలుగొండ మండలంలో ముంగర్లపాలెం ఆనకట్ట గేట్లు పాడయ్యాయి. వీటిని పునరుద్ధరించేందుకు రూ.3 లక్షలు చొప్పున మంజూరు చేశారు.

అంతా మీ చేతుల్లోనే..: కూటమి ప్రభుత్వం సాగునీటి వినియోగదారుల సంఘాలను పునరుద్ధరించి ఎన్నికలు నిర్వహించింది. ఈ సంఘాలన్నింటికీ ఇప్పుడు అధ్యక్షులు ఉన్నారు. కాలువల మరమ్మతు, అభివృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి దాదాపు రూ.2 కోట్ల వరకు ప్రభుత్వం కేటాయించింది. ఆనకట్టల షట్టర్ల పునరుద్ధరణ, గతంలో గండ్లు పడిన కాలువల గట్లను బలోపేతం చేయాల్సి ఉంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనులన్నీ మొదలయ్యేలా ఎమ్మెల్యేలు దృష్టిసారించాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

**నియోజకవర్గాల వారీగా కేటాయింపు ఇలా..**

నర్సీపట్నం నియోజకవర్గంలో తాండవ జలాశయ కాలువల్లో 21 చోట్ల మరమ్మతులకు రూ. 1.71 కోట్లు, చిన్నతరహా నీటి వనరుల కింద ఏడు చోట్ల పనులు చేసేందుకు రూ. 29.81 లక్షలు.

పాయకరావుపేట నియోజకవర్గంలోని కోటవురట్ల మండలంలో తాండవ కాలువల కింద 21 చోట్ల మరమ్మతు చేపట్టేందుకు రూ. 1.66 కోట్లు, చిన్నతరహా నీటి వనరుల కింద 15 చోట్ల పనులు చేపట్టేందుకు రూ. 35 లక్షలు.

ఎలమంచిలి నియోజకవర్గంలో చిన్నతరహా నీటివనరుల కింద 12 చోట్ల పనులు చేపట్టేందుకు రూ. 99.7 లక్షలు.

తాండవ ఆయకట్టు పరిధిలోని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో నాలుగుచోట్ల పనులు చేపట్టేందుకు రూ. 22 లక్షలు మంజూరయ్యాయి.

బాధ్యతలు గుర్తించాలిపంటలకు సాగునీరు సజావుగా చేరేలా పనులు చేసేందుకు ప్రభుత్వం నిధులిచ్చింది. గండ్లు పూడ్చడం, గేట్ల మరమ్మతు తదితర పనులు చేపట్టాల్సిన బాధ్యతలను సాగునీటి వినియోగదారుల సంఘాలకు అప్పగించింది. నిధుల కేటాయింపు పూర్తవడంతో తక్షణమే పనులు చేపట్టాలని అందరికీ విజ్ఞప్తి చేశాం. ఎలమంచిలి నియోజకవర్గంలో నాలుగుచోట్ల పనులు చేపట్టారు. మిగతాచోట్లా ముందుకు రావాలి.

వి.బాలసూర్యం, జలవనరుల శాఖ ఈఈ, నర్సీపట్నం

# చేరువలో చిరకాల స్వప్నం



అనకాపల్లి : రైతుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. జిల్లాలో పోలవరం ఎడమ కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో నత్తనడకన సాగిన పనులు కూటమి ప్రభుత్వం రాకతో జోరందుకున్నాయి. సర్కారు కాలువ నిర్మాణానికి నిధులు పుష్కలంగా మంజూరు చేయడంతోపాటు బిల్లులు కూడా సకాలంలో విడుదల చేస్తోంది. ఈ ఏడాది చివరిలోగా అనకాపల్లి జిల్లా వాసులకు నీరందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో అందుకు అనుగుణంగా గుత్తేదారులు జిల్లా పరిధిలో కొండల తవ్వకం సహా.. చాలాకాలంగా పెండింగ్ ఉన్న పనులు చకచకా పూర్తి చేస్తున్నారు.

రూ. 417 కోట్లతో నిర్మాణాలు: జిల్లాలో పాయకరావుపేట నుంచి కశింకోట మండలం తాళ్లపాలెం వరకు పోలవరం కాలువ ప్రవహిస్తుంది. మొత్తం 55 కి.మీ పొడవున రూ. 417 కోట్లతో నిర్మాణాలు చేస్తున్నారు. ఆరో ప్యాకేజీలో భాగంగా పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడి వరకు 25 కి.మీ. పొడవున పనులు చేపట్టేందుకు రూ. 317 కోట్లు కేటాయించారు. అక్కడి నుంచి తాళ్లపాలెం వరకు పనులు చేసేందుకు రూ.100 కోట్లు కేటాయించారు.

**జోరుగా అనుసంధాన పనులు..**

తుని, పాయకరావుపేట మధ్య తాండవ నదిపై ఆక్విడక్టు నిర్మిస్తున్నారు. ఇప్పటికే నదిపై నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీనిని జిల్లాలోని కాలువకు అనుసంధానించేందుకు ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. దీనికోసం పాయకరావుపేట నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మిగతా ఆక్విడక్టు పనులు చేపడుతున్నారు. పాయకరావుపేటలో దుర్గానగర్, రెల్లికాలనీ కొండ ప్రాంతంలో కాలువ తవ్వకానికి బ్లాస్టింగు చేస్తున్నారు. ఇరువైపులా కాంక్రీట్ గోడ నిర్మిస్తున్నారు. నక్కపల్లి మండలంలోని గొడిచెర్ల, సీతంపాలెం, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, అసంపూర్తిగా వదిలేసిన వంతెనల నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు.

ఇదివరకు తీసిన కాలువలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతోపాటు జారిపడిన మట్టి పేరుకుపోయింది. వీటిని తొలగిస్తున్నారు. తాండవ, వరాహ నదులతోపాటు పోలవరం ఎడమ కాలువ పరిధిలోని పంట కాలువల్లోకి గోదావరి జలాలు పంపించేందుకు అవసరమైన నిర్మాణాలు చేపడుతున్నారు.

ఆగస్టు నాటికి జిల్లాకు జలాలు: పోలవరం ఎడమ కాలువ పనులను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. ఆగస్టు నాటికి గోదావరి నీటిని జిల్లా ప్రజలకు అందించాలన్నది లక్ష్యం. దీనికోసం పనులు శరవేగంగా జరిపిస్తున్నాం. వర్షాలు కారణంగా పనుల్లో స్వల్ప జాప్యం జరుగుతోంది. కాలువ ఆధునికీకరణ సహా మిగతా పనులన్నీ జరుగుతున్నాయి.

రామకోటేశ్వరరావు, ఈఈ

# ప్రభుత్వమే ఆ‘ధర’వు చూపాలి

తిరుపతి : మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా అదనపు రాయితీ ఇస్తానని ప్రకటించింది. తోతాపురి కాయలు విక్రయిస్తే కిలోకు రూ.4 ప్రభుత్వం అదనంగా ఇచ్చేలా రూ.200 కోట్ల వరకు భారాన్ని భరిస్తానని వెల్లడించింది. అయితే గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల నిర్వాహకులు ఆశించిన ధర ఇవ్వకపోవడంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సొంత నియోజకవర్గం కుప్పంలో బుధవారం పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మామిడి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశ్రమ వర్గాలు, అధికారులతో సమీక్షించి ఓ పరిష్కారాన్ని చూపితే ప్రయోజనం ఉంటుంది. ఈ ఏడాది ఆశించిన దాని కన్నా అధికంగా తోతాపురి దిగుబడులు వచ్చాయి. గతంతో పోలిస్తే సరాసరి లక్ష– 1.20 లక్షల టన్నులు ఎక్కువగా ఉంది. పొరుగునే ఉన్న క్రిష్ణగిరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి తలెత్తడంతో అక్కడి నుంచే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మామిడి వస్తోంది. సీజన్ ప్రారంభంలోనే కిలోకు రూ.8 చెల్లించాలని వ్యాపారులకు.. చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్ సూచించినా సిండికేట్ కారణంగా ఆ ధర రావడం లేదు. ప్రభుత్వం అదనంగా ఇస్తామన్న ధరలో ఏమాత్రం కోత విధించలేదు. చివరి కాయ వరకూ కిలోకు రూ.4 ఇస్తామని కలెక్టర్లు పదేపదే చెబుతున్నారు. ప్రస్తుతం అత్యధిక పరిశ్రమలు కిలోకు రూ.5 మాత్రమే ఇవ్వడం, టోకెన్లు దొరక్కపోవడంతో అన్నదాతలు ఆగ్రహంగా ఉన్నారు.

**కొన్ని స్థానిక పరిశ్రమలతో తలనొప్పి..**

గంగాధరనెల్లూరు మండలంలోని జైన్ పరిశ్రమ.. మిగతావాటితో పోలిస్తే ధర ఎక్కువ ఇస్తోంది. అదేవిధంగా తూకంలోనూ మోసం చేయడం లేదు. దాంతో ఈ కర్మాగారానికి అన్నదాతలు బారులు తీరుతున్నారు. కొన్ని స్థానిక పరిశ్రమలు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. ర్యాంపులు కిలోకు రూ.2–3 మాత్రమే ఇస్తున్నాయని.. తాము రూ.4 మాత్రమే చెల్లిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఇటువంటి వాటిపై ఉక్కుపాదం మోపేలా అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు



ఇవ్వాలి. తద్వారా సిండికేట్‌కు చెక్ పెట్టినట్లవుతుంది. స్థానిక కంపెనీలు తక్కువ ధర ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తేనే దారిలోకి వస్తాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు తమకున్న పలుకుబడితో ఇష్టారాజ్యంగా టోకెన్లు తీసుకుని మిగతా రైతులకు అన్యాయం చేయకూడదని స్పష్టమైన ఆదేశాలివ్వాలి.

**అన్నదానంలో వినియోగిస్తేనే..**

అంతర్జాతీయ మార్కెట్‌లో మామిడి గుజ్జుకు డిమాండ్ లేదని గుజ్జు పరిశ్రమల ప్రతినిధులు అంటున్నారు. పశ్చిమ ఆసియా, ఐరోపా దేశాలకు ఎగుమతి ఖర్చులూ గణనీయంగా పెరిగాయని వాపోతున్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన తరుణంలో బీమా కూడా అధికంగానే ఉందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశీయంగా మార్కెట్ పెరిగితేనే మామిడి రైతులకు కష్టాలు తప్పుతాయి. ఎప్పటి నుంచో పారిశ్రామికవర్గాలు కోరుతున్న విధంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలైన తిరుమల, శ్రీశైలం, విజయవాడ దుర్గమ్మ, శ్రీకాళహస్తి, కాణిపాకంలో నిర్వహించే అన్నదానంలో మామిడి రసాన్ని అందిస్తే ప్రస్తుతానికి ఉపశమనం లభిస్తుంది. గతంలోనే ఈ ప్రతిపాదన ముఖ్యమంత్రి ముందుకు వచ్చినా ఆ దిశగా అడుగులు వేయలేదు.

**రూ.5 ఇప్పిస్తే ఉపశమనం**మరోవైపు గుజ్జు పరిశ్రమలు కిలోకు రూ.5–6 మాత్రమే ఇస్తున్నాయి. ర్యాంపుల నిర్వాహకులు రూ.2–3 చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన కిలోకు రూ.4కు అదనంగా మరో రూపాయి ఇస్తే ఎంతోకొంత కష్టాల నుంచి గట్టెక్కుతారు.

# కూరగాయలు దరిచేరవా..?

పుత్తూరు : ఉద్యోగ, ఉపాధి కోసం పిల్లల చదువుల నిమిత్తం పట్టణాలకు వచ్చి నివసిస్తున్న, స్థిరపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా సరిపడా రైతుబజార్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, పలమనేరు, గూడూరులో తప్ప మరెక్కడా ఇవి లేవు. గత ప్రభుత్వ హయాంలో పుత్తూరు, నగరి, పలమనేరు, తిరుచానూరు, చంద్రగిరిలో వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పలమనేరులో పూర్తిచేసి ప్రారంభించారు. తిరుచానూరులో నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించ లేదు. ప్రస్తుతం వాటి ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. చంద్రగిరిలో పునాదుల దశలోనే వదిలేశారు. పుత్తూరులో స్థల పరిశీలన చేశారు. నగరిలో స్థలం కూడా చూపలేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**ప్రజలకు ఒనగూరే మేలు..**

మార్కెటింగ్ శాఖ నిధులతో నిర్మించే ఈ రైతుబజార్లలో నామమాత్రపు అద్దెలకు రైతులు, స్వయం సహాయక సంఘాలకు దుకాణాలు కేటాయిస్తారు. వీటి నిర్వహణకు ఎస్టేట్ ఆఫీసర్, ఒక అటెండర్ ఉంటారు. జేసీ, డీఎస్వో, మార్కెటింగ్, ఉద్యానశాఖల అధికారులతో కమిటీ ఉంటుంది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కిలోకి రూ.5 నుంచి రూ.10 తక్కువ ధరకు ఇక్కడ కూరగాయలు లభ్యమవుతాయి.



టమాటా, ఉల్లిపాయలు తదితరాల ధరలు పెరిగినపుడు రాయితీపై ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించే వెసులుబాటు ఉంటుంది.

**నిధుల కొరతతోనే..**

ప్రభుత్వం మార్కెట్ యార్డుల నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. అయితే సీఎంఎఫ్ ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంజూరు అయినా నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలో వీటి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తేనే ఆయా ప్రాంతాల్లో రైతుబజార్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

ఉమ్మడి జిల్లాలో నగరపాలక సంస్థలు: 2

పురపాలికలు: 10

ప్రస్తుతం ఉన్న రైతుబజార్లు: 4

నిత్యం వినియోగదారులు: 2 వేలకు పైచిలుకు

అవసరమైన ప్రదేశాలు: శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కుప్పం, పుంగనూరు, పుత్తూరు, నగరి

# ఉపాధి.. సంతృప్తి

కర్నూలు : నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా ఏర్పాటుచేసి తృప్తి క్యాంటీన్లు అప్పగిస్తారు. దీనిని నడిపేందుకుగాను 20 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో కంటెయినర్‌ను ప్రభుత్వం సమకూరుస్తుంది. వంట, నిర్వహణ అంశాలపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ఎలక్ట్రిక్ పరికరాలు అందిస్తారు. సౌరశక్తిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం విపణిలో ఆహార పదార్థాలకు మంచి డిమాండు ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు ఉపాధి చూపేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ‘తృప్తి’ క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఏపీ మెప్మా, ఓ సంస్థ ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు పురపాలక సంఘాలతోపాటు బేతంచెర్ల నగర పంచాయతీలో కలిపి 25,300 స్వయం సహాయక పొదుపు సంఘాలున్నాయి. 2,58,823 మంది మహిళలున్నారు.

**ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున..**

క్యాంటీన్ నిర్వహణకు పెట్టుబడి రూ.16.40 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కో క్యాంటీన్‌కు సంబంధించి నలుగురు స్వయం సహాయక సంఘాల సభ్యులుంటే ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు పెట్టుబడి పెట్టాలి. మిగతా పెట్టుబడి మొత్తం.. కంటెయినర్, యంత్ర పరికరాలు, సౌర విద్యుత్తు, ఇతర అవసరాల రూపంలో మెప్మా, ఓ



సంస్థ ప్రతినిధులు చేయూతనిస్తారు. ఒక్కో క్యాంటీన్ నెలవారీ టర్నోవర్ రూ.6.39 లక్షలు ఉండేలా.. ప్రతినెలా లాభం రూ.2.46 లక్షలు వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

**కాలుష్య రహితంగా..**

వంట కోసం వంద శాతం ఎలక్ట్రిక్, పీఎం సూర్యఘర్ కింద సౌర విద్యుత్తు వినియోగిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. అనుభవజ్ఞులైన చెఫ్‌లు, ఎప్పటికప్పుడు అధికారుల ఆహార తనిఖీలు నిర్వహించి పలు సూచనలు అందిస్తారు. ఎప్పటికప్పుడు ఖాతాదారుల అభిప్రాయాలు తెలుసుకుని క్యాంటీన్లను సమర్థంగా నడిపిస్తారు. సంతృప్తి చెందేలా ఆహారం అందిస్తారు.

**24 గంటలు పనిచేసేలా..**

ఈ ఏడాది మార్చి 8 నుంచి జూన్ 8వ తేదీలోగా కర్నూలులో 10, ఆదోని 02, ఎమ్మిగనూరు 01 తృప్తి క్యాంటీన్లను స్వయం సహాయక పొదుపు మహిళలతో ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలోనూ పది వరకు ఏర్పాటు చేయనున్నారు. వీటిని నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లోని ముఖ్యమైన ప్రధాన కూడళ్లు, హైవేను ఆనుకుని ఉన్న ప్రదేశాలను ఎంపిక చేయడంతోపాటు 24 గంటలు పనిచేసేలా చూస్తారు.

చురకలు



## తొలగని శిథిలాలు.. చెరగని ప్రమాద గుర్తులు

సింహాచలం : సింహాచలం క్షేత్రంలో ఏప్రిల్ 30 చందనోత్సవం రోజున భక్తులపై గోడ కూలిన ఘటన జరిగి రెండు నెలలైంది. ఆ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. బాధ్యులైన దేవస్థానం, పర్యాటక శాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయితే ఇప్పటికీ ప్రమాదస్థలిలో సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. మరో పక్క ప్రసాద్ పథకం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. శిథిలాలతో భక్తుల అవస్థలు: ప్రమాదంపై ప్రభుత్వం స్పందించి త్రిసభ్య కమిటీ విచారణకు ఆదేశించింది. మే 1న కమిటీ సింహగిరిపై పర్యటించి లోపాలను గుర్తించింది. పనుల్లో భాగస్వాములైన ఇంజినీరింగ్ అధికారులతో పాటు గుత్తేదారుపై చర్యలకు సిఫార్సు చేసింది. ఈవో సుబ్బారావు, రెండు శాఖల అధికారులను సస్పెండ్ చేశారు. బాధ్యులపై పోలీసు కేసులు నమోదు చేసి ఆధారాలను సేకరించారు. కానీ, ఇప్పటికీ గోడ శిథిలాలను తొలగించ లేదు. ఆ ప్రాంతంలోకి



ఎవరూ వెళ్లకుండా ఇనుప కంచె ఏర్పాటు చేసి వదిలేశారు. శిథిలాల తొలగింపునకు దేవస్థానం అధికారులు అనుమతి కోరగా.. అధికారికంగా పోలీసుల నుంచి అనుమతులు రాలేదని సమాచారం. శిథిలాల కారణంగా భక్తులు బస్‌స్టాండు నుంచి ఆలయానికి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**60 శాతం పనులే పూర్తి..**

సింహగిరిపై రూ.54కోట్లతో చేపట్టిన ప్రసాద్ పథకం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వాస్తవానికి 2024 డిసెంబరు నెలాఖరుకు పూర్తి కావాల్సి ఉన్నా 60 శాతం పనులే జరిగాయి. పర్యాటకశాఖ అధికారుల కోరిక మేరకు 2025 మార్చి నెలాఖరు వరకు గడువు పొడిగించారు. అప్పటికీ కొలిక్కి రాకపోవడంతో మరో రెండు నెలల గడువు కోరారు. ఇంతలోనే గోడ కూలడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా పర్యాటకశాఖ మంత్రి, ఉన్నతాధికారులు ప్రసాద్ పథకం పనులపై దృష్టి సారించి వీలైనంత వేగంగా పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

## అసలే అష్టవంకర్లు.. ఆపై ఆక్రమణలు

అనకాపల్లి : పట్టణంలో పెరుగుబజారు రహదారి విస్తరణలో కొన్నిచోట్ల ఆక్రమణలు జరిగినట్లు విచారణలో తేలింది. దాదాపు ఎనిమిది నుంచి పది చోట్ల ఆక్రమణలు చోటు చేసుకున్నట్లు, రెండుచోట్ల రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ఉన్నతాధికారుల సర్వేలో నిగ్గుతేలినట్లు సమాచారం. ఆక్రమణలను గుర్తించకుండా అధికారులు ఇరువైపులా కాలువల నిర్మాణం పూర్తి చేశారు.


పెరుగుబజారు రహదారిని అష్టవంకర్లతో నిర్మిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపైలో ప్రచురించిన కథనాలకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించారు. అక్రమాలపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టరు విజయకృష్ణన్ విచారణకు ఆదేశించారు. ఈమేరకు ప్రణాళికా విభాగం జిల్లా అధికారి గోపాలరాజు ఆధ్వర్యంలో విస్తరణకు సంబంధించిన కొలతలు తీశారు. ఆక్రమణలు చోటు చేసుకున్నట్లు గుర్తించినట్లు తెలిసింది.

ఈ రహదారిని 50 అడుగులకు విస్తరిస్తున్నారు. విస్తరణ పనులు గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు మామూళ్లు ఇచ్చిన వారికి అడుగు నుంచి మూడడుగుల వరకు ముందుకు వచ్చి నిర్మించుకునేందుకు అంగీకరించినట్లు తెలిసింది. కొన్ని భవనాలకు దిగువన 50 అడుగుల మేరకే స్థలం విడిచిపెట్టినా పై అంతస్తులను రెండు నుంచి నాలుగడుగులు ముందుకు నిర్మించుకున్నారు. ఇలాంటిచోట విద్యుత్తు స్తంభాలను రహదారి మధ్యలో వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల పదవీ విరమణ చేసిన ప్రణాళిక విభాగం అధికారి దీనికి సూత్రధారిగా తెలుస్తోంది. దీనిపై జోనల్ కమిషనర్ బి.వి.రమణను వివరణ కోరగా కొన్ని చోట్ల ఆక్రమణలు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు.

## నాడు కన్నేశారు.. నేడు దున్నేశారు

ఏర్పేడు : 'నాడు- నేడు' అంటూ వైకాపా హయాంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు మాత్రం అరకొర చేసిన ఆ పార్టీ నేతలు.. కబ్జాల పర్వాన్ని మాత్రం కొనసాగించారు. ఆ పార్టీ హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు ప్రణాళిక వేసుకున్న సదరు నేతలు ఇప్పుడు ఆ భూములను చదును చేసి వ్యవసాయ పనులు చేస్తున్నారు.

శ్రీకాళహస్తి మండలం భీమవరం గ్రామానికి సమీపంలోని అక్కన్నచెరు



వు అనుకుని ప్రభుత్వ స్థలంలో ఎస్టీలు పూరిళ్లు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం పక్కా ఇళ్లు అందుబాటులోకి రావడంతో ఈ స్థలాన్ని వదలిపెట్టారు. వైకాపా హయాంలో కొందరు రాజకీయ అండతో ఈ స్థలాన్ని ఆక్రమించాలని చూశారు. ఎన్నికలు రావడంతో అప్పట్లో ఆగిపోయిందని గ్రామస్థులు చెబుతున్నారు.

**దశల వారీగా కబ్జా..** ఇక్కడున్న స్థలాన్ని చుట్టూ పొలాలు కలిగిన భూస్వామి, రైతులు రాత్రి వేళల్లో జేసీబీ సాయంతో చదును చేసి తమ పొలాల్లోకి కలిపేసుకుం టున్నారు. ఏళ్ల క్రితం తమ కోసం ఇచ్చిన స్థలాలను ప్రస్తుతం అక్కడి వారు కబ్జా చేయడంపై ఎస్టీలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వారి ప్రయత్నాలు అడ్డుకోవాలని కోరుతున్నారు.పరిశీలించి చర్యలు జనార్దన్‌రాజు, తహసీల్దార్, శ్రీకాళహస్తికబ్జా విషయం మా దృష్టికి రాలేదు. సంబంధిత గ్రామ విస్తరణాధికా రులతో మాట్లాడతాం. కబ్జాలకు అవకాశం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

## భద్రతా లోపాలు.. కార్మికులే సమిధలు!



అనంతపురం : పరిశ్రమల్లో భద్రతా లోపాలు కార్మికుల ప్రాణాలను బలిగొంటున్నాయి. కొన్ని యాజమాన్యాలు కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనికితోడు అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా అన్నది అధికారులకు పట్టడం లేదు. ఉమ్మడి అనంత జిల్లాలోని సిమెంటు, స్టీల్, రసాయన పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తనిఖీల్లో లోపాలను గుర్తించినా సంబంధిత యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నైపుణ్యం కొరవడి..**

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా తాడిపత్రి, హిందూపురం, రాయదుర్గం ప్రాంతాల్లో సిమెంట్, స్టీలు, పాలిమర్స్, క్యాస్ట్ ఐరన్, పెయింట్.. తదితర పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఆయా చోట్ల రియాక్టర్లు, బాయిలర్లు, బ్లాస్ట్ ఫర్నేస్‌ల వంటి కీలక విభాగాల వద్ద సాంకేతిక అంశాలపై అవగాహన, నైపుణ్యం ఉన్నవారితోనే పనిచేయించాలి. అర్హతలున్న వారినే విధుల్లో నియమించాలంటే ఆ మేరకు ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈక్రమంలో కొన్ని యాజమాన్యాలు నైపుణ్యం, విద్యార్హత లేని వారిని నియమించుకుంటున్నాయి. నామమాత్రపు శిక్షణ ఇచ్చి కీలక ప్రదేశాల్లో పనిచేయిస్తున్నారు. దాదాపు అన్ని పరిశ్రమల్లో బిహార్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి ఇక్కడ కార్మికులుగా చేర్చుకుంటున్నారు.

**పర్యవేక్షణ ఏదీ?**

చాలా పరిశ్రమల్లో పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టడం లేదు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు పర్యవేక్షించాలి. ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ప్రమాదాలు జరగకుండా ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారనే అంశాలను పరిశీలించాలి. ఒకవేళ ఉల్లంఘనలు ఉంటే అక్కడికక్కడే సరిచేయించడమో.. చర్యలు తీసుకోవడమో చేయాలి. అధికారులు ఇవేమి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

**కొన్ని ఉదంతాలు..**

ఈ ఏడాది జూన్‌లో హిందూపురంలోని తూముకుంట పారిశ్రామికవాడలో ఉన్న స్టీల్ పరిశ్రమలో కడ్డీ గుచ్చుకుని బిహార్ కార్మికుడు మృత్యువాతపడ్డాడు.

గతేడాది నవంబరులో శింగనమల మండలం లోలూరులోని కర్పూరం ఫ్యాక్టరీలో రియాక్టర్ నుంచి గ్యాస్ లీకై ఏడుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

అదే ఏడాది డిసెంబరులో యాడికి మండల పరిధిలోని సిమెంట్ పరిశ్రమ కోల్‌మిల్లులో ప్రమాదం సంభవించడంతో ఓ కార్మికుడు మరణించాడు. ఐదుగురు గాయపడ్డారు.

2023, మార్చిలో తూముకుంటలోని స్టీల్ పరిశ్రమలో కర్ణాటకకు చెందిన కార్మికుడు వెల్డింగ్ చేస్తుండగా అక్కడికక్కడే చనిపోయాడు. 2021లో ఫార్మా పరిశ్రమలో కార్మికుడిపై రియాక్టర్ పడటంతో మృత్యువాతపడ్డాడు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులిస్తున్నాం**

రాధాకృష్ణ, పరిశ్రమల సేఫ్టీ అధికారి

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు గ్లౌజ్, మాస్కు, హెల్మెట్ తప్పనిసరి. దీంతోపాటు సేఫ్టీ అధికారిని నియమించుకోవాలి. ప్రతి ఫ్యాక్టరీలో 24 గంటల పాటు అంబులెన్స్ అందుబాటులో ఉంచుకోవాలి. నిబంధనలు పాటించని పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు తనిఖీ చేసి నోటీసులు ఇస్తున్నాం. తగిన చర్యలు తీసుకుంటున్నాం.

## మామూలోడు కాదు.. 'మార్కుల' మాయలోడు




ఏయూ ప్రాంగణం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ కేంద్రం అక్రమాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. పూర్వ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నియమించిన ఓ అధికారి రీవాల్యుయేషన్‌లో అవకతవకలకు పాల్పడుతూ రూ.కోట్లు కొల్లగొడుతున్నాడు. గత ఆరేళ్లుగా అతని హవా నిరాటంకంగా కొనసాగుతుండటం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఆ అరాచక అధికారికి అడ్డుకట్ట పడకపోవడంపై వర్సిటీ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

**ఒక్కో సబ్జెక్టుకు రూ.15వేల వరకు వసూలు:** ఆంధ్ర విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో చదివే విద్యార్థుల మార్కుల జాబితాలను ఏయూ కంప్యూటర్ కేంద్రంలో తయారు చేస్తుంటారు. పరీక్ష ఫెయిలైన లేదా మార్కులు తక్కువ వచ్చాయని భావించిన పలువురు విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేస్తుంటారు. ఈ విధంగా నెలకు వర్సిటీకి సమారు 5వేల నుంచి 6వేల వరకు దరఖాస్తులు వస్తుంటాయి. ఇందులో 150 నుంచి 200 మంది విద్యార్థులు అక్రమ పద్ధతిలో ఉత్తీర్ణులు కావడానికి కంప్యూటర్ కేంద్రంలోని అధికారిని ఆశ్రయిస్తున్నారు. ఒక్కో సబ్జెక్టులో ఉత్తీర్ణులు చేయడానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఆ అధికారి వసూలు చేస్తున్నాడు. ఈ విధంగా ఒక్క నెలలో రూ.15లక్షల వరకు కొల్లగొడుతున్నాడు. ఏడాదికి అక్రమ వసూళ్ల మొత్తం రూ.2కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**ఎలా అక్రమాలకు పాల్పడుతున్నారంటే..**

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థి జవాబు పత్రాన్ని సంబంధిత అధ్యాపకుడి చేత మూల్యాంకనం చేయిస్తారు. ఆ జవాబు పత్రం(ఆన్సర్ షీట్) కంప్యూటర్ కేంద్రానికి చేరుతుంది. అక్కడ జవాబు పత్రాన్ని స్కానింగ్ చేసి మార్కుల జాబితా తయారు చేస్తారు. ఇక్కడే డబ్బులిచ్చిన విద్యార్థికి పాస్ మార్కులు వచ్చేలా మాయ చేస్తున్నారు. జవాబుపత్రంపై చిన్న పెన్ను గీత పడినా దాన్ని కంప్యూటర్ ఆమోదించదు. అప్పుడు కంప్యూటర్‌లో మాన్యువల్‌గా మార్కులు నమోదు చేయాల్సి ఉంటుంది. అక్రమార్కులు జవాబుపత్రాలపై గీతలు పెట్టి మాన్యువల్‌గా విద్యార్థులకు పాస్‌మార్కులు వేసి మార్కుల జాబితా తయారు చేస్తున్నారు. దొడ్డిదారిలో ఉత్తీర్ణులవ్వాలనుకునే విద్యార్థులను ఆకర్షించేందుకు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణ, ఏయూ అవుట్ గేట్ వద్ద, ఏయూ పరిపాలనా భవనం పరిసరాల్లో పలువురు వ్యక్తులను ఆ అధికారి నియమించుకున్నారు.

వెల్లడికాని 400మంది మార్కులు: రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న 400 మంది విద్యార్థుల మార్కుల జాబితా విడుదల చేయలేదు. జనవరి నెలలో వీటిని రీవాల్యుయేషన్ చేసినట్లు చెబుతున్నారు. మార్కుల జాబితా విద్యార్థులకు పంపించకపోవడానికి కారణాలను అధికారులు బయట పెట్టకపోవడం గమనార్హం. ఓ విద్యార్థి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా అతని జవాబుపత్రం లభించలేదని చెబుతున్నారు. ఆయా అక్రమాలపై లోతైన దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని వర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కంప్యూటర్ కేంద్రం బాధ్యుడిగా ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగ ఆచార్యులను నియమించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి ఆరేళ్ల క్రితం అప్పటి ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి తూట్లు పొడిచి మరో విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకుడిని నియమించారు. అతను వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో పనిచేసిన ఉన్నతాధికారికి బంధువు కావడం గమనార్హం. ప్రస్తుత వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ కంప్యూటర్ కేంద్రంపై దృష్టి సారించి ప్రక్షాళన చేయాలని వర్సిటీ వర్గాలు కోరుతున్నాయి.

## కొడికొండ- శిర మధ్య నాలుగు వరుసల రహదారి



హిందూపురం : జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా కొడికొండ- శిర 544ఈ జాతీయ రహదారి నాలుగు వరుసలు రూపుదిద్దుకోనుంది. దీనికోసం ప్రతిపాదనలు (డీపీఆర్) సిద్ధం చేసి పంపాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. భవిష్యత్తులో ఈ రహదారుల్లో వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారుల నిబంధనల మేరకు 24 మీటర్ల మేర రహదారి విస్తరించి ఉండాలి. దీనిలో 4 మీటర్లు డివైడర్ ఏర్పాటు చేయగా మిగిలిన 20 మీటర్లలో రహదారి ఉండాలి. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న జాతీయ రహదారులను నాలుగు వరుసలుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వాహనాల రాకపోకలు పెరిగి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

**ఎన్‌హెచ్ 44, 48కు అనుంధానంగా..**

కశ్మీర్ నుంచి కన్యాకుమారి ఎన్‌హెచ్ 44, బెంగళూరు నుంచి పుణె జాతీయ రహదారి 48తో అనుసంధానం చేస్తూ 2016-17లో కొడికొండ- శిర జాతీయ రహదారి 544ఈ 99 కిలోమీటర్లు రూ.వెయ్యి కోట్లతో ఏర్పాటు చేశారు. ఈ రహదారి అందుబాటులోకి రావటంతో అనంతపురం, తాడిపత్రి నుంచి మంగళూరు పోర్టు, పుణె, ముంబయి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు సులువుగా చేరుతున్నాయి.

**విస్తరణకు అందుబాటులో అవసరమైన భూమి**

కొడికొండ నుంచి మడకశిర వరకు నాలుగు వరుసల రహదారి ఏర్పాటు చేసేందుకు అనువైన భూమి అందుబాటులో ఉంది. రెండు వరసల జాతీయ రహదారి ఏర్పాటు చేసే సమయంలోనే అధికారులు ముందస్తుగా అదనంగా భూసేకరణ చేశారు. మడకశిర నుంచి శిర వరకు రెండు వరసల రహదారికి మాత్రమే భూసేకణ చేసినందున ఇక్కడ అదనంగా సేకరించాల్సి ఉంది.

## కోరినంత.. ఇసుక

తిరుపతి : జిల్లాలో ఇసుక కొరత రాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా నిల్వలు పెంచుకోవాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రానున్న రోజుల్లో రోజుకు ఎంత ఇసుక ఎంత అవసరం ఉంటుందన్న అంచనాలతో ఈ కేంద్రాల్లో నిల్వలు పెంచుకొనేలా ఏర్పాట్లు చేశారు. వర్షాల నేపథ్యంలో నదుల్లో ఇసుక లభ్యత ఉండని కారణంగా రెగ్యులర్ డీసిల్టింగ్ కేంద్రాలతోపాటు ఇతర ప్రాంతాల్లోని నదుల్లోనూ సేకరించేందుకు మైనింగ్ శాఖ అధికారులు వెసులుబాటు కల్పించారు. రాజంపేటతోపాటు జిల్లాలో స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలోని పెల్లకూరు, కోట మండలం గూడలి నుంచే కాకుండా చంద్రగిరి మండలం భీమవరం, రంగంపేట నుంచి తీసుకొనేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నాలుగు టన్నుల సామర్థ్యంతో ట్రాక్టర్ ఇసుకను రూ.2800కు విక్రయిస్తున్నారు.

**కేంద్రాల్లోనే కొనుగోలు చేయాలి**

నదులు, కాలువ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ఉచిత ఇసుక



పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని, వారి ముసుగులో అక్రమార్కులు చేస్తున్న దందాకు ఎవరూ మద్దతు పలకవద్దని అధికారులు కోరుతున్నారు. నాణ్యమైన ఇసుక లభ్యత ఉన్న విక్రయ కేంద్రాలను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

**మాఫియాతో ఖజానాకు తూట్లు**

జిల్లాలో గడిచిన ఐదు నెలలుగా ఇసుక మాఫియా అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ ఖజానాకూ తూట్లు పడ్డాయి. ఇసుక అక్రమ తరలింపులు పెద్దఎత్తున జరిగిన నేపథ్యంలో పట్టణ, నగర వాసుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక విక్రయ కేంద్రాలు వెలవెలబోయాయి. నామమాత్రపు ధరకు ప్రభుత్వం ఇసుక విక్రయించినా కొనేవారు లేకుండాపోయారు. చివరకు భవన నిర్మాణ సంస్థలు, డెవలపర్లు సైతం అడ్డదారులను ఆశ్రయించే పరిస్థితులు ఉండటంతో జిల్లా యంత్రాంగం సమస్యలపై దృష్టిసారించింది. జిల్లాలో ఇసుక నిల్వ కేంద్రాలు: 3 (తిమ్మినాయుడుపాలెం (కాటన్‌మిల్లు), అవిలాల, గాజులమండ్యం)

రోజుకు అవసరం: 5 వేల టన్నులు (అంచనా)

ప్రస్తుతం ఉన్న నిల్వ: 20 వేల టన్నులు

టన్ను ఇసుక ధర: రూ.700

## నాణ్యత లేకున్నా కొని.. తితిదే ఖజానాకు గండికొట్టి!

తిరుపతి : ఐదేళ్ల వైకాపా పాలనలో పాలకమండలిలోని పెద్దలు, కొందరు అధికారులు తితిదేను భ్రష్టు పట్టించారు. చివరికి చంద్రగిరి మండలం నర్సింగాపురంలోని శ్రీశ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీకి అవసరమైన యంత్ర పరికరాల్లోనూ నాణ్యత లేనివి కొనుగోలు చేశారనే విమర్శలున్నాయి. రూ.3.90 కోట్లతో కొన్న యంత్రాలు.. ఔషధాల తయారీకి వినియోగించలేని దుస్థితిలో ఉన్నాయంటే నాటి పాలకులు ఎలా వ్యవహరించారో అర్థమవుతోంది. 2022 ఫిబ్రవరి 17న ఇలాంటి యంత్రాన్ని సరఫరా చేసేందుకు తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అసలు మందులు తయారు చేసే యంత్రాలు ఒకటి కూడా సరిగా పనిచేయడం లేదని ప్రయోగాత్మకంగా పరీక్షించిన రోజే వాటి డొల్లతనం బయటపడిందని



ప్రస్తుత తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. యంత్ర పరికరాలు సరఫరా చేసే సంస్థకు అసలు అంత సామర్థ్యం ఉందా? లేదా? అని ముందుగానే పరిశీలించాలి. ఇలాంటివి జరగకుండా ఆఘమేఘాలపై హైదరాబాద్‌కు చెందిన సంస్థకు కట్టబెట్టడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటనలపై స్పందించి ఇప్పటికైనా చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు జరగవు. **విజిలెన్స్ నివేదిక**

బహిర్గతమైతేనే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాటి వైకాపా అక్రమాలు, అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఐదేళ్లలో తీసుకున్న నిర్ణయాలు, జరిగిన అవినీతిని విజిలెన్స్ అధికారులు నిగ్గు తేల్చి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వీటిని తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపి చర్యలకు సిఫార్సు చేయాల్సిన బాధ్యత సర్కార్‌పై ఉంది. నాటి తితిదే ఛైర్మన్లు, ఉన్నతాధికారుల పాత్ర ఏంటో బహిర్గతం కానుంది.

## ఇంతెందుకు.. తగ్గిద్దాం!

తిరుపతి : తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల నిర్మాణాలకు వైకాపా హయాంలో ఏకకాలంలో రూ.600 కోట్లకు టెండర్లు ఖరారు చేయడాన్ని విజిలెన్స్ విభాగం గతేడాది ఇచ్చిన నివేదికలో తప్పు పట్టింది. ఎక్కువ కొటేషన్ల టెండర్లు ఆమోదించారని పేర్కొంది. తితిదే గణాంక అధికారి, ఇంజినీరింగ్ విభాగం ఏకకాలంలో రూ.300 కోట్లు అచ్యుతం, రూ.300 కోట్లు శ్రీపాదం వసతి భవనాలకు అనుమతులు ఇవ్వడంలో గత పాలకుల అవినీతి మరకలు ఉన్నాయంటూ నివేదిక సమర్పించింది. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.ఈ రెండు సముదాయాల పనులు 2024 మార్చి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు వసతి కేంద్రాలకు సంబంధించి రూ.300 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు వసతి గృహాలకు సంబంధించి నిర్మాణ వ్యయం తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూ ఇటీవల జరిగిన తితిదే పాలక మండలి సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో కొన్ని అంశాల్లో వ్యయం తగ్గించేందుకు ఇంజినీరింగ్ విభాగం నివేదికలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. **సదుపాయాలు ఇలా..**శ్రీపాదం, అచ్యుతం తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు ఉంటాయి. ఒకటో అంతస్తులో పార్కింగ్, 2వ అంతస్తులో రిసెప్షన్, అన్నదాన కేంద్రం ఉంటాయి. 3, 4 అంతస్తుల్లో 48 డార్మెటరీలు, 5 నుంచి 9 అంతస్తుల్లో 532 గదులు నిర్మిస్తున్నారు.

## లావణ్య త్రిపాఠి 'సతీ లీలావతి'.. టీజర్ తో ఫన్నీ ట్రీట్!

టాలీవుడ్‌లో వినూత్నమైన ఫన్ ఎంటర్‌టైనర్‌లలో ఒకటిగా బజ్ క్రియేట్ చేస్తున్న చిత్రం 'సతీ లీలావతి'. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమాలో లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ జంటగా కనిపించనున్నారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ వంటి హిట్ సినిమాలు తీసిన తాతినేని సత్య దర్శకత్వం వహించడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి క్రేజ్ ఏర్పడింది. ప్రముఖ నటీనటులు వి.కె.నరేష్, వి.టి.వి.గణేష్, సప్తగిరి, మొట్ట రాజేంద్రన్, జాఫర్ సాదిక్, జోషి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

**టీజర్ లో ఫన్నీ వేప్స్...** మంగళవారం రిలీజ్ చేసిన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ పెళ్లి అనంతరం హ్యాపీ మూడ్‌తో స్టార్ట్ అయిన టీజర్.. తర్వాతి సీన్‌లోనే కామెడీ మోడ్‌లోకి మారడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. లావణ్య, దేవ్ మోహన్ మధ్య చిన్న గొడవల్లో వి.కె.నరేష్, సప్తగిరి, వి.టి.వి.గణేష్ వంటి క్యారెక్టర్స్ ఎంటర్ చేయడంతో మరింత వినోదాన్ని చేకూర్చను న్నాయి. భార్య, భర్తల మధ్య జరిగే చిన్న సమస్యలు, దానికి పరిష్కారా లు.. ఇవన్నీ ఫన్నీ టచ్‌తో చూపించబోతున్నారన్నమాట.




**ఫ్యామిలీకి కనెక్ట్ అయ్యేలా..** 'సతీ లీలావతి' కథలో ప్రధానంగా భార్యాభర్తల మధ్య రిలేషన్, చిన్న చిన్న గొడవలు, వాటిపై కుటుంబ సభ్యులు కలగజేసుకోవడం.. ఇవన్నీ చక్కటి హాస్యంతో, హార్ట్ టచింగ్ ఎమోషన్‌తో చూపించబోతున్నారు. ముఖ్యంగా లావణ్య త్రిపాఠి ప్రెజెన్స్, దేవ్ మోహన్ కామెడీ టైమింగ్ సినిమాకు మెయిన్ ప్లస్ పాయింట్ అవుతాయి. ఈ సినిమా టీజర్‌లో చూపించిన హ్యూమర్, ఎమోషన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపుతున్నాయి. ప్రస్తుతం 'సతీ లీలావతి' మూవీ షూటింగ్ పూర్తయ్యి, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఫుల్ స్పీడ్‌లో సాగుతున్నాయి. అనుకున్న ప్లానింగ్ ప్రకారం సినిమాను త్వరగా పూర్తి చేసి విడుదల చేయాలని మేకర్స్ సిద్ధమవుతున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆకట్టుకునేలా, ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించడంపై ఫోకస్ పెట్టారు.

**సాంకేతిక నిపుణులు...** మిక్కీ జే మేయర్ సంగీతం, బినేంద్ర మీనన్ సినిమాటోగ్రఫీ, సతీష్ సూర్య ఎడిటింగ్ వంటి టాలెంటెడ్ టెక్నికల్ టీమ్ ఈ సినిమాకు మరింత బలాన్ని తెచ్చింది. మ్యూజిక్, విజువల్స్, కామెడీ, ఎమోషన్.. ఇలా అన్ని రూట్లలో కంటెంట్ పక్కాగా ఉంటుంది అని చిత్ర బృందం చెప్పుకొస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో మంచి స్పందన తెచ్చుకున్న 'సతీ లీలావతి' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యూత్‌కు కూడా కనెక్ట్ అయ్యే లా సినిమాను రూపొందించారని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## మహిళా నిర్మాతపై జాన్వీ కపూర్ కామెంట్

జాన్వీ కపూర్ – ఇషాన్ ఖట్టర్ నటించిన హెూమ్‌బౌండ్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమయిన సంగతి తెలిసిందే. సినిమా ప్రదర్శనకు ముందు జాన్వీ సోదరి ఖుషీ కపూర్ తన ప్రియుడు శిఖర్ పహారియా, స్నేహితుడు ఒర్రీతో ఫ్రెంచ్ రివేరాలో సందడి చేసారు. జాన్వీ మూవీకి వీరంతా ప్రచార సాయానికి విచ్చేసారు. ఆ తర్వాత జాన్వీ వరుసగా రెడ్ కార్పెట్ పై క్యాట్ వాక్ లతో మతులు చెడగొట్టిన సంగతి తెలిసిందే. జాన్వీ చివరిగా బ్లాక్ కలర్ డిజైనర్ దుస్తుల్లో కనిపించింది. దీనిలో రెట్రో అప్పియరెన్స్ హృదయాలను కొల్లగొట్టింది. ఈవెంట్ నుంచి ఫోటోలు ఇప్పటికే ఇంటర్నెట్ లో వైరల్ గా మారాయి. శుక్రవారం జాన్వీ బ్లాక్ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని



ఆకర్షించింది. తన స్టైలిష్ ఫోటోలను షేర్ చేసిన జాన్వీ ముంబై వర్షాలకు సిద్ధంగా ఉంది ..రియా క్యాప్షన్ కోసం నన్ను చంపకు అని రాసింది. ప్రస్తుతం ఫ్యాషన్ డిజైనర్ కం నిర్మాత రియా కపూర్ ని ఉద్దేశిస్తూ జాన్వీ చేసిన ట్వీట్ వైరల్ గా మారుతోంది. కేన్స్ లో జాన్వీ నటించిన హెూమ్ బౌండ్ ని ప్రదర్శించాక, 9 నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ లభించింది. నీరజ్ ఘయ్వాన్ దీనికి దర్శకత్వం వహించారు. ఇది ఈ సంవత్సరం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడిన ఏకైక భారతీయ చిత్రంగా నిలిచింది. తాజాగా రిలీజైన ఫోటోలలో జాన్వీ, ఇషాన్ ఖట్టర్, కరణ్ జోహార్, చిత్రనిర్మాత నీరజ్ ఘయ్వాన్ మరియు ఇతరులతో కలిసి పోజులిచ్చినట్లు కనిపిస్తుంది.




## అల్లు అరవింద్ బిజినెస్: తక్కువ పెట్టుబడితో జాక్ పాట్ లాభాలు!



టాలీవుడ్‌లో గీతా ఆర్ట్స్ బ్యానర్ కు ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. అల్లు అరవింద్ నిర్మాతగా ఉన్న ఈ సంస్థ ఎప్పుడూ తనదైన స్టైల్ లో ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ విషయంలో కొత్తదనం చూపిస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఇతర భాషల సినిమాలను తెలుగులో డబ్ చేసి రిలీజ్ చేయడంలో గీతా ఆర్ట్స్ కు సూపర్ జడ్జ్మెంట్ ఉంది. హిట్ అవుతాయన్న అనుమానం వచ్చినా రిస్క్ తీసుకొని, ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని ఇచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల ఆధ్యాత్మిక నేపథ్యంలో వచ్చిన సినిమాలతో ఈ సంస్థకి మంచి లాభాలు వచ్చాయి. ముఖ్యంగా తక్కువ రేట్ డిస్ట్రిబ్యూషన్ డీల్స్ తో జాక్ పాట్ లాభాలే అందుకున్నారు. ప్రస్తుతం గీతా ఆర్ట్స్, GA2 పిక్చర్స్ బ్యానర్‌పై వరుసగా కొత్త సినిమాలు నిర్మిస్తున్నారు. కమర్షియల్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలతోపాటు ఇలా డబ్బింగ్, డిస్ట్రిబ్యూషన్ రంగంలో భిన్నమైన సినిమాలకు పచ్చజెండా ఊపుతున్నారు. ఆధ్యాత్మిక కథలు, మైథలాజికల్ కాన్సెప్ట్ సినిమాలను సైతం టెస్ట్ చేస్తూ ట్రెండ్ సెట్టర్‌గా మారుతున్నారు.

**కాంతారా నుంచి..ఛావా...** ఒకప్పుడు మాస్, కమర్షియల్ సినిమాలే మేజర్‌గా తీస్తూ వచ్చిన గీతా ఆర్ట్స్.. గతంలో కన్నడ హిట్ 'కాంతారా'ను తెలుగులో డబ్ చేసి రిలీజ్ చేసింది. ఆ చిత్రానికి కమర్షియల్ యాక్షన్‌తో పాటు, ఆధ్యాత్మిక కాన్సెప్ట్ ఉన్నా, లోతైన భక్తి అంశమే సినిమాను పాజిటివ్‌గా నిలబెట్టింది. అ సినిమాతో దాదాపు 50 కోట్ల లాభాలు అందుకున్నారు. హిందీలో బ్లాక్‌బస్టర్ అయిన 'ఛావా' వంటి చారిత్రక చిత్రాన్ని కూడా తెలుగులో రిలీజ్ చేయడం గీతా ఆర్ట్స్ కాన్ఫిడెన్స్ ని చూపిస్తుంది. ఈ సినిమా పెట్టిన పెట్టుబడికి డబుల్ ప్రాఫిట్స్ తెచ్చింది. తెలుగు ప్రేక్షకులు హిస్టారికల్ సినిమాలపై పెద్దగా ఆసక్తి చూపించకపోయినా, ఇలాంటి ప్రయత్నాలకు బ్రాండ్ విలువ పెరిగింది.

**మహావతార్ నర్సింహా...** లేటెస్ట్ గా రూపొందిన 'మహావతార్ నర్సింహ' అనే డివోషనల్ యానిమేటెడ్ మూవీని కూడా తక్కువ ధరకే కొనుగోలు చేసి మంచి ప్రాఫిట్స్ అందుకుంటున్నారు. తెలుగులో విడుదల చేశారు. యానిమేషన్, 3డి ఎఫెక్ట్స్ తో చేసిన ఈ సినిమా సరికొత్తగా ఉండడంతో ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆధ్యాత్మికత ఆధారంగా ఉండే కథలను తీసుకుని ఈ రోజుల్లో డిస్ట్రిబ్యూటర్లు పెద్దగా ముందుకు రావడం లేదు. కానీ గీతా ఆర్ట్స్ మాత్రం ఆ మార్గాన్ని కొనసాగిస్తూ సక్సెస్ సాధించింది. 'మహావతార్ నర్సింహ' లేటెస్ట్ కలెక్షన్లు చూస్తేనే ఈ సినిమాకు మంచి ఆదరణ లభించిందని అర్థమవుతుంది. ప్రమోషన్ ఇంకా స్ట్రాంగ్‌గా నిర్వహించి ఉంటే, మరింత భారీగా కలెక్షన్లు వచ్చేవి అని సినీ వర్గాల్లో విశ్లేషణ వినిపిస్తోంది. ఇదే సమయంలో

**మార్కెట్‌లో రెస్పాన్స్...** తెలుగు పరిశ్రమలో ప్రస్తుతం పెద్ద సినిమాలే హవా చూపిస్తున్నప్పటికీ, భక్తి కథలు, చారిత్రక చిత్రాలు కూడా స్పేస్ సంపాదించుకోవచ్చన్న కాన్ఫిడెన్స్ గీతా ఆర్ట్స్ కలిగిస్తోంది. డబ్బింగ్ సినిమాలు భారీగా వర్కౌట్ కావడం, కలెక్షన్స్ రోజురోజుకీ పెరుగుతూ ఉండడం.. ఇలా అనేక మార్పులు గీతా ఆర్ట్స్ చేతుల్లోనే ఉన్నాయి. ఫ్యూచర్‌లో మరిన్ని భిన్నమైన సినిమాలను తెలుగు ప్రేక్షకులకు అందించే అవకాశాలు ఉండొచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే 'కాంతారా', 'మహావతార్ నర్సింహ', 'ఛావా' వంటి సినిమా లతో మంచి సక్సెస్ అందుకున్న గీతా ఆర్ట్స్ టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్‌కు నాంది పలికింది. కమర్షియల్ సినిమాలకే పరిమితం కాకుండా, భక్తి, చారిత్రక అంశాలతో కూడిన సినిమాలను తెలుగు ప్రేక్షకులకు అందిస్తూ, వారి అభిరుచులను మరింత విస్తృతంగా అన్వేషిస్తోంది. ఇకపై ఇలాంటి ప్రయోగాలు మరిన్ని రావచ్చని అర్థమవుతోంది.

## సమంత సూపర్ ప్లానింగ్.. ఏడాది చివర్లోనే అది కూడా..?



సౌత్ స్టార్ హీరోయిన్ సమంత మన దగ్గర సినిమాలతోనే స్టార్ డం తెచ్చుకోగా నార్త్ సైడ్ మాత్రం వెబ్ సీరీస్ లతో అలరిస్తూ వచ్చింది. అప్పటివరకు సమంత హీరోయిన్ గా మాత్రమే చేస్తుంది అనుకున్న వారందరికీ ఫ్యామిలీ మ్యాన్ 2 సీరీస్ లో ఒక వెరైటీ రోల్ చేసి సర్ ప్రైజ్ చేసింది. సమంత లోని ఈ టాలెంట్ చూసిన బీ టౌన్ ఆడియన్స్ ఆమెకు ఫ్యాన్స్ గా మారిపోయారు. ఫ్యామిలీ మ్యాన్ మేకర్స్ తోనే సిటాడెల్ సీరీస్ ని కూడా చేసింది సమంత. రాజ్ అండ్ డీకే డైరెక్షన్ లో సమంత చాలా కంఫర్టబుల్ గా సీరీస్ లు చేస్తుందని తెలుస్తుంది.ఇదే కాదు సమంత నిర్మాణంలోకి అడుగు పెట్టింది. సమంత తొలి సినిమా శుభం ఈమధ్యనే రిలీజైంది. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లో సమంత నిర్మాతగా చేసిన శుభం కమర్షియల్ లెక్కలు ఎలా ఉన్నా నిర్మాతగా సక్సెస్ కి పేరు తెచ్చి పెట్టింది. ఐతే సమంత తన బ్యానర్ లో మొదట అనౌన్స్ చేసిన సినిమా మా ఇంటి బంగారం. ఆ సినిమాలో సమంత లీడ్ రోల్ గా నటిస్తుందని తెలుస్తుంది. తుపాకి పట్టుకుని సమంత పోస్టర్ తో మా ఇంటి బంగారం సినిమా అనౌన్స్ చేశారు. ఐతే ఆ సినిమా ఏమైందో కానీ సడెన్ గా శుభం అంటూ కొత్త ప్రాజెక్ట్ తో వచ్చి ఆ సినిమాను గట్టిగా ప్రమోట్ చేసి నిర్మాతగా పర్వాలేదు అనిపించుకుంది సమంత. ఇక సమంత బ్యానర్ నుంచి వస్తున్న రెండో ప్రాజెక్ట్ మా ఇంటి బంగారం ఈ సినిమా కూడా షూటింగ్ పూర్తి కావొచ్చిందని తెలుస్తుంది. సమంత ఈమధ్యనే మా ఇంటి బంగారం అప్డేట్స్ త్వరలో వస్తాయని అన్నది. ఐతే తెలుస్తున్న సమాచారం ప్రకారం సమంత ఈ సినిమాను కూడా ఇదే ఇయర్ లో రిలీజ్ ప్లాన్ చేస్తుందని తెలుస్తుంది. అన్నీ కుదిరితే ఈ ఇయర్ డిసెంబర్ లో ఆ సినిమాను వదిలేలా ప్లాన్ చేస్తున్నారట. సమంత నిర్మాతగా ఒకే ఇయర్ లో రెండు సినిమాలు రిలీజ్ చేయడం నిజంగానే గొప్ప విషయమని చెప్పొచ్చు. ఇక సమంత తన నిర్మాణంలో కాకుండా వేరే తెలుగు సినిమాలు ఎప్పుడు చేస్తుందా అని ఆమె ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. స్టార్ సినిమాలకు పూర్తిగా దూరమైన సమంతని మళ్లీ స్టార్ కమర్షియల్ సినిమాల్లో చూడాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరి ఆ ఛాన్స్ ఎవరు ఎప్పుడు ఇస్తారన్నది చూడాలి. సమంత మాత్రం నిర్మాతగా చేస్తున్న సినిమాల్లో తను కూడా భాగమై తన ఫ్యాన్స్ ని అలరిస్తుంది.

## మత్స్య కన్యగా ఫరియా అబ్దుల్లా.. చీరలో చిలిపితనం!

టాలీవుడ్‌కి జాతిరత్నాలు వంటి బ్లాక్‌బస్టర్ మూవీ ద్వారా పరిచయమైన ఫరియా అబ్దుల్లా, మొదటి సినిమా నుంచే తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అందర్నీ ఆకట్టుకుంది. కేవలం హాస్య భరిత పాత్రలకే కాదు, ఫ్యాషన్, గ్లామర్ విభాగాల్లోనూ ఆమె తనదైన స్టయిల్‌తో చూపిస్తోంది. తాజాగా ఫరియా షేర్ చేసిన చీరలోని గ్లామరస్ ఫోటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. ట్రాన్స్‌పరెంట్ స్టైలిష్ చీరలో ఫరియా వేసిన హావభావాలు అద్భుతంగా ఆకర్షిస్తున్నాయి. "మత్స్యకన్య వైబ్స్" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్‌కు తగ్గట్టే, ఆమె ఈ లుక్‌లో ఒక అందమైన జలకన్యలా మెరిసిపోతోంది. చీరతోపాటు స్లీవ్‌లెస్ బ్లౌజ్, లాంగ్ హెయిర్, కాంతివంతమైన మేకప్ ఆమె లుక్‌ని మరింత హైలైట్ చేశాయి. కెమెరా ముందు సునాయాసంగా ఇచ్చిన పోజులు చూసి ఫ్యాషన్ ప్రేమికులు ఫిదా అవుతున్నారు. ఫరియా అబ్దుల్లా మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు పొందినప్పటికీ, ఆ తర్వాత మళ్లీ అదే



స్థాయిలో హిట్స్ అందుకోలేకపోయింది. అయినా, ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, డ్యాన్సింగ్ స్కిల్స్, మరియు కామెడియన్ టైమింగ్ కారణంగా ప్రేక్షకుల్లో ఓ స్థిరమైన క్రేజ్‌ను నిలుపుకుంటోంది. ఇటీవల కొన్ని ఓటీటీ ప్రాజెక్టుల్లోనూ కనిపించిన ఫరియా, కథల ఎంపికలో తనదైన దృష్టిని చూపుతోంది. ఫరియా కెరీర్‌కి ఈ ఫోటోషూట్స్ ఓ వెరైటీ అడ్డా లాగా మారుతున్నాయి. గ్లామరస్ లుక్స్‌తో పాటు ట్రెడిషనల్ డ్రెస్‌లలోనూ ఆమె కనిపిస్తూ, తనలోని గ్లామర్‌కి కొత్తగా నిర్వచనం ఇస్తోంది. ఒక క్రేజీ సీక్వెల్ లో నటిస్తుందన్న వార్తలు ఇప్పటికే బజ్ క్రియేట్ చేస్తున్నాయి. దానికి తోడు ఈ లుక్‌తో ఆమె ట్రెండ్ సెట్ చేయడం ఫ్యాషన్ వర్గాల్లో హైలైట్ అవుతోంది. చూస్తుంటే త్వరలోనే ఈ మత్స్యకన్య ముందు మరిన్ని అవకాశాలు క్యూ కట్టడం ఖాయమే.

## టాలీవుడ్ లో అమ్మడు ఖాళీ అయినట్టేనా..?

చిలసౌ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రుహాని శర్మ ఆ సినిమాలో తన పాత్రతో చాలామంది ఆడియన్స్ కి దగ్గరైంది. ఆ సినిమా డైరెక్టర్ రాహుల్ రవిచంద్రన్ రుహానిని ఎలా ఆడిషన్ చేసి తీసుకున్నాడో కానీ ఆన్ స్క్రీన్ కాదు ఆఫ్ స్క్రీన్ కూడా రుహాని అలానే ఉంటుందా అనిపించేలా తన మ్యాజిక్ చూపించింది. ఐతే చిలసౌ తర్వాత హిట్ ఫస్ట్ కేస్ లో నటించిన అమ్మడు అది పర్వాలేదు అనిపించుకున్నా నెక్స్ట్ కథల ఎంపికలో కాస్త ట్రాక్ తప్పింది. డర్టీ హరి సినిమా చేసిన అమ్మడు ఆ తర్వాత పెద్దగా ఛాన్స్ లు అందుకోలేదు. అవసరాల శ్రీనివాస్ చేసిన నూటొక్క జిల్లాల అందగాడు చేసినా లాభం లేకుండా పోయింది. ఐతే రుహాని శర్మ సినిమాలైతే చేస్తుంది కానీ ఆమె పాపులారిటీ మాత్రం సంపాదించలేకపోయింది. హర్ చాప్టర్ 1, సైంధవ్, ఆపరేషన్ వాలెంటైన్, శ్రీరంగ నీతులు, లవ్ మీ ఇలా చెప్పడానికి కెరీర్ లో చాలా సినిమాలు ఉన్నాయి కానీ



అందులో ఏది ఆమెకు సరైన గుర్తింపు తీసుకు రాలేదు. అంతేకాదు ఆమె గ్రాఫ్ ని పడిపోయేలా చేశాయి. ఐతే రుహాని శర్మ కాన్ఫిడెన్స్ మాత్రం ఎక్కడ లూజ్ అవ్వలేదు. అమ్మడు ఇప్పటికీ తనకు తగిన రోల్ పడితే సత్తా చూపిస్తా అనే అంటుంది. ఐతే తెలుగులో ఒకసారి కెరీర్ డౌన్ అయితే మళ్లీ ఊపందుకోవడం చాలా కష్టం. ఒకటి రెండు కాదు గత రెండేళ్లలో రుహాని చాలా సినిమాల్లో అసలేమాత్రం ఇంపార్టెంట్ లేని పాత్రలు చేసింది. అవన్నీ కూడా ఆమె కెరీర్ కి ఎసరు పెట్టేలా చేశాయి. ప్రస్తుతం అమ్మడు తమిళ్ లో మాస్క్ సినిమా చేస్తుంది. తెలుగులో లక్ కలిసి రాకపోయినా తమిళం లో అయినా అమ్మడి టాలెంట్ ని గుర్తిస్తారేమో చూడాలి. అమ్మడికి తెలుగు ఆఫర్లు ఇక కష్టమే అని చెప్పొచ్చు. తప్పకుండా రుహాని లాంటి యాక్టర్ కి మంచి పాత్రలు పడితే మాత్రం బాగుంటుందని ఆమెను ఇష్టపడే ఆడియన్స్ అంటున్నారు. మరి ఇప్పటికైనా రుహాని ప్రతిభని ఎవరైనా గుర్తిస్తారా లేదా అన్నది చూడాలి. ఐతే రుహాని కూడా చేస్తే హీరోయిన్ గానే చేస్తా లాంటి లెక్కలేమి లేకుండా వచ్చిన ప్రతి రోల్ చేస్తూ వచ్చింది. ఐతే అదే ఆమెను కెరీర్ లో వెనకపడేలా చేసిందని చెప్పొచ్చు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536